RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973

SRAVANTHI Enterprises

OFFSET PRINTERS



We undertake

Printing of

Daily News Papers

హైదరాబాద్ | 05 మార్చ్ 2026 గురువారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:232

# 46 లక్షల మంది మహిళల హెల్త్ ప్రొఫైల్ తయారీకి రంగం సిద్ధం!

**అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా ఈ నెల 8 నుంచి స్క్రీనింగ్ ప్రారంభం**

**టీ డయాగ్నస్టిక్స్ ద్వారా ఒక్కొక్కరికీ 30 రకాల పరీక్షలు**

**ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష**

**4 దశల్లో ఆరోగ్యశాఖ కార్యక్రమాలు**

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** రాష్ట్రవ్యాప్తంగా స్వయం సహాక సంఘాల మహిళల హెల్త్ ప్రొఫైల్ రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కార్యక్రమాన్ని ఈ నెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు ప్రారంభించాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులకు సూచించారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆరోగ్యశాఖ నిర్వహించాల్సిన కార్యక్రమాలపై సెక్రటేరియట్‌లో మంత్రి దామోదర్ రాజనర్సింహ బుధవారం సమీక్ష చేశారు. ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత సత్యనారాయణ, ఆరోగ్యశ్రీ సీఈవో ఉదయ్ కుమార్, డ్రగ్ కంట్రోల్ అథారిటీ డైరెక్టర్ జనరల్ షానవాజ్ ఖాసీం, డీఎంఈ నరేంద్ర కుమార్, టీవీవీపీ కమిషనర్ అజయ్‌కుమార్, డీహెచ్ రవిందర్ నాయక్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 6 నుంచి జూన్ 12 వరకూ 99 రోజులపాటు చేపట్టనున్న కార్యక్రమాలపై ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. హాస్పిటళ్లలో రోజువారీ వైద్య సేవలకు ఆటంకం కలగకుండా 99 డేస్ యాక్షన్ ప్లాన్ ఉండాలని సూచించారు. అధికారులు రూపొందించిన ప్రణాళికను స్వల్ప మార్పులతో మంత్రి ఆమోదించారు. మొత్తం 4 దశల్లో కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు.

తొలి దశలో మార్చి 6 నుంచి 31వ తేదీ వరకు 26 రోజుల పాటు మాతా శిశు సంరక్షణ, కౌమార దశ బాలికలు, వృద్ధుల ఆరోగ్య సేవలపై దృష్టి కేంద్రీకరించనున్నారు. హాస్పిటళ్లలో పారిశుద్ధ్య నిర్వహణ, పెండింగ్ ఫైళ్ల పరిష్కారం, ఆస్తుల వెరిఫికేషన్ వంటి పరిపాలనా పరమైన అంశాలను చక్కదిద్దడంతో పాటు.. క్షేత్రస్థాయిలో రక్తహీనత నివారణ, పాఠశాలలు, అంగన్‌వాడీల్లో పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సెల్ఫ్ హెల్ప్ గ్రూపు మహిళల హెల్త్ ప్రొఫైల్ తయారీ ప్రోగ్రామ్ ను ప్రారంభిస్తారు. తెలంగాణ డయాగ్నస్టిక్స్ సహకారంతో ఒక్కో మహిళకు మొత్తం 30 రకాల పరీక్షలు చేయనున్నారు. మార్చి 8 నుంచి మూడు దశల్లో సుమారు 46 లక్షల మంది మహిళలకు పరీక్షలు చేయనున్నారు. తొలి దశలో ప్రతి జిల్లా నుంచి 5 మండలాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి, రెండో దశలో మరో 10 మండలాల్లో, చివరి దశలో మిగిలిన అన్ని మండలాల్లో స్క్రీనింగ్ చేపట్టనున్నారు. మొత్తం స్క్రీనింగ్‌ను 6 నెలల్లో పూర్తి చేయాలని మంత్రి సూచించారు.



ప్రజాపాలన రెండో దశను ఏప్రిల్ 1 నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తారు. ఈ 15 రోజుల్లో అసంక్రమిత వ్యాధులైన ( చీ శీ అ ఒశీఎ - ఎబఅఅఝ - ఎశ్రీవ ణఱంముంవం) బీపీ, షుగర్, కేన్సర్ వంటి వాటిని గుర్తించేందుకు సబ్ సెంటర్ల పరిధిలో విస్తృతమైన స్క్రీనింగ్ క్యాంపులు ఏర్పాటు చేస్తారు. జిల్లా డే కేర్ కేన్సర్ సెంటర్లలో కీమోథెరపీ సేవలను మ్యాపింగ్ చేయడంతో పాటు, డయాలసిస్ రోగులకు వైరల్ ఇన్ఫెక్షన్ పరీక్షలు తప్పనిసరి చేయాలని మంత్రి ఆదేశించారు.

ఇక ఏప్రిల్ 16 నుంచి మే 15 వరకు సాగే మూడో దశలో అంటువ్యాధుల నియంత్రణ, ప్రజారోగ్య సన్నద్ధతపై యంత్రాంగం దృష్టి సారించనుంది. టీబీ ముక్త్ భారత్ లక్ష్యంగా టీబీ కేసులను గుర్తించడంతో పాటు.. ఎండలు ముదురుతున్న నేపథ్యంలో వడదెబ్బ, డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించి, అత్యవసర మందులను అందుబాటులో ఉంచాలని మంత్రి ఆదేశించారు.

మే 16 నుంచి జూన్ 12 వరకు నాలుగో దశలో పట్టణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను విస్తరించనున్నారు. ముఖ్యంగా జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మేడ్చల్ పరిధిలోని 145 అర్బన్ పీహెచ్‌సీలను పాలిక్లినిక్స్‌గా అప్‌గ్రేడ్ చేసి, స్పెషాలిటీ వైద్య సేవలను అందించాలని మంత్రి సూచించారు. బస్తీల్లో మొబైల్ వెహికిల్స్ ద్వారా వైద్య శిబిరాలు నిర్వహించి పేదలకు వైద్యం చేరువ చేయనున్నారు. ఫుడ్ సేఫ్టీ మేళాలు నిర్వహించి ప్రజల్లో కల్తీ ఆహారంపై చైతన్యం తీసుకురావాలని మంత్రి సూచించారు.

## ఢిల్లీ కి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధిష్టానం పిలుపుతో ఢిల్లీ బయలుదేరారు. రెండు రాజ్యసభ సీట్లు కోసం అభ్యర్థుల ఫైనల్ చేసే అవకాశం వుందని సమాచారం . ఇప్పటికే అభిషేక్ సింగ్వి పేరు ఖరారు అయింది. అయన బుధవారం హైదరాబాద్ చేరుకున్నారు. మరో సీట్ కోసం టీపీసీసీ నేతల మధ్య పోటీ ఏర్పడింది. ఇప్పటికే 16 మంది తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు. రెండో అభ్యర్థి విషయంలో ఇంకా కొలిక్కి రాకపోవడంతో సీఎంను అధిష్టానం ఢిల్లీకి పిలిపించింది. మరో వైపు రాజ్యసభ సీటు పై ఆశావహుల అసంతృప్తి ఎక్కువయింది. మాదిగ సామాజిక వర్గానికి ప్రాధా న్యత ఇవ్వాలి అంటూ రాహుల్ గాంధీ కి మందకృష్ణ మాదిగ బహిరంగ లేఖ రాసారు. బీసీ సామాజికవర్గం నుండి రేసులో వీహెచ్, ఇరవత్రిఅనిల్, మధు యాష్కీ, వినయ్ కుమార్ గౌడ్, నేరెళ్ల శారద వున్నారు. ఎస్సీ సామాజిక వర్గంనుండి,సంపత్,దొమ్మాటి సాంబయ్య వున్నారు రెడ్డి సామాజిక వర్గం నుండి రేసులో వేం నరేందర్ రెడ్డి,చిన్నా రెడ్డి,రోహిన్ రెడ్డి,జీవన్ రెడ్డి,వంశీచందర్ రెడ్డి,కోదండరెడ్డి వున్నారు. ఎస్టీ నుండి రేసులోబెల్లయ్య నాయక్, మైనార్టీ నుండి రేసులోఅజ్జూతుల్లాహుసేన్, షబ్బీర్ అలీ వున్నారు.

**ఇది మనిషి సృష్టించిన విషాదం..**

**ఇరాన్‌లో 165 మంది బాలికల మృతి: కేటీఆర్**

**వార్త 2 లో**

# ఉగాది లోగా పెద్దారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం పనులకు శంకుస్థాపన చేయాలి .

**యుద్ధ ప్రాతిపదికన సింగూరు డ్యామ్ సేఫ్టీ పనులను పూర్తి చేయాలి .**

**జులై నెలాఖరులోగా రైతులకు సాగునీరు అందించాలి .**

**పెద్దారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం పనుల ఞ= లను శరవేగంగా రూపొందించి ప్రభుత్వానికి నివేదిక ను సమర్పించాలి .**

**సింగూరు ప్రాజెక్టు సుందరీకరణ, ప్రాజెక్టు పరిరక్షణ పనులు సాధ్యమైనంత వేగంగా పూర్తి చేయాలి .**

**సింగూర్ ప్రాజెక్టు కాలువల లైనింగ్ పనులను జూన్ 26 లోగా పూర్తిచేయాలని ఇరిగేషన్ శాఖ ఇంజనీరింగ్ అధికారులకు రాష్ట్ర మంత్రులు దామోదర్ రాజనర్సింహ, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి ఆదేశం.**




రాష్ట్ర సచివాలయంలో భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి గారి అధ్యక్షతన సింగూరు ప్రాజెక్టు డ్యాం సేఫ్టీ పై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, మైనింగ్, ఉపాధి కల్పన శాఖ, మెదక్ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి, ఇరిగేషన్ శాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఈ. శ్రీధర్, ఇరిగేషన్ శాఖ ముఖ్య అధికారులు, జుచీజ లు , ఇంజనీరింగ్ శాఖ ముఖ్య అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం జరిగింది.

ఈ సమావేశంలో రాష్ట్రంలో ఎంతో ప్రతిష్టాత్మకమైన సింగూరు డ్యాం సేఫ్టీ పై రాష్ట్ర మంత్రులు దామోదర్ రాజనర్సింహ ఉత్తమ్ కుమార్ రెడ్డి వివేక్ వెంకటస్వామిలు చర్చించారు. డ్యామ్ సేఫ్టీ ప్రభుత్వానికి ఎంతో ప్రాధాన్యత అంశం అన్నారు. నేషనల్ డ్యామ్ సెక్యూరిటీ సంస్థ రూపొందించిన నిబంధనల మేరకు సింగూర్ డ్యాం ను పరిరక్షించాలని మంత్రులు ఇరిగేషన్ శాఖ అధికారులకు ఆదేశించారు. సింగూరు డ్యామ్ సేఫ్టీ నిర్మాణ పనులపై టెక్నికల్ కమిటీని నియమించాలని మంత్రులు ఇరిగేషన్ అధికారులకు సూచించారు.



ఆందోల్ నియోజకవర్గం లో 40 వేల ఎకరాలకు సాగునీరు అందించే పెద్దారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం ఞ= లను శరవేగంగా రూపొందించి ప్రభుత్వానికి అందజేయాలని ఇరిగేషన్ శాఖ అధికారులను మంత్రులు ఆదేశించారు. పెద్దారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంను పనులకు ఉగాదిలోగా శంకుస్థాపన పనులకు శ్రీకారం చుట్టాలని మంత్రులు ఆదేశించారు. సింగూరు ప్రాజెక్టు కాలువల లైనింగ్ పనులను జూన్ 26 లోగా పూర్తి చేయాలని మంత్రులు ఆదేశించారు. సింగూర్ ప్రాజెక్టు సుందరీకరణ , పరిరక్షణ పనులను వెంటనే ప్రారంభించాలని మంత్రులు దామోదర్ రాజనర్సింహ ఉత్తంకుమార్ రెడ్డి వివేక్ వెంకటస్వామి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఆందోల్ నియోజకవర్గం లో చిన్న నీటి ప్రాజెక్టులైనా చెరువుల పునరుద్ధరణ పనుల టెండర్లను పూర్తి చేసి ఈ సీజన్లో రైతులకు సాగునీరు అందించాలని ఆదేశించారు.

ఈ సమీక్ష సమావేశంలో ఇరిగేషన్ శాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఈ శ్రీధర్, ఈఎన్సీలు రమేష్ బాబు, శ్రీనివాస్, టి.శ్రీనివాస్, సంగారెడ్డి జిల్లా ఇరిగేషన్ శాఖ ూజు బి రాజమ్మ, జాయింట్ సెక్రెటరీ శ్రీనివాస్, ఇన్చార్జి ఎస్సీ రఘునాథ్ రావు, ఈ ఈ బీమ్, ఑జు నాగరాజ్, ఇరిగేషన్ శాఖ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# ఇరాన్ కొత్త సుప్రీం నేతగా మోజ్తాబా హుసేన్ ఖమేనీ



టెహ్రాన్ మార్చ్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్);:: ఇరాన్ కొత్త సుప్రీం నేతగా అయతుల్లా ఖమేనీ కుమారుడు మోజ్తాబా హుసేన్ ఖమేనీ ఎన్నికయ్యారు. ఇజ్రాయిలీ మీడియా ఈ విషయాన్ని పేర్కొన్నది. ఇరాన్‌కు చెందిన నిపుణుల అసెంబ్లీ మోజ్తాబాను ఎన్నుకున్నది. అయతుల్లా అలీ ఖమేనీ వారుసుడిగా మోజ్తాబా కొనసాగనున్నారు. 36 ఏళ్ల పాటు ఇరాన్ సుప్రీం నేతగా కొనసాగిన ఖమేనీ.. గత శనివారం అమెరికా-ఇజ్రాయెల్ దళాలు జరిపిన దాడిలో మృతిచెందిన విషయం తెలిసిందే. ఆ దాడిలో ఖమేనీతో పాటు ఆయన కుమార్తె, అల్లుడు, మనువరాలు మృతిచెందారు. గాయపడ్డ ఖమేనీ భార్య మన్సౌరీ ఖోజసేత్ భగేర్జదే రెండు రోజుల తర్వాత ప్రాణాలు విడిచింది.మొజ్తాబా వయసు 56 ఏళ్లు. తన తండ్రి ఖమేనీ అడుగుజాడల్లో రాజకీయ, మతపరమైన వ్యవస్థలను ఆయన నడిచారు. 1969లో మషాద్‌లో మోజ్తాబా జన్మించారు. అలీ ఖమేనీ రెండో కుమారుడు ఆయన. ఆయనకు అయిదుగురు సోదరులు ఉన్నారు. టెహ్రాన్‌లో ఉన్న అలావి ఉన్నత పాఠశాలలో ఆయన చదువుకున్నారు. ఆ తర్వాత ఖోమ్‌లో మోజ్తాబా మతపరమైన విద్య నేర్చుకున్నారు. మతపరమైన శిక్షణలో ఆయన చాన్నాళ్లుగా కొనసాగుతున్నా.. అయతుల్లా ర్యాంక్‌కు మాత్రం ఇంకా చేరుకోలేదు. ఇరాన్-ఇరాక్ మధ్య యుద్ధం సమయంలో.. హబిబ్ బెటాలియన్‌లో మోజ్తాబా విధులు నిర్వర్తించారు. ఇరాన్ సెక్యూర్టీ, ఇంటెలిజెన్స్‌లో ఉన్న ప్రముఖులతో ఆయనకు సంబంధాలు ఉన్నాయి.

## 25 వేల బోగస్ ఉద్యోగుల కుంభకోణం ఫోరెన్సిక్ ఆడిట్‌కు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు?



అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీలపై కేసులు నమోదు చేయాలని స్పష్టం రాష్ట్రంలో భారీ స్థాయిలో ఉద్యోగాల కుంభకోణం వెలుగులోకి వచ్చింది. సుమారు 25 వేల మంది బోగస్ ఉద్యోగులను ఉన్నట్లుగా చూపించి, నెలనెలా జీతాలు తీసుకున్నట్టు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్థిక శాఖకు కఠిన ఆదేశాలు జారీ చేశారు.ఆధార్ లింకేజీతో బయటపడిన మోసం ప్రభుత్వం చేపట్టిన ఆధార్ లింకేజీ ప్రక్రియలో ఈ భారీ అక్రమం బయటపడింది. ఉద్యోగుల పేర్లతో జీతాలు డ్రా చేస్తున్నా, వాస్తవానికి ఆ వ్యక్తులు ఉద్యోగంలో లేరని గుర్తించారు. గత పదేళ్లుగా ఈ మోసం కొనసాగినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఈ కుంభకోణం వల్ల ప్రభుత్వ ఖజానాకు కోట్లాది రూపాయల నష్టం జరిగిందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ప్రజాబలం

05 మార్చ్ 2026 గురువారం

# 400 కోట్ల బంగారం ఎక్కడ

పోలీసుల ఎదుట కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ తో మావోయిస్టు పార్టీ కుదెలైపోయింది. ఇప్పటికే వందలాది మంది మావోలు మృత్యువాత పడగా, పలువురు అగ్రనేతలు పోలీసులు ఎదుట లొంగిపోయారు. దేవ్‌జీ, మల్ల రాజిరెడ్డి, మల్లోజుల వేణుగోపాల్, ఆశన్న, నరసింహారెడ్డి వంటి అగ్రనేతలంతా లొంగిపోవడంతో ఇక ఆ పార్టీ దేశంలో కనుమరుగవ్వడం ఖాయమనే ప్రచారం సాగుతోంది. ఈ క్రమంలో వారు పార్టీ కోసం సేకరించిన డబ్బు, నగలు ఎక్కడున్నాయనే విషయంలో పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది.కేవలం డబ్బు, బంగారమే కాకుండా మావోయిస్టులకు సంబంధించిన పలు విలువైన డ్యాక్యుమెంట్లు, ఆధునిక ఆయుధాలు అడవుల్లో రహస్య ప్రదేశాల్లో దాచి ఉంచినట్లు ప్రచారం సాగుతోంది. వాటి వివరాలను సేకరించడం కోసం కేంద్ర దర్యాప్తు సంస్థలు మావోయిస్టు పార్టీ అగ్రనేతలను తీవ్రంగా ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. మావోయిస్టుల్లో అగ్రనేతలుగా ఉన్నవారంతా ప్రస్తుతం పోలీసుల సమక్షంలో ఉన్నారు. దీంతో పార్టీ నిధులు, నిల్వల గురించి వారికి తెలిసి ఉంటుందన్న కోణంలో విచారిస్తున్నట్లు తెలుస్తోంది. దీనికోసం కేంద్ర నిఘా సంస్థలు ఇప్పటికే హైదరాబాద్ చేరుకున్నాయి. కేంద్ర నిఘా వర్గాలకు చెందిన ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ), నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ), రిసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్ (రా), ఆర్మీ ఇంటెలిజెన్స్‌తో పాటు కేంద్ర సాయుధ బలగాలకు చెందిన సీఆర్‌పీఎఫ్, సీఐఎస్‌ఎఫ్ తదితర బృందాలు ఇప్పటికే వారిని పలు విషయాలపై ప్రశ్నిస్తున్నాయి. గడచిన ఆరు నెలల కాలంలో మావోయిస్టు పార్టీకి చెందిన అగ్రనేతలు ఒక్కరొక్కరుగా లొంగిపోతున్న విషయం తెలిసిందే. వారు లొంగిపోతున్న సమయంలో కొంతమది నేతలు తమ వద్ద ఉన్న ఆయుధాలు, నగదు, డబ్బు పార్టీ అధీష్టానానికి అప్పగించి వచ్చినట్లు చెబుతున్నారు. మరికొంతమంది ఆయుధాలతో లొంగిపోయినప్పటికీ పార్టీకి చెందిన నిధులు, బంగారం మాత్రం అడవుల్లో ఉన్న క్యాడర్ కు అప్పగించి వచ్చినట్లు చెబుతున్నారు. ఇటీవల లొంగిపోయిన కేంద్ర కమిటీ సభ్యులు, పొలిట్‌బ్యూరో మెంబర్ మల్లోజుల వేణుగోపాల్ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని స్పష్టం చేశారు. తాము ఆయుధాలతో విప్లవం రాదు అని నమ్మాం కనుక తమ వద్ద ఉన్న ఆయుధాలతో లొంగిపోయామని, అయితే ఇంకా పార్టీలో ఉన్న క్యాడర్ అడవుల్లో ఉండి పోరాడేందుకు సిద్ధంగా ఉండటంతో తన వద్ద ఉన్న ఆరుకోట్ల రూపాయల నగదు, ఆరు కిల్లో బంగారం పార్టీ నేతలకు అప్పగించి వచ్చినట్లు స్పష్టం చేశారు. దాన్ని భూతల్లి కడుపులోనే దాస్తామని కూడా ఆయన వెల్లడించారు. మావోయిస్టు పార్టీ వద్ద పెద్ద ఎత్తున ఆయుధాలతోపాటు వందల కోట్ల రూపాయలు, అంతకు మించి విలువైన బంగారం ఉందని నిఘా వర్గాలు భావిస్తున్నాయి. ఇటీవలి కాలంలో మావోయిస్టు అగ్రనేతల్లో ఒకరు, పీఎల్‌జీఏ కమాండర్ అయిన బార్సేదేవాను పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. ఆ సమయంలో తెలంగాణ చరిత్రలోనే మొదటి సారిగా మావోయిస్టు డంప్ నుంచి రూ.20 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకోవడం గమనార్హం. అలాగే 48 అత్యంత అధునాతన ఆయుధాలు పోలీసులకు మావోయిస్టులు అప్పగించారు. మావోయిస్టులు కొవిడ్ సమయంలో తమ వద్ద ఉన్న కోట్లాది రూపాయల నగదును బంగారం రూపంలోకి మార్చినట్లు తెలుస్తోంది. ఝార్ఖండ్, ఛత్తీ?సగఢ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఒడిసా, ఏపీ తదితర రాష్ట్రాల్లోని కాంట్రాక్టర్లు, వ్యాపారవేత్తల నుంచి మావోయిస్టులు పార్టీ ఫండ్ సేకరించినట్లు తెలుస్తోంది. ఈ మొత్తాన్ని కేంద్ర కమిటీకి పంపిస్తుంటారు. పార్టీకి నిధుల సేకరించడానకి విస్తృత నెట్‌వర్క్ ఉందని జాతీయ విచారణ సంస్థ (ఎన్ఐఏ) ధృవీకరించింది. ఈ క్రమంలోనే సుమారు రూ.400 కోట్ల విలువైన నగదును బంగారం రూపంలోకి మార్చినట్లు తెలుస్తోంది. అయితే అది ఎవరివద్ద ఉందనేది ప్రస్తుతం సస్పెన్స్..ఇక బీజాపూర్ పోలీసులు మూల్‌వాసీ బచావో మంచ్ (ఎంబీఎం) సభ్యులు ఇద్దరు మావోయిస్టుకు పార్టీకి చెందిన బ్యాంకు ఖాతాలో రూ.6 లక్షలు డిపాజిట్ చేస్తుండగా అరెస్టు చేశారు. మజ్దూర్ సంఘటన సమితి (ఎంఎస్ఎస్) సభ్యులు కొందరు నిధులు సేకరించి, బ్యాంకుల్లో డిపాజిట్లు చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. గతంలో మావోయిస్టు స్పెషల్ ఏరియా కమిటీ సభ్యుడైన ప్రద్యుమ్నశర్మ బంధువు ఒకరు చెన్నైలోని వైద్య కళాశాలలో చేరగా, ఆమె ఫీజుకు కావాల్సిన కోటి 13 లక్షలను బ్యాంకు ఖాతాల ద్వారా ఇచ్చినట్లు ఎన్ఐఏ గుర్తించడం సంచలనంగా మారింది. పార్టీ సానుభూతి పరుల వద్దే ఇంత సొమ్ము ఉంటే ఇంకా పార్టీ డంపులలో ఎంత మేరకు ఉంటుందన్న చర్చ సాగుతోంది. మావోయిస్టు పార్టీ నోట్ల మార్పిడి సమయంలో తీవ్రంగా నష్టపోయినట్లు పార్టీ అగ్రనేతలు చెబుతున్నారు. సుమారు రూ.200 కోట్ల వరకు పాత నోట్లను మార్పిడి చేసేందుకు పార్టీ అగ్రనాయకత్వం ప్రయత్నించినట్లు తెలుస్తోంది.ఈ క్రమంలో కొంతమొత్తాన్ని మార్చినప్పటికీ మిగతది సాధ్యం కాలేదని చెబుతున్నారు. నోట్ల మార్పిడి కోసం పార్టీ సానుభూతిపరులు, ఇతర వర్గాల వారికి పార్టీ నగదును అప్పగించగా వారు డబ్బును మార్చినప్పటికీ తిరిగి పార్టీకి ఇవ్వలేదన్న ప్రచారం ఉంది. దీన్ని అగ్రనేత ఒకరు దృవీకరించారు కూడా. అలా పెద్దమొత్తంలో పార్టీ ఆర్థికంగా నష్టపోయినట్లు నేతలు చెబుతున్నారు.మావోయిస్టు పార్టీ వద్ద సుమారు400 కిలోల బంగారం ఉండి ఉంటుందని దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి. అయితే దాన్ని ఎక్కడ దాచారనేది ప్రస్తుతం చర్చనీయంశంగా మారింది. బంగారాన్ని అంతా అడవుల్లోని డంపు ల్లో దాచి ఉండటారని కేంద్ర, రాష్ట్ర నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. దాదాపు రూ.500 కోట్ల బంగారం మావోయిస్టు పార్టీ వద్ద ఉందనే అనుమానంతో ఆయా సంస్థలు మావోయిస్టులను ప్రశ్నిస్తున్నాయి. అయితే పార్టీ అగ్రనేతలు పార్టీ నిలువుల గురించి నోరు తెరుస్తారా? లేదా అనేది ప్రస్తుతం మిలియన్ డాలర్ల ప్రశ్న.

## ములుగు జిల్లా ఇరిగేషన్ ప్రాజెక్టులపై మంత్రి పొంగులేటి సమీక్ష



హైదరాబాద్ బుధవారం నాడు డా. బీ.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ములుగు జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టుల పురోగతిపై సంబంధిత శాఖ ఉన్నతాధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, ధనసరి అనసూయ సీతక్క, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లాలో కొనసాగుతున్న ప్రధాన ప్రాజెక్టుల పనుల స్థితిగతులు, నిధుల వినియోగం, ఎదురవుతున్న సమస్యలపై అధికారులు వివరణ ఇవ్వగా, పనుల పురోగతిలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా వేగవంతంగా పూర్తి చేసి రైతులకు త్వరితగతిన నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## ఇది మనిషి సృష్టించిన విషాదం.. ఇరాన్‌లో 165 మంది బాలికల మృతి: కేటీఆర్



హైదరాబాద్ మార్చ్ 4 ఇరాన్ పై ఇజ్రాయెల్,అమెరికా దాడులతో మధ్యప్రాచ్యం అట్టుడుకుతోంది. ఇజ్రాయెల్, అమెరికా బలగాలు వైమానికి దాడులతో ఇరాన్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పైన, తన పరిసర దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపైన ప్రతిదాడులు చేస్తోంది. ఫలితంగా పశ్చిమాసియాలో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి.ఈ నేపథ్యంలో ఈ మారణహోమంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కామెంట్ చేశారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన దాడుల్లో ఓ బాలికల పాఠశాల నేలమట్టమవగా.. ఆ శిథిలాల కింద చిక్కుకుని 165 మంది బాలికలు ప్రాణాలు కోల్పోయారు. ఇవాళ వారి అంత్యక్రియలు విషాదకరంగా జరిగాయి.ఈ నేపథ్యంలో.. 'పాఠశాలపై ఇజ్రాయెల్, అమెరికా బలగాలు జరిపిన దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన 165 మంది బాలికల అంత్యక్రియలకు సంబంధించిన భయంకరమైన, మనసును కలచివేసే దృశ్యాలు..' అని పేర్కొంటూ కేటీఆర్ ఆ మరణించిన బాలికల సామూహిక సమాధుల దృశ్యాన్ని తన అధికారిక ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు.యుద్ధం ఆవశ్యకత గురించి చెబుతున్న ఉద్దేశాలు ఏవైనా ఇది మనిషి సృష్టించిన విషాదమేనని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ యుద్ధం రాబోయే తరాలకు బాధను, విషాదాన్ని మాత్రమే మిగిల్చుతుందని తన ఎక్స్ పోస్టులో రాసుకొచ్చారు.

# బాల్కా సుమన్ విడుదల

అదిలాబాద్, మార్చి 4 క్యాతనపల్లిలో మంత్రిపై దాడి కేసులో రిమాండ్‌లో ఉన్న బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ బుధవారం జైలు నుంచి విడుదలయ్యారు. క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికల వేళ చోటు చేసుకున్న ఉద్రిక్త పరిస్థితులు, ఘర్షణలో ఆయన హస్తం ఉందని పోలీసులు అరెస్టు చేశారు. ఇది ఆదిలాబాద్ జిల్లాలో సంచలనంగా మారింది. క్యాతనపల్లి మున్సిపాలిటీ పీఠాన్ని దక్కించుకునే క్రమంలో రాజకీయ పార్టీల మధ్య తలెత్తిన ఘర్షణలు హింసాత్మకంగా మారాయి. ఈ ఘటనలో బాల్క సుమన్ ప్రత్యక్షంగా ప్రమేయం కలిగి ఉన్నారని శాంతిభద్రతలకు విఘాతం కలిగించారని ఆరోపిస్తూ పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. ఈ క్రమంలోనే గత నెల 18వ తేదీన ఆయనను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్ విధించింది. అప్పటి నుంచి ఆయన ఆదిలాబాద్ జిల్లా జైలులో ఉన్నారు. బాల్క సుమన్ అరెస్టు అక్రమమని, కనీస నిబంధనలు పాటించలేదని ఆయన తరుపు న్యాయవాదులు కోర్టులో గట్టిగా వాదించారు. ముఖ్యంగా అరెస్టు చేసే సమయంలో సుప్రీంకోర్టు జారీ చేసిన విధి విధానాలను పోలీసులు పట్టించుకోలేదని ఆరోపించారు. మరోవైపు కేసు తదుపరి విచార కోసం సుమన్‌ను తమ కస్టడీకి అప్పగించాలని పోలీసులు మంచిర్యాల కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఇరు పక్షాల వాదనలను విన్న న్యాయస్థానం పోలీసుల కస్టడీ పిటిషన్‌ను తోసిపుచ్చింది. సోమవారం నాడు ఈ కేసులో కీలక మలుపు తిరిగింది. జిల్లా సెషన్స్ జడ్జి ఏ వీరయ్య బాల్క సుమన్‌కు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ తీర్పు ఇచ్చారు. పాతికవేల పూచీకత్తుతో పాటు ఇద్దరు వ్యక్తుల ష్యూరిటీలు సమర్పించాలని ఆదేశించారు. అయితే ఈ బెయిల్‌తో పాటు కోర్టు కొన్ని కఠిన నిబంధనలను విధించింది. ఈ కేసులో ఏ 1, ఏ2 ఏ4, ఏ8 నిందితులుగా ఉన్న వారు ప్రతి ఆదివారం తప్పనిసరిగా రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌లో హాజరైన సంతకం చేయాలని న్యాయమూర్తి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధర్యంలో రాష్ట్రమంతటా పరిస్థితి దారుణంగా తయారైందని మాజీ ఎమ్మెల్యే బాల్క దుయ్యబట్టారు. క్యాతన్ పల్లి మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మంత్రి వివేక్, ఆయన కొడుకు ఎంపీ వంశీకృష్ణ 14 మంది కౌన్సిలర్లను కొనే ప్రయత్నం చేశారని అన్నారు. బ్లాంక్ చెక్కులు ఇచ్చి ప్రలోభ పెట్టే ప్రయత్నం చేశారని ఆరోపించారు. కోట్లాది రూపాయలు ఆఫర్లు చేసారని.. అయినా తమ వాళ్ళు తలొగ్గలేదన్నారు. దీంతో ఏం చేయాలో అర్థం కాక మంత్రి, ఎంపీ ఇద్దరు ముగ్గురు కాంగ్రెస్ కౌన్సిలర్లకు మందు తాగించి వాళ్ళతో తమ మహిళా కౌన్సిలర్ల మీద దౌర్జన్యం చేశారని మండిపడ్డారు. ప్రజా తీర్పును మంత్రి వివేక్ గౌరవించడం లేదని విమర్శించారు.ఇక అక్కడ గొడవ సందర్భంగా రాళ్లు విసిరినోళ్ళ మీద కేసులు బుక్ కాలేదని... మా 25 మంది మీద కేసులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్నిక సందర్భంగా క్యాతనపల్లి మున్సిపల్ ఆఫీసుకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారని తెలిపారు. మంత్రి వివేక్ కాన్వాయ్ ను ఎలా పంపించారని అడిగితే పోలీసులు తమపై లాఠీ చార్జి చేశారని పేర్కొన్నారు. వాళ్లు దాడి చేస్తే.. మాపైనే రివర్స్‌లో కేసు పెట్టారని మండిపడ్డారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో కేవలం 7 స్థానాల్లో మాత్రమే గెలిచిన కాంగ్రెస్ పార్టీకి మున్సిపల్ పీఠం ఎలా వస్తుందని మండిపడ్డారు. జిల్లాలోని కలెక్టర్ నుంచి తహశీల్దార్ వరకు ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఉద్యోగులుగా కాకుండా విశాఖ ఇండస్ట్రీస్ ఉద్యోగులుగా పనిచేస్తున్నారని ఎద్దేవా చేశారు. జైలు లోపల కూడా తమను ఇబ్బంది పెట్టారని వెల్లడించారు. కొడుకు పుట్టిన రోజు టైమ్ లో ఇంట్లో లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎప్పుడూ కక్ష సాధింపు చర్యలకు దిగలేదని తెలిపారు. అందర్నీ కలుపుకుపోయాం తప్ప.. కక్ష సాధింపు చేయలేదని స్పష్టం చేశారు. నన్ను జైలులో పెట్టారు కదా.. ఇప్పుడు కడుపు మంట తగ్గిందని అనుకుంటున్నా అని అన్నారు. క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్ ఎన్నికను ఇప్పటికైనా సవ్యంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

### జైలు వద్ద కోలాహలం

బాల్క సుమన్ విడుదలవుతున్నారన్న సమాచారంతో ఆదిలాబాద్ జిల్లా జైలు వద్ద బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు భారీ సంఖ్యలో మోహించారు. జైలు గేటు నుంచి ఆయన బయటకు రాగానే శ్రేణులు నినాదాలతో హోరెత్తించాయి. విడుదల అనంతరం జైలు ముందే ఆయన కొద్దిసేపు మీడియాతో మాట్లాడారు. రాజకీయంగా తనను ఇబ్బంది పెట్టేందుకు ఇలాంటి కేసులు పెట్టారని అన్నారు. అనంతం ఆయన అనుచరులతో కలిసి క్యాతనపల్లికి ర్యాలీగా బయల్దేరారు.

### నా కొడుకు పుట్టిన రోజనజైల్లోనే ఉన్నా

మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆదిలాబాద్ జైలు నుంచి బెయిల్‌పై విడుదలయ్యారు. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మునిసిపల్ ఎన్నికల సందర్భంగా నమోదైన కేసుకు సంబంధించి సుమన్ తో పాటు మరికొందరు నేతలు కూడా జైలు నుంచి బయటకు వచ్చారు. జైలు నుంచి విడుదలైన అనంతరం సుమన్ మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పోలీసులు తమపై లాఠీచార్జ్ చేయడమే కాకుండా, రివర్స్‌లో అక్రమ కేసులు పెట్టారని ఆయన మండిపడ్డారు. కేవలం 7 స్థానాల్లో గెలిచిన కాంగ్రెస్, మున్సిపల్ పీఠాన్ని దక్కించుకోవాలని చూడటం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని విమర్శించారు. జిల్లా అధికారులు ప్రభుత్వ ఉద్యోగుల్లా కాకుండా, మంత్రి వివేక్ వెంకటస్వామి వ్యక్తిగత సిబ్బందిలా పనిచేస్తున్నారని ఎద్దేవా చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తాము ఎన్నడూ కక్ష సాధింపు చర్యలకు దిగలేదని, తనను జైలులో పెట్టడం ద్వారా అధికార పార్టీ నాయకుల కడుపు మంట తగ్గిందని అన్నారు. హోలీ పండుగ మరియు తన కుమారుడి పుట్టినరోజున కూడా తనను దూరంగా ఉంచారని ఆయన భావోద్వేగానికి లోనయ్యారు

## నగరంలో మరో కల్తీ నెయ్యి తయారీ కేంద్రం గుట్టు రట్టు

## సుమారు రూ.18.26 లక్షల విలువజేసే కల్తీ నెయ్యి ,తయారీ సామాగ్రిని స్వాధీనం



నగరంలో మరో కల్తీ నెయ్యి తయారీ కేంద్రం గుట్టు బట్టబయలయ్యింది. కమిషనర్స్ టాస్క్‌ఫోర్స్(గోల్కొండ టీమ్),మాసబ్‌ట్యాంక్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో బంజారాహిల్స్ పరిధి భోలానగర్‌లో అక్రమంగా నిర్వహిస్తున్న 'ఫ్రైడ్ డెయిరీ' కల్తీ నెయ్యి తయారీ కేంద్రం వెలుగుచూసింది. సుమారు రూ.18.26 లక్షల విలువజేసే కల్తీ నెయ్యి మరియు తయారీ సామాగ్రిని స్వాధీనం చేసుకుని తయారీకేంద్రాన్ని పోలీసులు సీజ్ చేశారు. భోలానగర్‌కు చెందిన జునైద్ హుస్సేన్ తన ఫ్రైడ్ డెయిరీ యూనిట్‌లో లైసెన్స్ కలిగి ఉన్నప్పటికీ అక్రమ సంపాదన కోసం ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుతూ ఈ కల్తీ నెయ్యి కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. తక్కువ నాణ్యత కలిగిన పామాయిల్,వనస్పతి(డాల్డా), ఇతర హానికరమైన పదార్థాలను ఆవు,గేదె మీగడలో కలిపి కల్తీ నెయ్యిని తయారు చేస్తుండటంతో సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. తయారు చేసిన ఈ కల్తీ నెయ్యిని అసలైన నెయ్యిగా నమ్మిస్తూ ప్రజలకు,హోటళ్లకు,శుభకార్యాల నిర్వాహకులకు విక్రయిస్తున్నారు. పోలీసులు తనిఖీల్లో రూ.18.26 లక్షల విలువజేసే ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 460 కేజీల కల్తీ నెయ్యి, 70 కేజీల కల్తీ మిశ్రమ నెయ్యితో పాటు భారీస్థాయిలో కల్తీకి ఉపయోగించే 2090 కేజీల ఆవు మీగడ,1170కేజీల గేదె మీగడ స్వాధీనం చేసుకున్నారు. నగర అడిషనల్ డిసిపి(టాస్క్‌ఫోర్స్) అందె శ్రీనివాస్‌రావు పర్యవేక్షణలో గోల్కొండ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఆర్ వెంకటేశ్,మాసబ్‌ట్యాంక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్,ఎస్ఐలు విజయానంద్,చందన తదితరులు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

## గంగవరం మండలంలో రోడ్డు ప్రమాదం ఘటన దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు

చిత్తూరు పలమనేరు నియోజకవర్గం,గంగవరం మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదం ఘటన పై చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు గ్రాభ్బంతి వ్యక్తం చేశారు. ఐదు మంది అక్కడికక్కడే మృత్యువాత పడటం తనను తీవ్ర మనో వేదనకు గురిచేసిందన్నారు.మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారికి అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

## మల్లారెడ్డి ఇంటిదగ్గర హోలీ సంబరాలు

సికింద్రాబాద్. బోయిన్ పల్లిలోని మాజీ మంత్రి మల్లరెడ్డి ఇంటివద్ద హ్వాలీ సంబరాలు అంబరాన్నంటాయి. ఎమ్మెల్యే మల్లారెడ్డి ప్రజలందరికి హ్వాలీ శుభాకంక్షాలు తెలిపారు. అన్ని హోలీలకంటే ఈ హ్వాలీ నాకు ప్రత్యేకమైనది ఎందుకంటే, ఈ నెల 19న తన 50వ వివాహ వార్షికోత్సవం ఘనంగా జరుపనున్నట్లు వెల్లడించారు. ప్రజలంతా సుఖసంతోషాలు, బోగబాగ్యాలతో తులతూగలని, గల్ఫ్ వార్ కూడా తొందరగా ముగియాలని భగవంతుడ్ని వేడుకుంటున్నట్లు అయన వెల్లడించారు,.

# ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణను పకడ్బందీగా అమలు చేయాలి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

## పాఠశాలలు, వసతి గృహాలపై నిరంతర పర్యవేక్షణ అవసరం





**కామారెడ్డి ప్రజాబలం ప్రతినిధి** 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశానికి అదనపు ఎస్పీ, డీఎఫ్ఓ, ఏసీ (ఎల్బీ), సబ్ కలెక్టర్, ఏసీ రెవెన్యూ (వీడియో కాన్ఫరెన్స్ ద్వారా), డీపీఓ, డీఆర్‌డీఓ, సీఈఓ జెడ్పీ, డీఎంహెచ్ఓ, డబ్ల్యుఓ, డీఈఓ, ఎస్‌ఈ ఎన్‌పీడీసీఎల్, ఎంసీ కామారెడ్డి, డీఏఓ, డిహెచ్‌ఎస్ఓ, పీడీ హౌసింగ్, సీపీఓ, ఈఈ పీఆర్, ఆర్డీఓ, డీవైఎస్ఓ, అదనపు డీఆర్‌డీఓ (సెర్ప్), బాన్సువాడ, బిచ్కుందా, ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్లు (వీడియో కాన్ఫరెన్స్ ద్వారా), పీడీ మేప్మా, సూపరింటెండెంట్ జి, ఈడీఎం, హెచ్‌హెచ్‌పి తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మార్చి 6 నుంచి జూన్ 12 వరకు "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" కింద ఐదు దశల్లో 99 రోజుల యాక్షన్ ప్లాన్‌ను శాఖల వారీగా 10 థీమ్‌లతో సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రణాళిక శాఖ ఈ కార్యక్రమానికి నోడల్ శాఖగా వ్యవహరిస్తుందని తెలిపారు.

దశల వారీ కార్యక్రమాలు:

ఏప్రిల్ 2 -- గ్రామ స్థాయి గ్రామసభలు

ఏప్రిల్ 16 -- మండల స్థాయి కార్యక్రమం

మే 2 -- నియోజకవర్గ స్థాయి కార్యక్రమం

మే 22 -- జిల్లా స్థాయి కార్యక్రమం

జూన్ 2 -- రాష్ట్ర ఆవిర్భావ వేడుకల సందర్భంగా రాష్ట్ర స్థాయి కార్యక్రమం

మార్చి 6న అన్ని ఉమ్మడి జిల్లాల్లో మంత్రుల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 99 రోజుల కాలంలో శాఖల వారీగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

థీమ్‌ల వారీగా కార్యక్రమాలు:

మార్చి 6--15: పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్‌పై ప్రత్యేక డ్రైవ్. గ్రామాలు, మున్సిపాలిటీలలో తడి--పొడి చెత్త వేరు సేకరణ, పిచ్చి మొక్కల తొలగింపు, చెత్త నిర్మూలన, ప్రభుత్వ భవనాల శుభ్రతపై దృష్టి సారించాలన్నారు.

ఏప్రిల్ 6--11: ఆరోగ్యం -- ఆరోగ్య శిబిరాలు, గర్భిణీలు, చిన్నారులకు ప్రత్యేక పర్యవేక్షణ, పోషకాహార అవగాహన కార్యక్రమాలు.

ఏప్రిల్ 13--18: "అరైవ్--అలైవ్" కార్యక్రమం కింద రోడ్డు భద్రతపై అవగాహన, ట్రాఫిక్ నియమాల అమలు, హెల్మెట్--సీట్‌బెల్ట్ తనిఖీలు.

ఏప్రిల్ 20--25: సంక్షేమం -- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ పథకాల అమలు సమీక్ష.

ఏప్రిల్ 27--మే 2: పిల్లల భద్రత -- డ్రగ్స్‌కు అడ్డుకట్టపై పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు.

మే 4--9: రైతు సంక్షేమం -- వ్యవసాయం, సాగునీరు, ఎరువులు--విత్తనాల సరఫరా, నిరంతర విద్యుత్ అందుబాటు.

మే 11--16: విద్య -- పాఠశాలల మౌలిక వసతులు, పరిశుభ్రత, హాజరు, బోధన నాణ్యతపై సమీక్ష.

మే 18--23: యువత, క్రీడలు -- క్రీడా పోటీలు, యువజనోత్సవాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు.

మే 25--30: మహిళలు -- స్వయం సహాయక సంఘాల బలోపేతం, రుణాల సద్వినియోగం.

జూన్ 1--12: పర్యావరణం -- వృక్షారోపణ, ప్లాస్టిక్ నియంత్రణ, పచ్చదనం పెంపు కార్యక్రమాలు.

పరిశుభ్రత కార్యక్రమాలను మార్చి 6 నుంచి 16 వరకు విస్తృతంగా నిర్వహించాలని, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్లు, రహదారుల వెంట చెత్త నిర్మూలన, తడి--పొడి చెత్త వేరు సేకరణను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. మున్సిపాలిటీల్లో 100 శాతం పన్ను వసూళ్ల లక్ష్య సాధనకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మహిళా సంఘాల రుణాల పంపిణీ, వసూళ్ల లక్ష్యాలను పూర్తి చేయాలని, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

మండల స్థాయి అధికారులు తమ పరిధిలోని పాఠశాలలు, వసతి గృహాలను నిరంతరం పర్యవేక్షిస్తూ భోజన నాణ్యత, పారిశుద్ధ్య పరిస్థితులను ప్రతిరోజూ తనిఖీ చేయాలని స్పష్టం చేశారు.

99 రోజుల ప్రజాపాలన లో భాగం గా లిఉద్యాన మరియు లిపట్టు పరిశ్రమ శాఖ ప్రణాళిక:

1). ఉద్యాన శాఖ ద్వారాలి ఆయిల్ పామ్ సాగు సబ్సిడీ మీద అవగాహన సదస్సు నిర్వహించడం జరుగుతుంది. ఆయిల్ పామ్ వేసుకున్న రైతుల వ్యవసాయ క్షేత్ర ల లో డిమాంట్రేషన్స్ నిర్వహించడం జరుగుతుందిలి .

2. పండ్ల తోటలు ఒ కూరగాయల సాగు చేసే రైతులకి వీ×ణఐ పథకం కింద ప్రభుత్వం ద్వారా అందిస్తున సబ్సిడీ ల మీద అవగాహన సదస్సు నిర్వహించడం జరుగుతుంది.

3. వేసవి కాలం లో కూరగాయల సాగు ని పెంచడానికి రైతులకి కూరగాయల మినీ కిట్స్ నీ అందించి రైతులకి అవగాహన కల్పించడం జరుగుతుంది.

4. మైక్రో ఇరిగేషన్ పథకం ద్వారా ప్రభుత్వం అందిస్తున సబ్సిడీ ల గురించి తెలియచేసి, డ్రిప్ వాడకం దానివల్ల దిగుబడి ఎలా పెరుగుతుంది అని తెలియచేయడం జరుగుతుంది.

5. పట్టు పరిశ్రమ శాఖ ద్వార అందిస్తున సబ్సిడీ గురించి రైతులకి అవగాహన కల్పించడం జరుగుతుంది.

ప్రతిరోజు నిర్వహించిన కార్యక్రమాలపై శాఖల వారీగా సమగ్ర రోజువారీ ప్రగతి నివేదికలు సమర్పించాలని, అమలుపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు.

## జిల్లాలో మార్చి 6 నుండి 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' 99 రోజుల యాక్షన్ ప్లాన్‌పై కలెక్టర్ రాజర్షిషా సమీక్ష



**ఆదిలాబాదు ప్రజాబలం ప్రతినిధి** మార్చి 4, 2026 ఆదిలాబాదు: ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఐటిడిఎ పీఓ యువరాజ్ మర్మాట్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్ లతో కలిసి ఆయన ఈ కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ ప్రణాళిక ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ 99 రోజుల కార్యక్రమం 10 ప్రధాన అంశాల ఆధారంగా సాగుతుందని, ప్రతి అంశానికి ఒక నోడల్ అధికారి పర్యవేక్షణ ఉంటుందని పేర్కొన్నారు. మార్చి 6 నుండి 15 వరకు అన్ని గ్రామాలు, మున్సిపాలిటీలు, ప్రభుత్వ కార్యాలయాలలో పారిశుద్ధ్య డ్రైవ్ పెండింగ్ ఫైళ్ల పరిష్కార కార్యక్రమం చేపట్టాలని, మార్చి 12న కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు, కార్పొరేటర్లు, ఇతర ప్రజా ప్రతినిధులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించేందుకు శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. ఏప్రిల్ 2వ తేదీన జిల్లాలోని అన్ని గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహ జ్యోతి వంటి సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలను చదివి వినిపించాలని తెలిపారు. గ్రామ స్థాయి (ఏప్రిల్ 2), మండల స్థాయి (ఏప్రిల్ 16), నియోజకవర్గ స్థాయి (మే 2), జిల్లా స్థాయి (మే 22) రాష్ట్ర స్థాయిలో (జూన్ 2) ఐదు దశల్లో నిర్వహించబడుతుందన్నారు.

రైతులకు సోలార్ కనెక్షన్ల ప్రయోజనాలు వివరించడం, పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పరిశీలన, మహిళా శిశు సంరక్షణ మరియు పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు భాగస్వాములై విజయవంతం చేయాలని ఆయన ఆదేశించారు.

ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ, డిఆర్డీఓ రవీందర్, ఆర్డీఓ స్రవంతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

## కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఘనంగా హోలీ వేడుకలు.





**నిర్మల్ ప్రజాబలం ప్రతినిధి:** కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో, బుధవారం సాయంత్రం హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ హోలీ వేడుకలలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ దంపతులు, జిల్లా ఎస్పీ జానకి షర్మిల, ఏఎస్పీ సాయికిరణ్, డిఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే, ఇతర అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ వేడుకల్లో భాగంగా ఒకరికొకరు రంగులు చల్లుకుంటూ, హోలీ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో సర్కారుకు విజన్ లేదు... మిషన్ లేదు...

కేవలం కమీషన్లతో పాలన నడిపిస్తూ, అధికారాన్ని కాపాడుకోవడమే లక్ష్యంగా మారింది

గత రెండేళ్లలో సుమారు 60 సార్లు రాష్ట్రంలోని ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీలు పరిపాలనలో స్థిరత్వం లేకపోవడం, ఒక స్పష్టమైన దిశా నిర్దేశం లేకపోవడం వల్లే భారీ స్థాయిలో బదిలీలు

బిజెపి మాజీ ఎమ్మెల్యే డా. ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ గారు విమర్శ

హైదరాబాద్ మార్చ్ 4 ;తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయ్యాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా రెండేళ్ల పాలన పూర్తి చేసుకుంటున్నారు. ఈ రెండు సంవత్సరాల కాలంలో దేశంలోని ఏ రాష్ట్రంలోనూ చూడని విధంగా పరిపాలనా అస్థిరత తెలంగాణలో కనిపిస్తోందని భారతీయ జనతా పార్టీ మాజీ ఎమ్మెల్యే డా. ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ గారు విమర్శించారు.కాంగ్రెస్ సర్కారుకు విజన్ లేదు... మిషన్ లేదు... కేవలం కమీషన్లతో పాలన నడిపిస్తూ, అధికారాన్ని కాపాడుకోవడమే లక్ష్యంగా మారిందని బీజేపీ మాజీ ఎమ్మెల్యే డా. ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ ఘాటుగా విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయ్యాయి. అదే సమయంలో ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి కూడా రెండేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకుంటున్నారు. ఈ రెండు సంవత్సరాల వ్యవధిలో జరిగిన పరిణామాలను చూస్తే, దేశంలో మరే రాష్ట్రంలోనూ ఇలాంటి పరిస్థితి కనిపించలేదేమో అన్న భావన కలుగుతోందని ఎన్.వి.ఎస్.ఎస్. విమర్శించారు.గత రెండేళ్లలో సుమారు 60 సార్లు రాష్ట్రంలోని ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీలు జరిగాయని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా ఇతర ఉన్నతాధికారుల బదిలీలు కూడా దాదాపు 60 సార్లకు పైగానే జరిగాయని తెలిపారు. పరిపాలనలో స్థిరత్వం లేకపోవడం, ఒక స్పష్టమైన దిశా నిర్దేశం లేకపోవడం వల్లే ఇంత భారీ స్థాయిలో బదిలీలు జరుగుతున్నాయని ఆరోపించారు.ఇక ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటనల విషయానికొస్తే, తన పదవిని పదిలం చేసుకోవడానికే 60 సార్లకుపైగా ఢిల్లీకి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ఇది రాష్ట్ర ప్రయోజనాల కంటే వ్యక్తిగత రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని సూచిస్తోందని అన్నారు. మొత్తానికి, ఇది ఒక దశ, దిశలేని ప్రభుత్వం లాగా పనిచేస్తోందని, దూరదృష్టి లోపించిందని, పాలనపై పట్టులేకపోవడమే ఇన్నిసార్లు ఉన్నతాధికారుల బదిలీలకు కారణమని భారతీయ జనతా పార్టీ అభిప్రాయపడుతోందని ప్రభాకర్ స్పష్టం చేశారు.నిన్న జరిగిన కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 99 రోజుల యాక్షన్ ప్లాన్ ప్రకటించి, అన్ని కలెక్టర్లు కనీసం 10 రోజులు గ్రామాల్లోనే ఉండి ప్రజల్లో తిరగాలని ఆదేశించడం గమనార్హమని ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ వ్యాఖ్యానించారు. అంటే గత రెండు సంవత్సరాలుగా అధికారులు గ్రామాల్లో తిరగలేదా? ప్రజలను నేరుగా కలవలేదా? అనే ప్రశ్న సహజంగానే తలెత్తుతోందని అన్నారు. ఇదే విషయాన్ని ఇంతకుముందు జరిగిన సీఎల్పీ సమావేశంలో కూడా ఎమ్మెల్యేలకు "జనాల్లోకి వెళ్లాలి, ప్రజల సమస్యలు పట్టించుకోవాలి" అని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు.ఈ పరిణామాలను బట్టి చూస్తే, "నోబడీ ఈజ్ లిసనింగ్ టు హనరబుల్ సీఎం" అన్న భావన స్పష్టమవుతోందని విమర్శించారు. ముఖ్యమంత్రి చెప్పినా అమలు జరగడం లేదంటే, పాలనపై పట్టులేదనే విషయం బయటపడుతోందని అన్నారు. మొత్తానికి ఈ ప్రభుత్వానికి స్పష్టమైన విజన్ లేదు, మిషన్ లేదు --- కేవలం కమిషన్ కోసం మాత్రమే పని చేస్తున్నట్టుగా కనిపిస్తోందని ఘాటుగా వ్యాఖ్యానించారు.జీహెచ్ఎంసి పరిధిని విస్తరించి 300 సీట్లతో గ్రేటర్ హైదరాబాద్ ఏర్పాటు చేసి, ఆ తర్వాత కొద్ది రోజుల్లోనే మూడు ముక్కలు చేయడం దూరదృష్టి లోపానికి ఉదాహరణ అన్నారు. ఒక నిర్ణయం తీసుకునే ముందు స్పష్టమైన ప్రణాళిక, లక్ష్యం ఉండాలన్నారు. పురపాలక సంఘాల రిజర్వేషన్ల విషయంలో జిహెచ్ఎంసిని ఒకటిగా చూపించి రిజర్వేషన్లు ఖరారు చేసి, అనంతరం మూడు భాగాలుగా విభజించడం రిజర్వేషన్ ప్రక్రియను దెబ్బతీసే చర్యగా కనిపిస్తోందన్నారు.రాష్ట్రంలో రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికలు జరగబోతున్నాయి. ఒకవైపు పార్టీ ఫిరాయింపులకు సంబంధించిన అంశం సుప్రీంకోర్టులో విచారణలో ఉండగా, మరోవైపు స్పీకర్ స్థాయిలో కూడా నోటీసులు జారీ అవుతున్నాయి. కొందరికి క్లీన్ చిట్‌లు ఇస్తున్నారు, మరికొందరు నోటీసులకు సమాధానాల కోసం సమయం కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఒకవైపు బీఆర్ఎస్ పార్టీ.. తాము పోరాడుతున్నామని, తామే నిజమైన ప్రతిపక్షమని చెబుతోంది. అయితే ఇటీవల జరిగిన పురపాలక సంఘాల ఎన్నికల్లో కాంగ్రెస్--బీఆర్ఎస్ మధ్య.. ఉత్తుత్తి పోటీ మాత్రమేనని స్పష్టంగా అర్థమైందని ఎన్.వి.ఎస్.ఎస్. తెలిపారు.గత రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల సమయంలో అవకాశం ఉన్నప్పటికీ బీఆర్ఎస్ పోటీ చేయలేదు. ఇప్పుడు కూడా పోటీపై నిర్ణయం తీసుకోకుండా, స్పష్టత ఇవ్వకుండా కాలయాపన చేయడం వెనుక మతలబు ఏంటని ప్రభాకర్ ప్రశ్నించారు. ఒకవైపు ఫిరాయింపు ఎమ్మెల్యేలు తాము బిఆర్ఎస్‌లోనే ఉన్నామని ప్రకటిస్తుంటే, స్పీకర్ కూడా అదే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. మరికొంతమంది నోటీసులకు సమాధానం ఇవ్వడానికి గడువు కోరుతున్న పరిస్థితి ఉందన్నారు. ఇటువంటి సమయంలో రాజ్యసభ ఎన్నికలు బిఆర్ఎస్‌కు ఒక ఆయుధంగా, ఒక అవకాశంగా మారాయని ప్రభాకర్ పేర్కొన్నారు.ఈ ఫిరాయింపుల అంశం పతాక స్థాయికి చేరుకున్న ఈ తరుణంలో --- అసలు ఏ ఎమ్మెల్యే ఏ పార్టీలో ఉన్నాడన్నది తేల్చుకునే అవకాశం వచ్చినప్పటికీ --- బిఆర్ఎస్ మాత్రం ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నామా లేదా అన్న విషయంపై స్పష్టత ఇవ్వకుండా ఉండటం ప్రజల్లో అనుమానాలకు తావిస్తోందన్నారు.అందుకే బిఆర్ఎస్--కాంగ్రెస్ మధ్య జరుగుతున్నది స్ట్రీట్ ఫైట్ కాదు, స్ట్రెయిట్ ఫైట్ కాదు --- కేవలం "డూప్ ఫైట్" మాత్రమేనని ఘాటుగా వ్యాఖ్యానించారు. విలీనం చేసుకోవాలనుకుంటే బహిరంగంగా ప్రకటించాలి, పొత్తు పెట్టుకోవాలనుకుంటే స్పష్టంగా చెప్పాలి అని బీజేపీ తరఫున నిలదీశారు. కాగితాల మీద పోరాటాలు చేస్తూ ప్రజలను మభ్యపెట్టే రాజకీయాలు ఎంతకాలం కొనసాగుతాయని ప్రశ్నించారు.

# ఉగాదికి ఏం జరగుతుంది...

విజయవాడ, మార్చి 4, ఏపీలో కూటమి ప్రభుత్వం కొత్త నిర్ణయాలు దిశగా అడుగులు వేస్తోంది. అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్న తరుణంలో సమూల మార్పులు తీసుకురావాలని భావిస్తోంది. ముఖ్యంగా పాలనలో విప్లవాత్మక మార్పులు ప్రారంభించాలని చూస్తోంది. అందులో భాగంగా ఒక కొత్త మంత్రిత్వ శాఖను తెరపైకి తెస్తోంది. సైన్స్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ అనే కొత్త శాఖ రానున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ శాఖ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దగ్గరే ఉంది. అయితే దీని పేరిట ప్రత్యేక శాఖను ఏర్పాటు చేసి ఒక మంత్రికి బాధ్యతలు కట్టబెట్టె అవకాశం ఉంది. అయితే ఈ ఒక్క శాఖ కోసం మంత్రివర్గ విస్తరణ చేపడతారా? లేకుంటే భారీ ప్రక్షాళన దిశగా అడుగులు వేస్తారా? అన్నది తెలియాల్సి ఉంది. రేపు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భేటీ ఉంది. ఈ సమావేశంలో మంత్రివర్గ విస్తరణకు సంబంధించి కీలక నిర్ణయం దిశగా అడుగులు వేసే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి ఉగాది నాటికి మంత్రివర్గ విస్తరణ ఉంటుందన్న ప్రచారం నడుస్తోంది. ప్రస్తుతం ఏపీ అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి. మార్చి 7 వరకు కొనసాగనున్నాయి. తరువాత మంత్రివర్గ విస్తరణ పై ఒక క్లారిటీ రానుంది. కానీ అసెంబ్లీ లాబీల తో పాటు ఎమ్మెల్యేలు ఒకచోటకు చేరే క్రమంలో దీనిపైనే చర్చ నడుస్తోంది. ప్రముఖంగా ఓ ఐదుగురు పేర్లు వినిపిస్తున్నాయి. అయితే సమూల ప్రక్షాళన ఉంటుందన్న ప్రచారం మాత్రం నడుస్తోంది. టిడిపి నుంచి చాలామంది మంత్రులను తొలగించి కొత్త వారికి అవకాశం ఇస్తారని తెలుస్తోంది. అయితే ఇప్పటికే మెగా బ్రదర్ నాగబాబు కు మంత్రి పదవి ఖాయమని ఏనాడో తేలిపోయింది. అయితే కొత్తగా ఏర్పాటు చేసే సైన్స్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ శాఖను ఆయనకు అప్పగించే అవకాశం ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమావేశం రాజకీయంగా ఆసక్తికరంగా మారింది. హోలీ రోజున ఈ ఇద్దరు లంచ్ మీటింగ్ ఏర్పాటు చేసుకోవడానికి గల కారణాలపై అనేక రకాలుగా చర్చ జరుగుతుంది. కేవలం నామినేటెడ్ పోస్టులు, పాలనాపరమైన విషయాలపై చర్చించడానికి ఈ భేటీ జరిగిందని ఎవరూ అనుకోవడం లేదు. బలమైన కారణం ఉంటుందనే భావిస్తున్నారు. తిరుమల లడ్డూ వ్యవహారం ప్రధానంగా కూటమి ప్రభుత్వానికి ఇబ్బందిగా మారిందని సొంత పార్టీ నేతలే అభిప్రాయపడుతున్నారు. అనవసరంగా లడ్డూను పొడిగించి దానిని తెగే వరకూ టీడీపీ నాయకత్వమే లాగుతున్నారని సొంత పార్టీ నేతల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు తాజాగా తిరుమలకు సంబంధించిన అనేక విషయాలు సోషల్ మీడియాలో నెట్టింట్ కనిపించడం, దానిపై ఎవరూ ఎటువంటి ప్రకటన చేయకపోవడంతో అది కూడా తమ ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తుందని భావిస్తున్నారు. అందుకోసమే ప్రధానంగా ఈ సమావేశం జరుగుతుందని తెలిసింది. ప్రభుత్వాన్ని బద్నాం చేయడానికి అనేక రకాలుగా ప్రయత్నాలు చేస్తారని, ప్రజల్లోకి మాత్రం కూటమి ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతుందన్న అభిప్రాయం కూడా నేతల్లో కలుగుతుంది. అనవసరంగా రాద్ధాంతం చేయకుండా దీనికి ఫుల్ స్టాప్ ఎలా పెట్టాలి? ఎండ్ కు ఎలా తీసుకెళ్లాలన్న దానిపైనే చంద్రబాబు, పవన్ కల్యాణ్ ల మధ్య చర్చ జరిగే అవకాశముందని పార్టీ నేతలు చెబుతున్నారు. కూటమిలోని టీడీపీ, జనసేన ప్రజాప్రతినిధులు చాలా జాగ్రత్తగా ఉండాలని, ప్రధానంగా వివాహేతర సంబంధాల విషయాలు కూటమి ప్రభుత్వాన్ని ఇబ్బందికరంగా మారాయి. ఇటీవల రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ను లక్ష్యంగా చేసుకోవడంతో పాటు తాజాగా మరొక దేవస్థానం కమిటీ ఛైర్మన్ పై కూడా ఆరోపణలు చేయడం పార్టీ ప్రతిష్ట మంటగలుస్తుందని, ఇటువంటి విషయాలు ప్రజల్లోకి వేగంగా, తొందరగా చొచ్చుకు వెళతాయని అందుకే దీనిపై ఎలా ముందుకు వెళ్లాలన్న దానిపై పవన్, చంద్రబాబు నాయుడులు చర్చించినట్లు సమాచారం. అయితే యాక్షన్ తీసుకుంటే ఎలా ఉంటుంది? తీసుకోకుండా దీనిపై ఎలా ముందుకు వెళ్లాలన్న దానిపై కూడా చర్చ నడిచినట్లు విశ్వసనీయ సమాచారం. కూటమిలో బీజేపీ నేతల జోలికి వెళ్లే ధైర్యం లేక, జనసేన, టీడీపీ నేతలనే వైసీపీ లక్ష్యంగా చేసుకుందన్న అభిప్రాయం కూడా ఈ భేటీలో వ్యక్తమయినట్లు తెలిసింది

# రంగంలోకి దిగిన ఏకసభ్య కమిషన్

తిరుమల, మార్చి 4, తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో వాడే నెయ్యి కల్తీ వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ వ్యవహారంపై మరింత లోతైన విచారణ కోసం, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చూడటం కోసం విశ్రాంత ఐఏఎస్ అధికారి దినేష్ కుమార్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ ఇప్పుడు తన విచారణను వేగవంతం చేసింది. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)కి సరఫరా అయిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందన్న నివేదిక బయటకు రావడంతో కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. ఈ అంశంపై ఇప్పటికే సిట్, సిబిఐ విచారణలు చేశాయి. వాటిని ఆధారంగా చేసుకుని గత ప్రభుత్వ హయాంలో నెయ్యి సేకరణ విధానాలు, టెండర్ల ప్రక్రియ, నాణ్యత పరీక్షల్లో జరిగిన లోపాలను వెలికితీయడానికి ప్రభుత్వం దినేష్ కుమార్ కమిషన్‌ను నియమించింది. దినేష్ కుమార్ కమిషన్ కేవలం కల్తీ జరిగిందా లేదా అని తేల్చడానికే పరిమితం కాకుండా, వ్యవస్థాగత మార్పులపై దృష్టి సారించనుంది. తక్కువ ధరకే నెయ్యి సరఫరా చేసేందుకు కంపెనీలు ఎలా ముందుకు వచ్చాయి? నిబంధనల ఉల్లంఘన జరిగిందా? అన్నది పరిశీలిస్తుంది. టీటీడీ ల్యాబ్‌లలో పరీక్షలు ఎందుకు విఫలమయ్యాయి? సరఫరాదారులు పంపిన నమూనాలను నిశితంగా ఎందుకు పరిశీలించలేదు? లాంటి అనేక అంశాలను సమీక్షిస్తుంది. గత బోర్డు నిర్ణయాల్లో రాజకీయ ఒత్తిళ్లు ఏమైనా ఉన్నాయా అన్న కోణంతో పాటు భవిష్యత్తులో నెయ్యి సేకరణ ఎలా ఉండాలి? స్వచ్ఛమైన ఆవు నెయ్యిని సేకరించేందుకు అత్యుత్తమ మార్గాలేవి? అనే అంశాలపై నివేదిక ఇవ్వనుంది. కమిషన్ ఇప్పటికే తన కార్యకలాపాలను ప్రారంభించింది. తిరుమల చేరుకున్న దినేష్ కుమార్, నెయ్యి ట్యాంకర్ల రికార్డులు, మార్కెటింగ్ విభాగం ఫైళ్లను కమిషన్ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. గత ఐదేళ్లలో నెయ్యి సరఫరా చేసిన కాంట్రాక్టర్ల వివరాలు, వారి అర్హతలు, అప్పట్లో టీటీడీ అధికారులు తీసుకున్న నిర్ణయాలపై ఆరా తీస్తున్నారు. ముఖ్యంగా, రివర్స్ టెండరింగ్ పేరుతో నాణ్యతను పక్కన పెట్టి ధరకే ప్రాధాన్యత ఇవ్వడం వల్లనే ఈ సమస్య తలెత్తిందా అన్నది కమిషన్ ప్రధానంగా విశ్లేషిస్తోంది. ఈ కమిషన్ ఏర్పాటుపై ప్రతిపక్షాల నుండి కొన్ని విమర్శలు వ్యక్తమయ్యాయి. ఇప్పటికే సిట్ విచారణ జరుగుతుండగా, మళ్లీ ఐఏఎస్ కమిషన్ అవసరమా అన్నది వారి ప్రశ్న. అయితే, సిట్ అనేది క్రిమినల్ కోణంలో ఎవరు నేరం చేశారనేది విచారిస్తుంది, కానీ దినేష్ కుమార్ కమిషన్ పరిపాలనాపరమైన లోపాలను సరిదిద్దడానికి ఉద్దేశించినదని ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది. దినేష్ కుమార్ కమిషన్ ఇచ్చే నివేదిక టీటీడీ చరిత్రలో అత్యంత కీలకం కానుంది. కేవలం నిందితులను శిక్షించడమే కాకుండా, రాబోయే రోజుల్లో తిరుమలకు నెయ్యి సరఫరా చేసే కంపెనీలకు కఠినమైన నిబంధనలు, అత్యాధునిక ల్యాబ్ పరీక్షలు, పారదర్శకమైన సేకరణ విధానాలను ఈ కమిషన్ సూచించనుంది. ఈ విచారణ ద్వారా వాస్తవాలు బయటకు వచ్చి, శ్రీవారి ప్రసాదానికి మళ్లీ పూర్వ వైభవం లభిస్తుందని భక్తులు ఆశిస్తున్నారు

# తమిళనాడుపై రోజా ఫోకస్

తిరుపతి, మార్చి 4, ఏపీ రాజకీయాల్లో ఫైర్ బ్రాండ్ గా గుర్తింపు పొందిన రోజా ఇప్పుడు తమిళంపై ఫోకస్ పెట్టినట్లు కనిపిస్తున్నారు. ముఖ్యంగా అక్కడి డీఎంకే అధినేత స్టాలిన్ పుట్టినరోజు వేడుకలకు హాజరై సందడి చేశారు రోజా. డీఎంకేకు మద్దతుగా తన గళం వినిపించారు. సమాజంలో మహిళల అభ్యున్నతికి కృషి చేస్తున్న స్టాలిన్ సర్కార్ ను మరోసారి ఎన్నుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారుస్టాలిన్ అందిస్తున్న సంక్షేమ పథకాలను రోజా ఆకాశానికెత్తారు. ముఖ్యంగా తమిళనాడులో మహిళల ఆర్థిక భద్రత కోసం ప్రతినెలా వారి ఖాతాల్లో నేరుగా వెయ్యి రూపాయలు జమ చేయడం వంటి పథకాలు మహిళా సాధికారతకు నిదర్శనమని ఆమె కొనియాడారు. ఇదే తరుణంలో ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఏపీలో మహిళలకు నేరుగా నగదు అందిస్తామని హామీ ఇచ్చి రెండేళ్లు గడుస్తున్నా, ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ పట్ల ప్రజల్లో ఉన్న ఆదరణను చూసి ప్రతిపక్షాలకు భయం పట్టుకుందని రోజా వ్యాఖ్యానించారు. ఇటీవల మహిళల ఖాతాల్లో ఒకేసారి ఐదు వేల రూపాయలు జమ చేయడంతో విపక్ష నేతలకు ఏం చేయాలో పాలుపోవడం లేదని ఎద్దేవా చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని తాను పూర్తిస్థాయిలో సమర్థిస్తున్నానని, దీనివల్ల కూలి పనులకు వెళ్లే పేద మహిళలకు, విద్యార్థులకు ఎంతో ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని అభిప్రాయపడ్డారు. ఇంతటి గొప్ప మనసున్న నాయకుడిని తమిళ ప్రజలు భారీ మెజారిటీతో మళ్లీ గెలిపించుకోవాలని, సంక్షేమ పథకాల ద్వారా పొందుతున్న లబ్ధికి ప్రతిఫలంగా స్టాలిన్‌కు ఓటు వేసి రుణం తీర్చుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఒకవైపు ఏపీ రాజకీయాల్లో చురుగ్గా ఉంటూనే, తమిళ గడ్డపై డీఎంకే తరపున రోజా గళం విప్పడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. యస్సార్ కాంగ్రెస్ పార్టీ తమిళనాడు ఎన్నికల్లో స్టాలిన్ పార్టీకి మద్దతుగా నిలవాలని చూస్తోంది. ఎందుకంటే తమిళనాడులో తెలుగు ప్రజలు అధికం. ఆపై రాయలసీమకు దగ్గరగా ఉంటుంది తమిళనాడు. ఈ క్రమంలో మరికొద్ది రోజుల్లో జరిగే ఎన్నికల్లో స్టాలిన్ పార్టీ గెలవాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలంగా కోరుకుంటుంది. కరుణానిధి ఉండే సమయంలో చంద్రబాబుతో ఆయనకు మంచి సంబంధాలు ఉండేవి. స్టాలిన్ విషయానికి వస్తే చంద్రబాబుతో మంచి సంబంధాలే కానీ.. కేంద్రంలో బిజెపితో టిడిపి ఉండడంతో స్టాలిన్ స్నేహానికి అడ్డంకిగా మారింది. అదే సమయంలో జగన్మోహన్ రెడ్డితో మంచి సంబంధాలు కొనసాగిస్తూ వచ్చారు స్టాలిన్. ఈ నేపథ్యంలో తమిళనాడు ఎన్నికల్లో స్టాలిన్ పార్టీకి మద్దతుగా ప్రచారం చేయాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నిర్ణయించినట్లు సమాచారం. బలం పెంచుకోవాలనుకుంటున్న బిజెపి.. తమిళనాడులో బలం పెంచుకోవాలని చూస్తోంది భారతీయ జనతా పార్టీ. సార్వత్రిక ఎన్నికల్లో ఓటు షేర్ పెరిగింది ఆ పార్టీకి. సీట్ల పరంగా ఒక్కటి కూడా రాకపోయినా ఓట్ల పరంగా మాత్రం మెరుగుపడింది. అందుకే ఈసారి మిత్రులతో ముందుకు సాగాలని నిర్ణయించింది. ఎట్టి పరిస్థితుల్లో అధికార పార్టీకి ధీటుగా నిలబడాలని చూస్తోంది. ఏ అవకాశాన్ని జారవిడుచుకోవడం లేదు.. ఇటువంటి పరిస్థితుల్లో ఆచితూచి వ్యవహరిస్తోంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. ఏపీలో కూటమిపై విమర్శలు చేస్తుందే తప్ప.. కేంద్ర బిజెపిని పల్లెత్తు మాట అనడం లేదు. అయితే ఇప్పుడు తమిళనాడులో వైసిపి తీసుకున్న స్టాండ్ తో బిజెపి ఎలాంటి చర్యలకు దిగుతుందో చూడాలి. అయితే ఇప్పటివరకు కేంద్ర బిజెపి విషయంలో వైసీపీ సానుకూల నిర్ణయాలు తీసుకుంటూ వస్తోంది. లోక్సభ స్పీకర్ ఎంపిక నుంచి పార్లమెంట్లో ప్రవేశపెట్టి పలు బిల్లుల వరకు మద్దతు తెలిపింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అటువంటిది తమిళనాడులో డీఎంకే కూటమికి మద్దతు అంటే సాహసంతో కూడుకున్న పని. అయితే అది రోజా స్వయంగా తీసుకున్న నిర్ణయమా? పార్టీ తీసుకున్న నిర్ణయమా? అన్నది తెలియాల్సి ఉంది. ఒకవేళ రోజా సొంతంగా నిర్ణయం తీసుకుంటే మాత్రం వైసీపీని ఇరకాటంలో పెట్టినట్టే..

# హైదరాబాద్ కు గంటన్నర లోపే...

విజయవాడ, మార్చి 4తెలంగాణ రాష్ట్రంలోని ఫ్యూచర్ సిటీ నుంచి ఏపీ రాజధాని అమరావతి మధ్య ప్రతిపాదిత గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేకు సమాంతరంగా అత్యాధునిక సెమీ బుల్లెట్ ట్రైన్ రానుంది. ఇది అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నుంచి అమరావతికి గంటన్నరలో దూసుకెళ్లొచ్చు. హైదరాబాద్ నుంచి చెన్నైకు కేవలం 3 నుంచి 3.30 గంటల్లోనే చేరుకోవచ్చు. మార్గంలో సెమీ బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు పనులు ప్రారంభానికి వేగంగా అడుగులు పడుతున్నాయి. హైస్పీడ్ కారిడార్ అలైన్‌మెంట్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన సూచనలతో ప్రాజెక్టు స్వరూపమే పూర్తిగా మారిపోయింది. గతంలో పేర్కొన్న రూట్‌కు బదులు ప్రస్తుతం నిర్మించే గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే పక్కనుంచే రైల్వేలైన్ వేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ప్రభుత్వం ప్రతిపాదనకు రైల్వేశాఖ పచ్చజెండా ఊపింది. దీంతో హైదరాబాద్ నుంచి అమరావతి మీదుగా చెన్నైకు వెళ్లే హైస్పీడ్ రైలుకు మిర్యాలగూడ మీదుగా సాగే కొత్త మార్గంలో ప్రాథమిక సర్వే పూర్తిచేసి, అలైన్‌మెంట్ డ్రాఫ్ట్‌ను రైల్వే బోర్డు సిద్ధం చేసింది. హైదరాబాద్ టూ చెన్నై హైస్పీడ్ రైల్వే ప్రాజెక్టు పూర్తయితే.. ఏపీ, తెలంగాణ రాజధానుల మధ్య దూరం సగానికిసగం తగ్గుతుంది. ప్రస్తుతం రైలులో హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లాలంటే ఐదు గంటల సమయం పడుతుంది. అదే సెమీ బుల్లెట్ ట్రైన్ అందుబాటులోకి వస్తే గంటన్నర సమయంలోనే హైదరాబాద్ నుంచి ఏపీ రాజధానికి చేరుకోవచ్చు. ఇదిలాఉంటే.. ఒకే కారిడార్‌లో రోడ్డు, రైలు మార్గాలు ఉండటం వల్ల లాజిస్టిక్స్ ఖర్చు భారీగా తగ్గుతుంది. సెమీ బుల్లెట్ ట్రైన్ గంటకు 250 కిలోమీటర్ల పైచిలుకు వేగంతో దూసుకుపోయేలా టెక్నాలజీని వినియోగిస్తారు. దీంతో ఈ కారిడార్‌ను నేరుగా చెన్నై వరకు పొడిగించడం ద్వారా హైదరాబాద్ టూ చెన్నైకు మూడు నుంచి మూడున్నర గంటల్లోనే చేరుకోవచ్చు. ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని రాబోయే ఐదేళ్లలోపు పూర్తి చేయాలని పక్కా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. డీపీఆర్ పూర్తయిన వెంటనే ఏపీ గ్రామాల మీదుగా అలైన్‌మెంట్ వెళ్తుందనే కచ్చితమైన వివరాలతో త్వరలో నోటిఫికేషన్లు వెలవడే అవకాశం ఉంది.

# అప్పలరాజుకు దూరమౌతున్న కేడర్

శ్రీకాకుళం, మార్చి 4 మాజీమంత్రి సీదిరి అప్పలరాజుకు.. ఏపీ రాజకీయాల్లో ఫైర్ బ్రాండ్ అని పేరు. 2019లో పలాస నుంచి మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచినా.. జగన్ కేబినెట్‌లో కీలక శాఖ దక్కించుకున్నారు. అప్పట్లో మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణలోనూ పదవి నిలబెట్టుకున్నారు. జగన్‌కి నమ్మినబంటులా ఉంటూ వస్తున్న ఆయన.. అధినేతపై ఎవరు విమర్శలు చేసినా.. వెంటనే కౌంటర్ ఎటాక్ చేస్తుంటారు. అలాంటి నాయకుడిపై ఇప్పుడు సొంత పార్టీలోనే ఇబ్బందులు ఎదురవతున్నాయా అనే ప్రచారం జరుగుతోంది. పార్టీలో లుకలుకలతో ఆయన సర్దుబాటు కావడం లేదట. అసమ్మతి నేతలు ఆయనకు మరింత తలపోటుగా మారారనే గుసగుసలు వినిపిస్తున్నాయ్. తన గెలుపులో కీలకంగా వ్యవహరించిన నేతలను.. సీదిరి పక్కన పెట్టారనే చర్చ ఎప్పటి నుంచో వినిపిస్తోంది. ఓ కోటరీని నమ్ముకొని.. దాని మధ్యలోనే ఉండిపోయారనే విమర్శలు వినిపిస్తున్నాయ్. దువ్వాడ శ్రీకాంత్‌తో పాటు.. దువ్వాడ హేంబాబు చౌదరి, మాజీ మున్సిపల్ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు లాంటి సీనియర్ నేతలు.. వైసీపీని విడిచి వెళ్లిపోయింది కూడా సీదిరి తీరు నచ్చకే అనే చర్చ కూడా జరుగుతోంది. ఐతే ఈ ప్రభావం గత ఎన్నికల్లోనూ కనిపించింది. గత ఎన్నికల్లో గౌతు శిరీష చేతుల్లో భారీ పరాభవాన్ని మూటగట్టుకున్నారు సీదిరి. ఐతే ఓటమి తర్వాత కూడా ఆయనలో ఎలాంటి మార్పు కనిపించడం లేదని.. పలాస నేతల్లో చర్చ జరుగుతోంది. రాష్ట్ర రాజకీయాలపై ఎప్పటికప్పుడు స్పందించే సీదిరి.. నియోజకవర్గంలో మాత్రం పార్టీని పట్టించుకోవడం లేదని.. తన చుట్టూ ఉన్న వారితోనే పార్టీని నడపాలని చూస్తున్నారని ఫ్యాన్ పార్టీ నేతల్లో ఆగ్రహం కనిపిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో వైసీపీలో కీలకంగా ఉన్న ప్రస్తుత మున్సిపల్ చైర్మన్ బల్లగిరిబాబు, మరో సీనియర్ నేత దువ్వాడ శ్రీధర్ కూడా తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. ఇలా సీదిరి తీరు నచ్చక.. నేతలంతా ఒక్కొక్కరిగా దూరం అవుతున్నారనే గుసగుసలు పలాసలో జోరుగా వినిపిస్తున్నాయ్. పార్టీ కోసం కష్టపడే వారిని.. సీదిరి అప్పలరాజు కనీసం పట్టించుకోవడం లేదంటూ.. వైసీపీ కార్యకర్తలు బహిరంగంగానే విమర్శలు గుప్పించే పరిస్థితులు కనిపిస్తున్నాయనే టాక్ నడుస్తోంది. వైసీపీలో కీలక నేతగా ఉన్న దువ్వాడ శ్రీధర్.. సీదిరికి వ్యతిరేకంగా ఓ గ్రూప్ క్రియేట్ చేస్తున్నారు.

పలాస ఉద్యమాన్ని ఎత్తుకున్నారు. పలాసను జిల్లా చేయాలంటూ జేఏసీ ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇవన్నీ.. మాజీమంత్రి సీదిరి అప్పలరాజుకు తలపోటుగా మారాయనే చర్చ జరుగుతోంది. అటు పార్టీ అసలే కష్ట కాలంలో ఉంది. ఇలాంటి సమయంలో నేతలంతా ఒక్కొక్కరుగా దూరం అవుతుండడంతో.. కేడర్ కూడా డీలా పడిపోతోందట. సీదిరి దూకుడు రాజకీయాలతో.. అసలుకే మోసం వస్తుందని.. కార్యకర్తలు వాళ్లలో వాళ్లు చర్చించుకున్నారని తెలుస్తోంది. పార్టీలో గ్రూప్‌ల గోల ఎక్కువ అయితే.. ఎన్నికల నాటికి మరింత ఇబ్బంది అవుతుందని.. అందరిని కలుపుకొని వెళ్లినప్పుడే రాజకీయంగా గౌతు కుటుంబాన్ని ఢీకొట్టే అవకాశం ఉంటుందని.. ఫ్యాన్ పార్టీలో మరికొందరు నేతలు సూచిస్తున్నారు.

# ఎమ్మెల్యే వర్సెస్ ఎంపీ

విజయవాడ, మార్చి 4, తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని చిన్నిల మధ్య మరోసారి రగడ మొదలయింది. దేవుడి ముందే చిల్లర తగవు పడటం మరింతగా ఇద్దరూ రాజకీయంగా దూరమయినట్లేనని చెబుతున్నారు. స్వామి వారికి సమర్పించే పట్టువస్త్రాలను అవమానించే విధంగా ప్రవర్తించారని ఇరు వర్గాలు ఆరోపించుకుంటున్నాయి. తిరువూరులో ఎమ్మెల్యే కొలికపూడి.. ఎంపీ కేశినేని చిన్ని మధ్య వివాదం రేగింది. గంపలగూడెంలోని నెమలి వేణుగోపాలస్వామి కళ్యాణం సందర్భంగా పట్టువస్త్రాలు ఎవరు సమర్పించాలనే విషయంలో వివాదం తలెత్తింది. ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం.. తోపులాటజరగడంతో పోలీసులు సర్ది చెప్పి పంపాల్సి వచ్చింది. ఎంపీ కేశినేని చిన్ని పట్టువస్త్రాలు సమర్పించడానికి ప్రయత్నించగా అతని తలపై ఉన్న వస్త్రాలను కొలికపూడి శ్రీనివాసరావు లాక్కున్నారు. ఇద్దరి వ్యవహారంపై అర్చకులు సహా భక్తుల ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇరువురు నేతలు గౌరవమైన పదవులలో ఉండి ఆలయంలో ఇవేం చిల్లర వేషాలు అంటూ భక్తుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్వామి వారికి ఎవరో ఒకరు పట్టు వస్త్రాలు సమర్పించాలి కానీ, అక్కడ కూడా ఆధిపత్యం, రాజకీయాలు చేస్తే ఎలా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి చిల్లర తగాదాలతో ఇద్దరూ ప్రజల్లో పలుచన అవుతున్నారన్న భావన వ్యక్తమవుతుంది. ఇరువురు ఒకేసారి ఆలయంలోకి రావడంతో ఈ పరిస్థితి తలెత్తింది. రెండు వర్గాలకు చెందిన నేతలు తోపులాటలు ఆలయంలో చోటు చేసుకోవడం దురదృష్టకరమని అంటున్నారు. రాజకీయ నాయకులటీడీపీ అధిష్టానానికి తలనొప్పిగా ఇద్దరి వ్యవహారం మారింది. గతంలో అనేక సార్లు వీరిద్దరి మధ్య వివాదానికి చెక్ పెట్టాలని ప్రయత్నం చేసినా ఫలితం కనిపించడం లేదు. చంద్రబాబు హెచ్చరించినా ఫలితం లేదు. చంద్రబాబు మాత్రం సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటామని చెబుతున్నారు. పార్టీ క్రమశిక్షణ కమిటీ కూడా వీరిద్దరి విషయంలో ఏమీ చేయలేక పోతుందని సొంత పార్టీ నుంచి కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఇటీవల ఇరువురు నేతలు సోషల్ మీడియా వేదికగా రచ్చ చేసుకోవడంతో పార్టీ పరువు బజారున పడింది. ఇప్పుడు ఏకంగా ఆలయంలోనే ఘర్షణకు దిగడంతో ఇక తిరువూరు యుద్ధంలో ఏదో నిర్ణయం తీసుకోకపోతే పార్టీ వచ్చే ఎన్నికల్లో గెలిచే అవకాశాలు లేనట్లే కనిపిస్తున్నాయి.

# ఫర్నిచర్ దుకాణాల్లో అగ్ని ప్రమాదం



హైదరాబాద్: బాచుపల్లి సమీపంలో ప్రగతినగర్ లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. రోడ్డు పక్కన ఫర్నిచర్ షాపులో మంటలు చెలరేగాయి. ఫుట్పాత్పై ఉన్న షాపుల్లో ఒక్కొక్కటిగా మంటలు అంటుకున్నాయి. 50 షాపులకు మంటలు వ్యాపించాయి. . మంటల్లో రూ. కోటి విలువైన ఫర్నిచర్ దగ్ధం అయినట్లు సమాచారం. పది ఫైర్ ఇంజన్లతో మంటలను అదుపు చేసారు. సర్వం కోల్పోయామంటూ చిరు వ్యాపారుల రోదనలు మిన్నంటాయి. ప్రమాద సమయంలో భారీగా పొగలు కమ్మేయడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అయితే అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం లేదా గాయాలు జరగలేదు.

# కారు బావిలో పడి యువకుడు మృతి

నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని బీర్నంది గ్రామంలో మంగళవారం రాత్రి కారు అదుపుతప్పి బావిలో పడటంతో శ్రీనివాస్ (38) అనే యువకుడు మృతి చెందాడు. అత్యవసర పనిమీద రంగపేట్ వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కొమ్ముతండా సమీపంలో రహదారి పక్కనే ఉన్న బావిలో కారు దూసుకెళ్లింది. మృతుడు కడం మండలంలోని 'మన్ గ్రోమోర్' సంస్థలో మేనేజర్గా పనిచేస్తున్నట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.





# ఫ్యామిలీ మ్యాన్ నుంచి పొలిటిషియన్...

చెన్నై, మార్చి4,(న్యూస్ పల్స్) తమిళ స్టార్ హీరో, 'తమిళగ వెట్రి కళగం పార్టీ అధినేత దళపతి విజయ్ ప్రస్తుతం తన జీవితంలో అత్యంత క్లిష్టమైన దశను ఎదుర్కొంటున్నారు. ఒకవైపు రాజకీయాల్లోకి అడుగుపెట్టి 2026 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా దూసుకుపోతుంటే, మరోవైపు 26 ఏళ్ల వైవాహిక బంధం ముగింపు దశకు చేరుకోవడం ఆయన వ్యక్తిగత, రాజకీయ ప్రతిష్టపై తీవ్ర చర్చకు దారితీసింది. ఫిబ్రవరి 27న విజయ్ భార్య సంగీత స్వర్ణలింగం చెంగల్పట్టు ఫ్యామిలీ కోర్టులో విడాకుల కోసం పిటిషన్ దాఖలు చేయడం కోలీవుడ్‌లో సంచలనం సృష్టించింది. 1999లో ప్రేమ వివాహం చేసుకున్న ఈ జంటకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే సంగీత తన పిటిషన్‌లో చేసిన ఆరోపణలు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి. విజయ్ ఒక ప్రముఖ నటితో (త్రిష అని పుకార్లు వినిపిస్తున్నప్పటికీ పిటిషన్‌లో పేరు స్పష్టంగా లేదు) 2021 నుండి సంబంధం కలిగి ఉన్నారని సంగీత ఆరోపించారు. విజయ్ తనను సామాజికంగా, వృత్తిపరంగా దూరం పెట్టారని, ఆమె స్వేచ్ఛపై ఆర్థిక ఆంక్షలు విధించారని ఆమె ఆరోపించారు. సదరు నటి విజయ్‌తో దిగిన ఫోటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నా ఆయన ఖండించలేదని, ఇది తనను, పిల్లలను తీవ్ర అవమానానికి గురిచేసిందని ఆమె పేర్కొన్నారు. విజయ్ తన పార్టీ టీవీకేను స్థాపించి, సినిమాలకు స్వస్తి పలికి పూర్తిస్థాయి రాజకీయ నేతగా అవతరించాలని నిర్ణయించుకున్నారు. సరిగ్గా 2026 అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్న తరుణంలో ఈ విడాకుల వ్యవహారం బయటకు రావడం ఆయనకు రాజకీయంగా పెద్ద దెబ్బ. విజయ్ ఇప్పటివరకు ఒక 'ఫ్యామిలీ మ్యాన్'గా, బాధ్యతాయుతమైన వ్యక్తిగా తన ఇమేజ్‌ను కాపాడుకుంటూ వచ్చారు. విడాకుల పిటిషన్‌లో నైతికతకు సంబంధించిన ఆరోపణలు రావడంతో ప్రత్యర్థి పార్టీలకు ఇది ఒక ఆయుధంగా మారే అవకాశం ఉంది. రాజకీయాల్లో మహిళా ఓటర్ల మద్దతు చాలా ముఖ్యం. భార్యను నిర్లక్ష్యం చేశారనే ఆరోపణలు మహిళా ఓటర్లలో ఆయనపై ప్రతికూల అభిప్రాయాన్ని కలిగించవచ్చు. రాజకీయాలతో పాటు సినిమా పరంగా కూడా విజయ్ ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. ఆయన చివరి చిత్రంగా భావిస్తున్న 'జన నాయకన్' సెన్సార్ పరంగా ఆటంకాలను ఎదుర్కొంటోంది. రాజకీయ సందేశాలు ఉండటంతో సెన్సార్ బోర్డు అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. పొంగల్ కు విడుదల కావాల్సిన ఈ సినిమా ఇప్పటివరకూ రిలీజ్ కాలేదు. అటు వ్యక్తిగత జీవితం, ఇటు కెరీర్ రెండూ డైలమాలో పడ్డాయి. తమిళనాడు రాజకీయాల్లో వ్యక్తిగత జీవితంపై విమర్శలు రావడం కొత్తేమీ కాదు. గతంలో ఎంజీఆర్, జయలలిత, కరుణానిధి వంటి నేతలు కూడా ఇలాంటి వ్యక్తిగత విమర్శలను ఎదుర్కొన్నారు. అయితే విజయ్ ఇప్పుడు ఏ పరిస్థితుల్లో ఉన్నారనేది ముఖ్యం. విజయ్ అభిమానులు, యువత దీన్ని ఆయన వ్యక్తిగత విషయంగా చూస్తున్నారు. రాజకీయాల్లో ఆయన సిద్ధాంతాలకు, ఈ వివాదానికి సంబంధం లేదని వారు వాదిస్తున్నారు. ఈ వివాదంపై విజయ్ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. ఏప్రిల్ 20న కోర్టు విచారణకు హాజరుకావాల్సి ఉంది.

ఈలోగా ఆయన ఈ సమస్యను ఎలా పరిష్కరించుకుంటారు లేదా ప్రజలకు ఎలా సంజాయిషీ ఇస్తారనే దానిపైనే ఆయన రాజకీయ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. విజయ్ తన జీవితంలో అత్యంత కఠినమైన 'అగ్నిపరీక్ష'ను ఎదుర్కొంటున్నారు.

ఒకవైపు దశాబ్దాల వైవాహిక జీవితం విచ్ఛిన్నం కావడం, మరోవైపు రాజకీయాల్లో స్థిరపడాలనే లక్ష్యం.. ఈ రెండింటి మధ్య ఆయన ప్రయాణం ఆసక్తికరంగా మారింది. ఈ సంక్షోభం నుండి ఆయన ఎలా గట్టెక్కుతారో కాలమే నిర్ణయించాలి. రాజకీయాల్లో నెగ్గాలంటే కేవలం సినిమా పాపులారిటీ సరిపోదని, వ్యక్తిగత ప్రవర్తన కూడా క్లీన్‌గా ఉండాలని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## మూడు నెలల్లో మూడు దేశాలపై దాడులు..

న్యూయార్క్, మార్చి4,(న్యూస్ పల్స్) అగ్రరాజ్యాధినేత డొనాల్డ్ ట్రంప్.. 2026లో నెలకొకరనిని టార్గెట్ చేస్తున్నాడు. ఏడాది పాలన పూర్తి కావడంతో తనలోని యుద్ధ కాంక్షను బయటపెట్టిన ట్రంప్ అమెరికా ప్రయోజనాల కోసం యుద్ధం చేస్తున్నాడు. యుద్ధాలు ఆపుతానని గద్దెనెక్కిన నేత.. జరుగుతున్న యుద్ధాలు ఆపకుండా.. కొత్త యుద్ధాలు మొదలు పెట్టాడు. జనవరి నుంచి మార్చి 1 వరకు ముగ్గురిని టార్గెట్ చేశాడు. వెనిజుల్లా అధ్యక్షుడు నికోలస్ మదురోను ట్రంప్ ఈ ఏడాది జనవరిలో టార్గెట్ చేశాడు. వెనెజువెలాలోని ఆయిల్ నిల్వల కోసం ఆ దేశ అధినేతను సైలెంట్‌గా కిడ్నాప్ చేయించాడు. ఇక తమ దేశంలోకి డ్రగ్స్ అక్రమంగా సరఫరా చేస్తున్నాడని మెక్సికోకు చెందిన లార్డ్ ఎల్ మెంచోను ట్రాప్ చేసి ఫిబ్రవరిలో హతమార్చాడు. ప్రియురాలును ట్రాప్ చేసి మెంచోను హతమార్చారు. ఇక తాజాగా ఇరాన్ టాప్ లీడర్ ఖమేనీని మట్టుబెట్టాడు. అణ్వాయుధాలు తయారు చేస్తున్నాడన్న సాకుతో ఇజ్రాయెల్‌తో కలిసి దాడులు చేశాడు. చివరకు హతమార్చాడు. ఈ టార్గెట్లు రాజకీయ, డ్రగ్స్, మతపరమైన తీవ్రవాదానికి చిహ్నాలు. అమెరికా ఇప్పుడు 'హిట్ లిస్ట్' రక్షణ, వాణిజ్య ఆధారాలు, మానవ హక్కుల ఉల్లంఘనలపై దృష్టి పెడుతోంది. ఈ వ్యూహం ద్వారా వాసింగ్టన్ తన ప్రభావాన్ని పునరుద్ధరిస్తూ, ప్రత్యర్థులకు హెచ్చరికలు జారుస్తోంది. ఇక ట్రంప్ తర్వాతి లక్ష్యం ఉత్తర కొరియా అని విశ్లేషకులు భావిస్తున్నారు. కిమ్ అణు కార్యకలాపాలు, మిస్సైల్ పరీక్షల కారణంగా దాడి చేసే అవకాశం ఉంది. ఉక్రెయిన్, రష్యా యుద్ధం నేపథ్యంలో రష్యాపైనా దాడికి అవకాశాలు లేకపోలేదని భావిస్తున్నారు. రష్యాపై సైబర్ దాడులకు ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఇక తర్వాతి లక్ష్యం చైనా. చైనా ? తైవాన్ ఉద్రిక్తతలు, దక్షిణ చైన సముద్రం వివాదాలు లక్ష్యంగా మారవచ్చు. మధ్యప్రాచ్యంలో హమాస్, హిజ్బుల్లా సంబంధాలు కొత్త టార్గెట్లకు దారి తీస్తాయి. అమెరికా దుందుడుకు చర్యలతో మిత్రరాజ్యాలకు ఇబ్బందులు లేకపోయినా.. ప్రత్యర్థులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి విమర్శలు, వాణిజ్య యుద్ధాలు పెరిగే ప్రమాదం ఉంది. అమెరికా ఈ మార్గంలో స్వయం రక్షణను సాకుగా చూపుతోంది.

# యుద్ధం ఖర్చురోజుకు 7 వేల కోట్లు

న్యూయార్క్, మార్చి4,(న్యూస్ పల్స్) అమెరికా?ఇరాన్ ఘర్షణలు పశ్చిమాసియాలో యుద్ధ ఆందోళనలను పెంచుతున్నాయి. ఫిబ్రవరి 28న మొదలైన యుద్ధం.. మార్చి 3వ తేదీనాటికి తీవ్రరూపం దాల్చింది. ఇరాన్ సుప్రీం లీడర్ మరణించినా ఇరాన్ పోరాటంలో వెనక్కు తగ్గడం లేదు. ప్రతీకార దాడులు ఉధృతం చేసింది. దీంతో ఈ యుద్ధం నాలుగు వారాలు కొనసాగే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా ప్రకటించారు. ఫిబ్రవరి 28, 2026న అమెరికా పరేషన్ ఎపిక్ ఫ్యూరీ పేరుతో అమెరికా ఇరాన్‌పై యుద్ధం ప్రకటించింది. ఇక ఇజ్రాయెల్ ఆపరేషన్ లయన్ రోర్ పేరుతో ఇరాన్ లక్ష్యాలపై గగన, భూ, సముద్ర దాడులు చేసింది. ఇరాన్‌కు చెందిన 11 నౌకలు ధ్వంసమయ్యాయి. ఇరాన్ అణు కార్యకలాపాలను ఆపమని ట్రంప్ హెచ్చరించగా, ఇరాన్ గల్ఫ్ దేశాలు, ఇజ్రాయెల్ స్థావరాలపై ప్రతీకార దాడులు చేసింది. అమెరికా 20కి పైగా ఆయుధ వ్యవస్థలు ఉపయోగిస్తోంది, యుఎస్ఎస్ గెరాల్డ్ ఆర్ ఫోర్డ్ వంటి వాహక నౌకలు మోహరించింది. ఇరాన్ హెజ్‌బొల్లా, ఇరాక్ మిలీషియాతో కలిసి డ్రోన్, క్షిపణి దాడులు చేస్తోంది. అమెరికా వైపు 6 మంది సైనికులు మరణించారు, మూడు విమానాలు కూలాయి. యుద్ధం ప్రారంభించిన తొలి 24 గంటల్లో అమెరికా 779 మిలియన్ డాలర్లు (సుమారు రూ.7 వేల కోట్లు) ఖర్చు చేసింది. ముందస్తు యుద్ధ నౌకల మోహరింపునకు మరో 630 మిలియన్ డాలర్లు అంటే రోజుకు 6.5 మిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. ఇజ్రాయెల్ మద్దతుకు 21.7 బిలియన్, ఇతర ఆపరేషన్లకు 9?12 బిలియన్ డాలర్లు వెచ్చించింది. మొత్తం 31?33 బిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. ట్రంప్ నాలుగైదు వారాలు యుద్ధం కనొసాగుతుందని ప్రకటించారు. అవసరమైతే భూదాడులు చేస్తామని ప్రకటించారు. బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ అమెరికాకు మద్దతు ప్రకటించాయి. అయితే అమెరికా వద్ద క్షిపణి రక్షణ వ్యవస్థలు పరిమితం, ఉక్రెయిన్, ఆసియాకు పంపించారు. యుద్ధం సుదీర్ఘంగా కొనసాగితే నష్టాలు పెరిగి రక్షణ బడ్జెట్ 1.5 ట్రిలియన్ డాలర్లకు పెరగవచ్చు. ఆయుధ నష్టాలు, సాంకేతిక లోపాలు ఆందోళనకరం. ఇరాన్ సైప్రస్, గల్ఫ్ లక్ష్యాలపై దాడులు పెంచుతోంది. జెనీవాలో పరోక్ష చర్చలు జరుగుతున్నా, యుద్ధం అనివార్యమని ట్రంప్ హెచ్చరిస్తున్నారు.

**దీర్ఘకాలం కొనసాగే అవకాశం**

అగ్రరాజ్యాధినేత డొనాల్డ్ ట్రంప్ పెట్టిన అణుచిచ్చు.. నాలుగు రోజులుగా గల్ఫ్ దేశాలను దహించి వేస్తోంది. మొన్నటి వరకు కలిసి ఉన్న దేశాలు ఇప్పుడు పరస్పర దాడులతో ఆందోళన చెందుతున్నాయి. ఇరాన్ అణు కార్యక్రమాలు ఆపాలని డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై చేపట్టిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'తో ఇరాన్ సుప్రీం లీడర్ హయతుల్లా ఖమేనీ మరణించాడు. దీంతో ఇరాన్ ప్రతిదాడులు చేస్తోంది. గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలు, ఇజ్రాయెల్‌ను టార్గెట్ చేసింది. దీంతో అమెరికా అప్రమత్తమైంది. ఈ యుద్ధం ఇప్పడే ముగియదని మరో నాలుగు నుంచి ఐదు వారాలు కొనసాగుతుందని ట్రంప్ ప్రకటించారు. ఇరాన్ అణ్వాయుధాల తయారీని ఆపకపోవటం, అమెరికా ఆస్తులను లక్ష్యంగా చేసుకునే సామర్థ్యం గల క్షిపణులను కలిగి ఉంచటంతో ఈ దాడులు తప్పనిసరి అని ఆయన స్పష్టం చేశారు. మునుపటి హెచ్చరికలను ఇరాన్ నిర్లక్ష్యం చేసినందుకు దాని మిసైల్ వ్యవస్థను పూర్తిగా ధ్వంసం చేయడమే ప్రధాన లక్ష్యమని ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్ అణ్వాయుధాల కార్యక్రమాన్ని పూర్తిగా అంగీకరించడం లేదని, దాని కొనసాగడం ప్రపంచ భద్రతకు తీవ్ర ముప్పుగా మారుతోందని ట్రంప్ వాదించారు. ఇరాన్ దగ్గర అమెరికా స్థావరాలు, ఆర్థిక మూలాలపై దాడి చేసే దీర్ఘ పరిధి క్షిపణులు ఉన్నాయని, వాటిని నాశనం చేయడమే ఈ ఆపరేషన్ ఉద్దేశమని చెప్పారు. ఇరాన్‌కు ఇచ్చిన మునుపటి హెచ్చరికలను బేఖాతరుగా పట్టించుకోవడం ఈ దీర్ఘకాల దాడులకు కారణమని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుత దాడులు మరో నాలుగు నుంచి ఐదు వారాలు పరిమితి లేకుండా సాగుతాయని అమెరికా రక్షణ మంత్రి కూడా ప్రకటించారు. ఇప్పటికే ఇరాన్‌లో 200 మంది మరణించినా, ఇరాన్ రిపబ్లిక్ గార్డ్ కార్ప్స్(ఐఆర్‌జీసీ), మిలిటరీ దళాలు ఆయుధాలు వదలితే క్షమించి వదిలేస్తామని ట్రంప్ పిలుపునిచ్చారు. లేకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని, దౌత్య మార్గాలు తెరిచే ఉన్నా సైనిక చర్యలు ప్రధానమని చెప్పారు. అమెరికా సైనికుల్లో కొందరు మరణించినా యుద్ధం ముందుకే సాగుతుందని ఆయన ధైర్యంగా ప్రకటించారు. ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ, మాజీ ప్రధాని మరణాల తర్వాత అమెరికా?ఇజ్రాయెల్ సంయుక్త దాడులు బాలిస్టిక్ మిసైల్ కేంద్రాలు, అణు స్థావరాలపై బిట్ స్టెల్త్ బాంబర్లతో జరుగుతున్నాయి. ఇరాన్ ప్రతిదాడులు యూఏఈ, ఖతార్‌లోని అమెరికా బేస్‌లపై కురిపించగా, మూగ్గురు అమెరికన్ సైనికులు మరణించారు. ఈ ఆపరేషన్ ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని పూర్తిగా బలహీనపరచడానికి రూపొందించబడిందని అమెరికా సెంట్రల్ కమాండ్ పేర్కొంది. ఇరాన్ అణు కార్యక్రమం ప్రపంచ భద్రతకు హెచ్చరిక సంకేతాలు ఇస్తోందని ట్రంప్ వాదనలు సూచిస్తున్నాయి. మిసైల్ వ్యవస్థ ధ్వంసం ద్వారా ఇరాన్ ప్రాంతీయ ఆధిపత్యాన్ని అరికట్టాలనే ఉద్దేశం స్పష్టంగా కనిపిస్తోంది.

దీర్ఘకాల దాడులు మధ్యప్రాచ్య ఆర్థిక వ్యవస్థలు, చమురు ధరలను ప్రభావితం చేస్తాయి. ఓమాన్ మధ్యవర్తిత్వంతో జెనీవాలో జరిగే చర్చలు సఫలమైతే యుద్ధం ఆగే అవకాశం ఉంది. మరోవైపు రష్యా, చైనా దాడులను వెంటనే ఆపమని పిలుపునిచ్చాయి. యూరోపియన్ యూనియన్ శాంతి చర్చలకు మద్దతు తెలపడంతోపాటు అణు అంబాగోచా భయం వ్యక్తం చేసింది.

# ఆర్థిక పరిస్థితి... ఏంటీ

హైదరాబాద్, మార్చి 4, తెలంగాణ రాష్ట్ర ఆర్థిక స్థితిపై కేంద్రానికి డౌట్ వచ్చింది. సీఎం రేవంత్ రెడ్డి ఖజానా నిల్ అనడంపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి గట్టిగానే సవాళ్లు చేశారు. కేంద్రం నిధులు ఇస్తున్న రాష్ట్ర ఖజానా ఖాళీ అంటున్న రేవంత్ రెడ్డిని సూటిగా ప్రశ్నించారు. రాష్ట్ర ఆర్థిక స్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బహిరంగ లేఖ రాయడం సంచలనమైంది. దీంతో నిజంగానే తెలంగాణ రాష్ట్ర ఖజానా నిల్ అయ్యిందా? అయితే రాహుల్ గాంధీకి 1000 కోట్లు ఇస్తానన్న రేవంత్ రెడ్డి వాటిని ఎలా చెల్లిస్తారన్న కిషన్ రెడ్డి మాట ఇప్పుడు వైరల్ గా మారింది. రాష్ట్ర ఖజానా 'నిల్' అంటూ రాజకీయ వేదికలపై వినిపిస్తున్న మాటలు ఇప్పుడు కొత్త కామెడీ ట్రాక్‌లా మారాయి. ఎన్నికల సమయంలో ఖజానా "ఫుల్"గా కనిపిస్తుంది. హామీల జాబితా చూస్తే అది మినీ బడ్జెట్ కాదు, మేగా బడ్జెట్ అన్నట్టు ఉంటుంది. కానీ అధికారంలోకి వచ్చాక అదే ఖజానా ఒక్కసారిగా "ఖాళీ మట్టి కుండ"గా మారిపోతుంది. ఇది ఆర్థిక శాస్త్రంలోని కొత్త సిద్ధాంతమా? లేక రాజకీయ శాస్త్రంలోని పాత మంత్రామా? ఎన్నికల ముందు "ఆరు గ్యారెంటీలు ? 420 హామీలు" అంటూ ప్రజలకు కలల కట్టడాలు చూపిస్తారు. ఓట్లు పడిన తర్వాత మాత్రం "ఖజానాలో లంకెబిందెలు లేవు" అని చెబుతారు. అయితే ఇదే సమయంలో మరో సభలో "అవసరమైతే వెయ్యి కోట్లు ఇస్తాం" అనే ధైర్యవాక్యాలు వినిపిస్తే? ప్రజలు ఏది నమ్మాలి? ఖజానా ఖాళీనా? లేక డైలాగ్‌లే ఫుల్‌గా ఉన్నాయా? ఇది చూసి ప్రజలకు ఒక సందేహం రావడం సహజం.. ఖజానా 'నిల్' అయితే మాటల ఖజానా మాత్రం 'అన్‌లిమిటెడ్' ఎలా? రాజకీయాల్లో ఇది కొత్త గణితం కావచ్చు. 0 + 1000 = సభలో చప్పట్లు అన్న ఫార్ములా! ఇంకో ఆసక్తికర విషయం ఏమిటంటే? కేంద్రం నుంచి వచ్చిన నిధులు, రాష్ట్ర అప్పులు, బడ్జెట్ లెక్కలు.. ఇవన్నీ ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలంటే శ్వేతపత్రం అవసరం అంటున్నారు. కానీ రాజకీయాల్లో శ్వేతపత్రం అంటే వాస్తవాల పుస్తకం కాదు, వాదాల పుస్తకంగా మారిపోతుంది. ఒక పార్టీ విడుదల చేస్తే అది "నిజాల గ్రంథం"; మరో పార్టీకి అది "అబద్ధాల సంకలనం". ఇక అప్పుల కథ కూడా సినిమాలా ఉంది. ఎవరు అధికారంలో ఉన్నా అప్పులు మాత్రం హీరోల్లా సీన్‌లో ఉంటాయి. "మేము తీసుకున్న అప్పులు అభివృద్ధి కోసం" అంటారు. "వాళ్లు తీసుకున్న అప్పులు దుర్వినియోగం" అంటారు. చివరకు ప్రజలకు మాత్రం ఈఎంఐలే మిగులుతాయి.. పన్నుల రూపంలో. మొత్తానికి "రాష్ట్ర ఖజానా నిల్" అన్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట కంటే "రాజకీయ నాటకం ఫుల్" అన్న మాట దగ్గరగా ఉందేమో అనిపిస్తోంది. ప్రజలు ఇప్పుడు ఒకే ప్రశ్న అడుగుతున్నారు.

ఖజానా నిజంగానే ఖాళీనా? రేవంత్ రెడ్డి గారు? లేక రాజకీయ సంభాషణలే ఖాళీగా ఉన్నాయా? సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై ఓ శ్వేతపత్రం వస్తే బాగానే ఉంటుంది. ఎంతసేపు కేసీఆర్ ఖజానా ఖాళీ చేశాడనే బదులు.. మీరు అధికారంలోకి వచ్చాక ఏం చేశారన్నదే జనాలు చూస్తారు. అందుకే కేసీఆర్ ను కాదని మీకు ఓటు వేశారు. ఎందుకంటే సంఖ్యలు మాట్లాడితే వాదాలు తగ్గుతాయి. లెక్కలు బయటపెడితే నిజం బయటపడుతుంది. అప్పటివరకు మాత్రం సభల స్టేజీలపై ఖజానా 'నిల్' చప్పట్లు 'ఫుల్' అనే ట్రెండ్ కొనసాగుతుందేమో!

# రంగంలోకి నాగబాబు...



హైదరాబాద్, మార్చి4 మెగా బ్రదర్ నాగబాబు త్వరలో మంత్రి కానున్నారు. ఇప్పటికే ఆయనను మంత్రివర్గంలోకి తీసుకుంటామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. అందులో భాగంగా గత ఏడాది ఆయన ఎమ్మెల్సీ అయ్యారు. అయితే ఆయన అనుకున్న స్థాయిలో వాయిస్ వినిపించడం లేదని.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఎందుకు ఎదుర్కోలేకపోతున్నారని స్వయంగా పవన్ కళ్యాణ్ ప్రశ్నించేసరికి నాగబాబు అప్రమత్తమయ్యారు. అప్పటినుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని టార్గెట్ చేయడం ప్రారంభించారు. వరుసగా వీడియోలు విడుదల చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గట్టిగానే నిలదీస్తున్నారు. తాజాగా ఓ వీడియో విడుదల చేశారు. కర్మ చుట్టూ ఆయన కామెంట్స్ కొనసాగాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని కర్మ విడిచిపెట్టదు అని ఆయన తేల్చి చెప్పారు. ఇటీవల శాసనమండలిలో నెయ్యి కల్తీ వ్యవహారంపై చర్చ జరిగిన సంగతి తెలిసిందే. అయితే అర్ధాంతరంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆందోళనతో మండలిలో చర్చ ముగిసింది. అందుకే తనకు ఏ అవకాశం రాలేదని.. మాట్లాడలేకపోయానని.. అందుకే ఈ ప్రత్యేక వీడియో విడుదల చేయాల్సి వచ్చిందని చెప్పుకొచ్చారు నాగబాబు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తప్పుల మీద తప్పులు చేసిందని.. నెయ్యి కల్తీ చేశారని.. టికెట్ల జారీలో కూడా అవినీతి జరిగిందని.. వీటన్నింటికీ మూల్యం చెల్లించుకోక తప్పదని.. కర్మ ఎవరిని విడిచి పెట్టదు అని కొన్ని ఆధ్యాత్మిక మాటలతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఓ రేంజ్ లో వేసుకున్నారు నాగబాబు. అయితే నాగబాబు వీడియో జనసైనికులకు బాగానే తాకింది. ఇకనుంచి టీటీడీ లడ్డు వ్యవహారంలో జనసేన సైతం విరుచుకు పడే పరిస్థితి కనిపిస్తోంది. మొన్న ఆ మధ్యన పవన్ కళ్యాణ్ పార్టీ శ్రేణులను గట్టిగానే హెచ్చరించిన సంగతి తెలిసిందే. కూటమి ప్రభుత్వం అంటే ఒక్క తెలుగుదేశం పార్టీ మాత్రమే కాదు అని.. అందులో జనసేన సైతం ఉందన్న విషయాన్ని గ్రహించుకోవాలని హెచ్చరించిన సంగతి తెలిసిందే. సినిమా పరిశ్రమపై మాట్లాడేవారు సైతం లడ్డు వివాదంపై ఎందుకు మాట్లాడడం లేదని పవన్ ప్రశ్నించినట్లు ఆ మధ్యన కామెంట్స్ వినిపించాయి. పవన్ కళ్యాణ్ ఓ దశలో మెగా బ్రదర్ నాగబాబు పై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చాయి. అప్పటినుంచి నాగబాబు వీడియోలు విడుదల చేస్తున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై విరుచుకుపడుతున్నారు. పవన్ కళ్యాణ్ ఆగ్రహం బాగానే పనిచేస్తుందన్న కామెంట్స్ ఇప్పుడు వినిపిస్తున్నాయి. మొత్తానికి అయితే మెగా బ్రదర్ నాగబాబు వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

## జడల రామలింగేశ్వర ఆలయ ఉత్సవాల్లో అపశృతి

## అగ్నిగుండంలో పడి భక్తులకు గాయాలు

నల్గొండ వేములపల్లి (మం) ఆమనగల్లు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఉత్సవాల్లో అపశృతి చోటు చేసుకుంది. అగ్నిగుండం దాటే క్రమంలో భక్తులు కింద పడ్డారు. దాంతో అక్కడ బందోబస్తులో వున్న పోలీసులు అప్రమత్తమైనిప్పుల్లో కింద పడ్డ భక్తులను బయటికి లాగివేసారు. ప్రమాదంలో నలుగురు భక్తులకు స్వల్పగాయాలు అయ్యాయి. భక్తులు ఒక్కసారిగా తీసుకుంటూ వచ్చే క్రమంలో ప్రమాదం తలెత్తింది.

### కొడుకుపై తండ్రి కత్తితో దాడి

కరీంనగర్ సైదాపూర్ మండలంలోని రాంచంద్రాపూర్ గ్రామంలో మంగళవారం మద్యం మత్తులో ఉన్న తండ్రి తన కొడుకుపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. రిటైర్డ్ ఉద్యోగి పెరుగు రవీందర్, మద్యానికి బానిసై ఇంటి వద్ద తిరుగుతున్నాడని, తన కొడుకు పెరుగు నరేష్ ను ఇంటికి రమ్మని పిలిచినప్పుడు, రానని చెప్పడంతో కత్తితో దాడి చేశాడని గ్రామస్తులు, పోలీసులు తెలిపారు. గాయపడిన నరేష్ ను ఆస్పత్రికి తరలించారు. సైదాపూర్ ఎస్సై కొప్పుల స్వాతి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# మియాపూర్ లో హత్య

మియాపూర్ పోగుల ఆగయ్య నగర్ లో అన్నదమ్ముల మధ్య జరిగిన ఘర్షణ దారుణ హత్యకు దారితీసింది. మద్యం మత్తులో ఉన్న తమ్ముడు, తన అన్నను బండరాయితో కొట్టి, కత్తితో పొడిచి హత్య చేసినట్లు స్థానికులు తెలిపారు. తరచుగా తాగి గొడవ చేస్తూ వేధిస్తున్నాడని హత్య చేసినట్లు నిందితుడు ఒప్పుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని, నిందితుడిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# మార్చురీలో పీక్కుతున్న మృతదేహాలు

మహబూబ్ నగర్, మార్చి 4, మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని పాత ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో చోటుచేసుకున్న అమానవీయ ఘటనపై ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది. మార్చురీలో భద్రపరిచిన ఒక వ్యక్తి మృతదేహాన్ని కుక్కలు పీక్కుతిన్నాయన్న వార్తపై ప్రభుత్వం వెంటనే స్పందించింది. ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహా ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేశార. ఆయన ఆదేశాల అనంతరం.. మంగళవారం రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్ స్వయంగా జడ్చర్ల ఆసుపత్రిని సందర్శించి క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. మార్చురీ నిర్వహణలో దారుణమైన వైఫల్యం , విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినట్లు తేలడంతో నలుగురిపై సస్పెన్షన్ వేటు వేశారు. సస్పెండ్ అయిన వారిలో ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్రకళ, ఆర్ఎంవో హరినాథ్, డ్యూటీ డాక్టర్ , ఎంఎస్‌వో ఉన్నారు. మార్చురీ వంటి సున్నితమైన ప్రదేశాలలో కనీస రక్షణ కరువవడం, కుక్కలు లోపలికి వెళ్లి మృతదేహాన్ని పీక్కుతినే వరకు సిబ్బంది గుర్తించకపోవడంపై ప్రజల నుండి తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. ప్రభుత్వ ఆసుపత్రులలో మృతదేహాలకు కూడా గౌరవం దక్కడం లేదని బాధితుల బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా అన్ని మార్చురీల భద్రతను పటిష్టం చేయాలని ఆరోగ్య శాఖ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

# గల్ఫ్ దేశాల్లో 15 లక్షల మంది తెలంగాణ వాసులు..

హైదరాబాద్, మార్చి 4, ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా దాడులు.. వీటికి ప్రతీకారంగా గల్ఫ్ దేశాలపై ఇరాన్ చేస్తున్న ప్రతీకార దాడులతో మిడిల్ ఈస్ట్‌లో తీవ్ర యుద్ధ వాతావరణం నెలకొంది. సుప్రీం లీడర్ ఖమేనీని హతమార్చిన తర్వాత ఇజ్రాయెల్, అమెరికా బెదిరింపులకు ఇరాన్ ఏమాత్రం లొంగడం లేదు. దీంతో పరిస్థితి మరింత దారుణంగా తయారయ్యే అవకాశాలు ఉన్నాయి.

ఈ క్రమంలోనే గల్ఫ్ దేశాల్లో ఉన్న తమ వారు ఎలా ఉన్నారోనని రాష్ట్రంలోని వారి కుటుంబ సభ్యులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.తెలంగాణ నుంచి లక్షలాది మంది జనం ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి పనిచేస్తున్నారు.

ఇక్కడ చేయడానికి పనుల్లేక, చేసిన పనులకు సరైన డబ్బులు రాకపోవడంతో.. విదేశాలకు వెళ్లి కష్టపడితే ఎక్కువ డబ్బులు వస్తాయనే ఆశతో చాలా మంది వెళ్తున్నారు. అక్కడికి వెళ్లిన వారు బాగా సంపాదిస్తుండటంతో ఫ్రెండ్స్, కుటుంబ సభ్యులు, తెలిసిన వాళ్లు కూడా ఆయా దేశాలకు వెళ్లి డబ్బులు సంపాదిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇరాన్, ఇజ్రాయెల్, సౌదీ అరేబియా, యూఏఈ, బహ్రెయిన్, ఒమన్, ఖతార్, కువైట్ వంటి దేశాల్లో భారీ సంఖ్యలో భారత్ నుంచి వెళ్లిన వాళ్లు ఉన్నారు. అందులో ఒక్క తెలంగాణ నుంచే దాదాపు 15 లక్షల మంది ప్రజలు ఈ గల్ఫ్ దేశాల్లో రకరకాల పనులు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ప్రస్తుతం ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధంతో అక్కడ ఉన్న తెలంగాణ వాసుల పరిస్థితి ఏంటి అనేది ప్రశ్నార్థకంగా మారింది.అమెరికా, ఇజ్రాయిల్ కలిసి ఇరాన్‌పై యుద్ధం ప్రకటించగా.. ఈ దాడులు మొత్తం గల్ఫ్ దేశాలకు అంటుకున్నాయి. దీంతో ఆయా దేశాల్లో ఉన్న తెలుగువారి భద్రతపై తెలుగు రాష్ట్రాల్లోని కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

ఇక తెలంగాణ నుంచి గల్ఫ్ దేశాల్లో 15 లక్షల మంది తెలంగాణవాసులు ఉండగా.. అందులో 9 లక్షల మంది ఉత్తర తెలంగాణకు చెందినవారే ఉండడం గమనార్హం. ఇక సౌదీ అరేబియా, దుబాయ్, షార్జా, అబుదాబీ, ఒమన్, ఖతార్, బహ్రెయిన్, కువైట్ దేశాల్లో మొత్తంగా 90 లక్షల మంది భారతీయులు ఉండగా.. అందులో 15 లక్షల మంది తెలంగాణ, మరో 15 లక్షల మంది ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు ఉన్నారని ప్రభుత్వం అంచనా వేస్తోంది.ఇక ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి 2.5 లక్షల మంది.. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి మరో 2 లక్షల మంది.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి 1.5 లక్షల మంది గల్ఫ్ దేశాలకు వలస వెళ్లి జీవిస్తున్నారు. ఇక సిద్దిపేట జిల్లాకు చెందిన 15 వేల మంది పలు రకాల పనులు చేస్తున్నారు. ఒక్క ఇజ్రాయెల్‌లోనే నిజామాబాద్ జిల్లా నుంచి 700 మంది పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన వారు యూఏఈ, ఒమన్ వంటి దేశాల్లో కార్మికులుగా పనిచేస్తున్నారు.ఇజ్రాయెల్, అమెరికా దేశాలపై కోపంతో.. గల్ఫ్ దేశాలపై ఇరాన్ సైన్యం క్షిపణి, డ్రోన్‌లతో విరుచుకుపడుతోంది. దీంతో ప్రస్తుతం గల్ఫ్ దేశాల్లోని చాలా కంపెనీల్లో పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ క్రమంలోనే గత రెండు రోజులుగా వలస కార్మికులు మొత్తం బంకర్లలోనే తలదాచుకుంటున్నారు. నిత్యం సాయంత్రం 4 గంటల నుంచి ఉదయం వరకు బాంబుల శబ్దాలు దద్దరిల్లిపోతున్నాయని.. బంకర్లలో దాక్కొని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుంటున్నట్లు అక్కడి ఉన్నవారు తమ కుటుంబ సభ్యులకు చెబుతున్నారు. వారు అక్కడ క్షేమంగానే ఉన్నట్లు చెప్పినా.. ఇక్కడ ఉన్న వారు మాత్రం భయం గుప్పిట్లోనే జీవిస్తున్నారు.మరోవైపు.. ఇప్పటికే గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న వారి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వం వెల్లడించింది.

అత్యవసరమైతే తప్ప బయటికి రావొద్దని వారికి సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఇక మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లు వలస కార్మికుల కుటుంబ సభ్యులు, బంధువులతో మాట్లాడి వారికి ధైర్యం చెబుతున్నారు. ప్రభుత్వం తరఫున చేయాల్సిన సాయాన్ని చేస్తామని హామీ ఇచ్చారు. గల్ఫ్ దేశాల్లో ఉన్నవారిని రక్షించేందుకు అన్ని చర్యలు చేపడతామని కేంద్రమంత్రి బండి సంజయ్ కూడా వెల్లడించారు.

మరోవైపు.. గల్ఫ్ కార్మికుల సమాచారం తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎమర్జెన్సీ టోల్‌ఫ్రీ నంబర్లను అందుబాటులోకి తెచ్చింది. అబుదాబీ (యూఏఈ) టోల్‌ఫ్రీ నంబర్ 800-46342.. వాట్సాప్ +971543 090571.. కువైట్ +96565 501946.. బహ్రెయిన్ 00973-39418071.. మస్కట్ (ఒమన్) 800 71 234.. జోర్డాన్ 00962 770422 276.. బాగ్దాద్ (ఇరాక్) +964 771 651 1185.. టెహ్రాన్ (ఇరాన్) +9891 281 09115.. సౌదీ అరేబియా 00 966 114 884 697.. దోహా (ఖతార్) 00974 5564 7502.. పాలస్తీనా +970 592916418 నంబర్లకు సంప్రదించి తమ వారి క్షేమ సమాచారం తెలుసుకోవచ్చని సూచించారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయిచైతన్య.. గల్ఫ్ కార్మికుల కోసం కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. కార్మికులు 87126 59700, 87126 59821 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

తెలంగాణ భవన్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

పశ్చిమాసియాలో ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో తెలంగాణ ప్రభుత్వం కంట్రోల్ రూంను ఏర్పాటు చేసింది. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో తెలంగాణ ప్రజల భద్రత కోసం దీన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. విదేశాంగ శాఖతో పాటు ఆయా దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలతో తెలంగాణ భవన్ అధికారులు ఎప్పటికప్పుడు సంప్రదింపులు చేస్తున్నారు. విదేశాల్లోని తెలంగాణవారికి ఇబ్బందులు, ప్రయాణ అంతరాయాలు, ఎమర్జెన్సీ ఎదురైతే కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని తెలిపారు. 24 గంటల పాటు 9871999044, 58322143, 991014749, 9643723157 నంబర్లను అందుబాటులో ఉంచారు.

# హైదరాబాద్ లో ఖమేనీ రోడ్

హైదరాబాద్, మార్చి 4, ఇప్పుడు ఎక్కడ చూసినా, ఎక్కడ విన్నా యుద్ధం గురించే చర్చ. ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా యుద్ధ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు ఉద్ధృతమవుతున్నాయి. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దాడుల నేపథ్యంలో ఒక పేరు మాత్రం పెను సంచలనం సృష్టిస్తోంది. అదే ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ పేరు. ఇటీవలి దాడుల్లో ఖమేనీ మృతి చెందడంతో యుద్ధం మరింత తారాస్థాయికి చేరుకుంది. ఇక్కడ మరింత ఆశ్చర్యపోయే విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఖమేనీ పేరు మీద హైదరాబాద్ మహా నగరంలో ఏకంగా ఓ రోడ్డే ఉందట. ఏంటి.. వినడానికి చాలా వింతగా ఉంది కదూ..!ఇరాన్ దాడుల నేపథ్యంలో అల్లకల్లోలమైన ప్రపంచ దేశాలను ఇప్పుడీ విషయం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. భాగ్యనగరంలో 'ఖమేనీ' రోడ్డు ఉందన్న విషయం తాజా దాడుల నేపథ్యంలో కొత్తగా బయటికి వచ్చింది. అయతొల్లా అలీ ఖమేనీ మరణ వార్త ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తుండగా.. మరోవైపు, హైదరాబాద్ నగరంలో ఖమేనీ పేరుతో ఒక రోడ్డు ఉందన్న విషయం సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీసింది. అది కూడా నగరంలోనే ప్రముఖంగా వినిపించే బంజారాహిల్స్‌లో ఈ పేరుతో రోడ్డు ఉండటం విశేషం. ఇక్కడే మరో ట్విస్ట్ వెలుగులోకి వచ్చింది. అయతొల్లా అలీ ఖమేనీ పేరు మీద నగరంలో రోడ్డు ఉందన్న విషయం వైరల్ అవుతున్న నేపథ్యంలో ప్రస్తుతం మరణించిన నేత పేరుతో కాకుండా ఇరాన్ తొలి సుప్రీం లీడర్ జ్ఞాపకార్థమే ఈ రోడ్డుకు ఈ పేరు పెట్టారని అసలు విషయం బయటపడింది. ఈ విషయం మాకు ఇప్పటివరకూ తెలియదని, ఖమేనీ మరణం తర్వాతే ఇలాంటి ఆశ్చర్యం కలిగించే కొత్త విషయాలు బయటికి వస్తున్నాయని నెటిజన్లు అంటున్నారు.హైదరాబాద్ నగరంలో ఈ రోడ్డు ఎక్కడ ఉందనే కదా ఇప్పుడు మీ అనుమానం..! జీవీకే వన్ మాల్ ఎదురుగా ఉండే బంజారాహిల్స్ రోడ్డు నెం.7ని అధికారికంగా 'ఇమామ్ ఖమేనీ రోడ్' అని పిలుస్తారు. ఇదే ప్రాంతంలో ఇరాన్ కాన్సులేట్ కార్యాలయం ఉండటంతో అప్పటి మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాద్ ఈ రోడ్డుకు ఈ పేరును పెట్టినట్లు సమాచారం. కుతుబ్ షాహీల కాలం నుంచి హైదరాబాద్, ఇరాన్ దేశాల మధ్య ఉన్న దృఢమైన సాంస్కృతిక, వాణిజ్య సంబంధాలకు గుర్తుగా అప్పటి అధికారులు ఈ నిర్ణయం తీసుకోవడమే కాకుండా అప్పటి ప్రభుత్వం ఈ పేరును అధికారికంగా రికార్డుల్లో కూడా చేర్చింది.ఇరాన్ మొదటి సుప్రీం లీడర్ రుహుల్లా ఖమేనీ పూర్వీకులకు మన దేశంతో విడదీయలేని సంబంధాలు ఉండేవి. ఖమేనీ తాతలు ఉత్తరప్రదేశ్‌లోని బారాబంకి జిల్లాకు చెందిన కింతూరులో పుట్టారని చరిత్రకారులు చెబుతున్న మాట. 19వ శతాబ్దంలోనే ఖమేనీ పూర్వీకులు ఇరాన్‌కు వలస వెళ్లి అక్కడే రాజకీయాల్లో కీలక పాత్ర పోషించడంతో ఈ సంబంధం ఇలా కొనసాగింది. అయితే.. తాజా దాడుల ఘటనలో అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మృతి చెందాడు. డౌన్‌టౌన్‌లోని ఖమేనీ కాంపౌండ్ లక్ష్యంగా ఫిబ్రవరి 28న ఖమేనీతో పాటు ఆయన కుమార్తె, అల్లుడు, కోడలు, మనవరాలు ప్రాణాలు కోల్పోయారు. ఖమేనీ ఇరాన్ మరింత అట్టుడికిపోయింది. తమ దేశంపై దాడి చేసిన ఇజ్రాయెల్, అమెరికాలను వదిలే ప్రసక్తే లేదని ప్రకటన కూడా విడుదల చేసింది. ఈ క్రమంలో శత్రుదేశాల మధ్య పోరు మరింత తీవ్ర రూపం దాల్చింది. ఇదంతా ఇలా ఉండగా.. ఖమేనీ మరణం తర్వాత హైదరాబాద్ నగరంలో ఓ రోడ్డు ఉందనే విషయాన్ని ఓ నెటిజన్ తన ఫేస్‌బుక్ పేజీ ద్వారా వెల్లడించడంతో ఇక టి నుంచి సోషల్ మీడియాలో ఈ వార్త తెగ వైరల్ అవుతోంది.

# ప్రాణం మీదకు వస్తున్న అల్లం వెల్లుల్లి పేస్ట్...

హైదరాబాద్, మార్చి 4, హైదరాబాద్?లో పెద్ద మొత్తంలో కల్తీ అల్లం-వెల్లుల్లి పేస్ట్ స్వాధీనం చేసుకున్నారు. ఇది ఆరోగ్యానికి ఎంతో ప్రమాదామని చెప్తున్నారు. కల్తీ వెల్లుల్లి-అల్లం పేస్ట్ ఎక్కువగా తింటే హానికరమైన ప్రభావాలు ఉంటాయని అంటున్నారు. అయితే దీని గురించి సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరుగుతుంది. దీనిని ఎక్కువగా తింటే.. అవయవాలు కుళ్లిపోతాయంటూ చెప్తున్నారు. మరి దీనిలో వాస్తవమెంతో చూసేద్దాం. హైదరాబాద్?లో తాజాగా నాలుగు వేల కిలోగ్రాముల కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ స్వాధీనం చేసుకున్నారు. నివేదికల ప్రకారం హైదరాబాద్ పోలీసులు ఎంఎస్ మక్త రైల్వే గేట్ సమీపంలో ఆకస్మిక దాడి నిర్వహించి.. ఒక కంటైనర్‌లో అపరిశుభ్రంగా నిల్వ చేసిన అల్లం, వెల్లుల్లి పేస్ట్‌ను కనుగొన్నారు. ఈ కేసుకు సంబంధించి 21 ఏళ్ల వ్యక్తిని కూడా అరెస్టు చేశారు. ఈ కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ మీ ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో.. దాని వల్ల ఏ అవయవాలు ఎక్కువగా ప్రభావితమవుతాయో చూసేద్దాం.వంటగదిలో రోజూ ఉపయోగించే అల్లం-వెల్లుల్లి పేస్ట్ కల్తీ అయితే.. అది తీవ్రమైన ఆరోగ్య ప్రమాదాన్ని కలిగిస్తుంది. చెన్నైలోని శ్రీ బాలాజీ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో నమోదైన డైటీషియన్ దీపలక్ష్మి ప్రకారం.. ఈ పేస్ట్ పరిమాణాన్ని పెంచడానికి పిండి లేదా కార్న్‌ఫ్లోర్‌ను కలుపుతారు. దానిని తాజాగా కనిపించేలా చేయడానికి, ఎక్కువసేపు ఉంచడానికి కృత్రిమ రంగులు, సంరక్షణకారులు కూడా కలుపుతారు. కొన్ని సందర్భాల్లో పాత లేదా చెడిపోయిన అల్లం, వెల్లుల్లిని కూడా ఉపయోగిస్తారు.జూలై 2025లో ఇలాంటిదే ఒక కేసు నమోదైంది. అక్కడ ఆహార భద్రతా అధికారులు కొన్ని ఫుడ్స్?లో టైటానియం డయాక్సైడ్, మోనోసిట్రేట్ వంటి హానికరమైన కెమికల్స్ గుర్తించారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం.. ఆహార ఉత్పత్తిలో ఇటువంటి పదార్థాల వాడకం నిషేధం. దర్యాప్తులో రంగును పెంచడానికి ఉపయోగించే పెద్ద మొత్తంలో టైటానియం డయాక్సైడ్, మోనోసిట్రేట్, పసుపు పొడిని స్వాధీనం చేసుకున్నారు.ఈ కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను తీసుకోవడం వల్ల గ్యాస్, అసిడిటీ, విరేచనాలు వంటి జీర్ణ సమస్యలు వస్తాయి. దీర్ఘకాలిక వినియోగం కాలేయం, మూత్రపిండాలను కూడా ప్రభావితం చేస్తుంది. రసాయన కల్తీ కొంతమందిలో అలెర్జీలు, చర్మ సమస్యలు లేదా శ్వాసకోశ సమస్యలను కూడా కలిగిస్తుంది. అలాగే కల్తీ అల్లం, వెల్లుల్లి సహజ ప్రయోజనాలను తగ్గిస్తుంది. ఇంట్లోనే కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్?ను గుర్తించేందుకు కొన్ని టిప్స్ ఫాలో అవ్వొచ్చు. పేస్ట్ ముదురు లేదా రంగు మారకుండా లేత ఐవరీ రంగులో ఉండాలి. ఇది బూజు, బూజు లేదా దుర్వాసన లేకుండా ఉండాలి. ఆకృతి మృదువుగా, స్థిరంగా ఉండాలి. సువాసన ఘాటుగా ఉండాలి. తాజా అల్లం, వెల్లుల్లి వాసన ఇవ్వాలి. రుచి చేదుగా లేదా పాతదిగా ఉండకూడదు. ప్యాక్ చేసిన ఉత్పత్తిని కొనుగోలు చేసేటప్పుడు.. పదార్థాల జాబితాను తప్పకుండా చదవాలి. స్వచ్ఛమైన పేస్ట్‌లో ప్రధానంగా అల్లం, వెల్లుల్లి ఉండాలి. కృత్రిమ రంగులు లేదా సంరక్షణకారులను తక్కువగా జోడించాలి.

## పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష



మేడ్చల్ దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో మేడ్చల్ ప్రత్యేక పోక్సో కోర్టు కఠిన తీర్పు వెలువరించింది. నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ రూ.5,000 జరిమానా విధించింది. బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించింది.

ప్రభుత్వ తరఫున న్యాయవాది ప్రభాకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, 2021లో నిందితుడు మైనర్ బాలికను బెదిరింపులకు గురిచేసి ముంబైకు తీసుకెళ్లి లైంగిక దుర్వినియోగానికి పాల్పడినట్లు కేసు నమోదైంది. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి నిందితుడిని అరెస్టు చేశారు.నిందితుడు షేక్ నజీర్ అలియాస్ అమిత్. ప్రస్తుతం దుండిగల్ మండలం చర్చి గాగిల్లాపూర్లో నివాసం ఉంటున్నాడు. స్వగ్రామం వికార్బాద్ జిల్లా యలాల్ మండలం విశ్వనాథ్పూర్ గ్రామమని ప్రభాకర్ రెడ్డి తెలిపారు.విచారణలో సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు నిందితుడిని దోషిగా నిర్ధారించింది. ఈ కేసులో నిందితుడిపై బాధితురాలి తండ్రి హత్యకు సంబంధించిన మరో కేసు పెండింగ్లో ఉన్నట్లు ప్రభాకర్ రెడ్డి చెప్పారు.

# తమ్మినేని అభిశంసన... రాజకీయ పార్టీలో చర్చలు

హైదరాబాద్, మార్చి 4, సీపీఎం సీనియర్ నాయకుడు, తెలంగాణ మాజీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను పార్టీ కేంద్ర కమిటీ అభిశంసించడం రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. జీవితాంతం కమ్యూనిస్టు సిద్ధాంతాల కోసం పోరాడిన ఒక కీలక నేతపై ఇటువంటి క్రమశిక్షణ చర్య తీసుకోవడం వెనుక అనేక బలమైన కారణాలు ఉన్నట్లు తెలుస్తోంది.కమ్యూనిస్టు పార్టీ రాజ్యాంగం ప్రకారం అభిశంసన అనేది ఒక తీవ్రమైన క్రమశిక్షణ చర్య. పార్టీ నిబంధనలను ఉల్లంఘించినా లేదా పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించే పనులు చేసినా ఈ చర్య తీసుకుంటారు. ఇది బహిష్కరణ లేదా సస్పెన్షన్ కంటే తక్కువ స్థాయిదైనప్పటికీ, ఒక నాయకుడి రాజకీయ జీవితంలో ఇది ఒక మచ్చగా పరిగణిస్తారు. తప్పును అధికారికంగా ఎత్తిచూపుతూ, భవిష్యత్తులో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించడమే దీని ఉద్దేశం.తమ్మినేని వీరభద్రంపై కేంద్ర కమిటీ ప్రధానంగా రాజకీయ వ్యూహకర్తగా విఫలమయ్యారనే ఆరోపణలు చేసింది. రాష్ట్ర కార్యదర్శిగా ఆయన తీసుకున్న కొన్ని నిర్ణయాలు పార్టీ అస్తిత్వానికే ముప్పు తెచ్చాయని హైకమాండ్ భావించింది. ముఖ్యంగా బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ప్రయోగం ఘోరంగా విఫలమవ్వడం, దాని వల్ల పార్టీకి రావాల్సిన ఓట్లు కూడా చీలిపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. కొత్త రాష్ట్ర కార్యదర్శి ఎన్నిక సమయంలో తమ్మినేని తన వర్గానికి అనుకూలంగా లాబీయింగ్‌కు పాల్పడ్డారని, తెరవెనుక మంత్రాంగాలు నడిపారని పార్టీ గుర్తించింది. ఇది సీపీఎం పద్ధతులకు విరుద్ధమని కేంద్ర కమిటీ స్పష్టం చేసింది. తనపై వచ్చిన ఆరోపణలకు తమ్మినేని ఇచ్చిన వివరణలో ఎక్కడా ఆత్మవిమర్శ కనిపించలేదని, చేసిన తప్పులను సమర్థించుకోవడానికే ప్రయత్నించారని పార్టీ అధిష్ఠానం అసంతృప్తి వ్యక్తం చేసింది.తమ్మినేని నాయకుడిగా ఉన్నప్పుడు తీవ్రమైన నిర్మాణ అనైక్యత చోటు చోటు చేసుకుందని.. ముఠా తత్వం ఏర్పడిందని.. ప్రమాణాల ఉల్లంఘన కొనసాగుతోందని.. అస్తిత్వవాద రాజకీయాల ప్రభావం నడుస్తుందని.. తప్పుడు రాజకీయ దృక్పథం.. ఫెడరల్ ధోరణులు.. పార్టీ విలువలు తగ్గిపోవడం ఇటువంటివి చోటు చేసుకుంటున్నట్టు అభిశంసన లేఖ లో కేంద్ర కమిటీ ప్రస్తావించినట్టు తెలుస్తోంది..కేంద్ర కమిటీకి తమ్మినేని వీరభద్రం.. రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఉన్న స్కైలాబ్ బాబు.. ప్రసాద్ ఇచ్చిన వివరణలు సరిగా లేవని పార్టీ కేంద్ర నాయకత్వం ఇప్పటికే పేర్కొంది. అందులో కనీసమైన ఆత్మ విమర్శ కూడా లేదని స్పష్టం చేసింది. కేంద్ర కమిటీ నిర్మాణానికి తగిన విధంగా ప్రవర్తించడంలో విఫలమైన తమ్మినేని వీరభద్రం.. స్కైలాబ్ బాబు.. ప్రసాద్ పై కేంద్ర కమిటీ చర్యలు తీసుకుందని.. వారి ముగ్గురిని కూడా అభిశంసించిందని సమాచారం.తమ్మినేని వీరభద్రాన్ని కేవలం రాష్ట్ర సెక్రటేరియట్.. కమిటీ సమావేశాలలో పరిశీలకుడిగా మాత్రమే నడుచుకోవాలని.. రాష్ట్ర సెక్రటేరియట్ నాయకత్వంలో పనిచేయాలని కేంద్ర కమిటీ సూచించినట్టు సమాచారం. ముగ్గురు కీలక నాయకులు తప్పులు చేసిన నేపథ్యంలో.. ఈ చర్యలు వారి నడవడికలో మార్పును తీసుకొస్తాయని ఆశిస్తున్నట్టు కేంద్ర కమిటీ ప్రకటించింది.తమ్మినేని వీరభద్రం అభి శంసనకు గురైన నేపథ్యంలో.. సరిగ్గా 18 సంవత్సరాల క్రితం విడుదలైన ఓ పుస్తకాన్ని కొంతమంది గుర్తు చేస్తున్నారు. నాడు సిపిఎం పార్టీలో ఉన్న కొంతమంది వ్యక్తులు నిప్పుకు చెదలు అనే పేరుతో ఒక పుస్తకాన్ని విడుదల చేశారు. ఆ పుస్తకం ముందు పేజీ మీద సిపిఐ (ఎం) పేరుతో 60 పేజీల అసలు వ్యవహారాలను తెరపైకి తీసుకొచ్చారు. అప్పట్లో ఈ పుస్తకం సంచలనం కలిగించింది. చాలామంది నాయకుల త్యాగాలతో ఏర్పడిన పార్టీ.. ఇప్పుడు స్వార్థపరుల చేతుల్లోకి వెళ్లిందని.. మొత్తం బలిపీఠం ఎక్కిందని అందులో వాస్తవిక వాదులు పేర్కొన్నారు.ఆ పుస్తకాన్ని అప్పటి సిపిఎం ఖమ్మం జిల్లా నాయకులు వనం నరసింహ రావు.. వై వినయ్ కుమార్.. రాయల వెంకటేశ్వర్లు.. కిలారు సీతారాములు.. ఎర్రబోయిన సీతారాములు.. నల్లపునేని అప్పారావు.. జొన్నలగడ్డ రవికుమార్.. ఇలవల పుల్లారెడ్డి.. ఎడవల్లి రాంరెడ్డి రచించారు. ఆ పుస్తకం వెలుగులోకి వచ్చిన తర్వాత రూపకర్తలందరూ బహిష్కరణకు గురయ్యారు. అయితే ఈ పుస్తకం వెనుక టీఎన్ ప్రసాద్, ధనాల కొండయ్య వంటి వ్యక్తులు కూడా ఉన్నట్టు ప్రచారంలో ఉంది. ఈ నాయకుల్లో టిఎన్ ప్రసాద్.. ఇంకా కొంతమంది వేరువేరు కారణాల వల్ల చనిపోయారు. మిగతా వారంతా వేరువేరు పార్టీలలో కొనసాగుతున్నారు.నాడు విడుదల చేసిన నిప్పుకు చెదలు పుస్తకంలో బోడెపూడి వెంకటేశ్వరరావు, బాజీ హనుమంతు, ఎడవల్లి పద్మారెడ్డి, గట్లూరి కిషన్ రావు, బండారు చంద్రరావు, ఏలూరు లక్ష్మీనారాయణ, బోజడ్ల వెంకటనారాయణ, రావెళ్ళ సత్యనారాయణ, టీవీఆర్ చంద్ర, మంచి కంటి రామ్ కిషన్ రావు, శేషగిరిరావు, బోడెపూడి వెంకటేశ్వరరావు, చిర్రావూరి లక్ష్మీనారాయణ వంటి వ్యక్తులను ప్రముఖంగా ప్రస్తావించారు. వారు చేసిన త్యాగాల వల్ల పార్టీ ఏ స్థాయికి ఎదిగిందో గుర్తు చేశారు. తమ్మినేని నాయకుడిగా మారిన తర్వాత.. పార్టీ దిగజారిన తీరు.. ముదిగొండ కాల్పులు.. పాలేరు డివిజన్లో కుటుంబ సభ్యుల పెత్తనం వంటి వాటిని ఆ పుస్తకంలో ప్రముఖంగా ప్రస్తావించారు.ఈ పుస్తకం తోనే ఆ నాయకులు ఆగిపోలేదు. నాడు ఉమ్మడి రాష్ట్రానికి కార్యదర్శిగా ఉన్న బీవీ రాఘవులకు.. జాతీయ కార్యదర్శి ప్రకాష్ కారత్ వంటి వారికి లేఖలు కూడా రాశారు. ఆ పుస్తకాలలో ఉన్న ప్రముఖమైన విషయాలను కూడా వారి దృష్టికి తీసుకెళ్లారు. ఇంత చేసినప్పటికీ బివి రాఘవులు లాంటి నాయకుడు తమ్మినేని వీరభద్రాన్ని బంగారం అని ప్రస్తావించారు. అయితే ఇన్నాళ్లకు పార్టీ కేంద్ర కమిటీ తమ్మినేని వీరభద్రాన్ని.. ఇంకా ఇద్దరు ముఖ్య నాయకులను అభి శంసించడం నిజంగా ఆశ్చర్యకరం.తమ్మినేని రాజకీయ జీవితంలో ఇంకా కొన్ని కోణాలను ఇక్కడ కేంద్ర కమిటీ పక్కనపెట్టినట్టు కనిపిస్తోంది. ముఖ్యంగా తమ్మినేని పార్టీకి చేసిన సేవలను.. పురోగతికి శ్రమించిన తీరును కేంద్ర కమిటీ పట్టించుకోవడం తెలుస్తోంది. గోదావరి జలాలను పాలేరుకు అనుసంధానించాలని తమ్మినేని వీరభద్రం 20 సంవత్సరాల క్రితమే దుమ్ముగూడెం నుంచి పాలేరు నియోజకవర్గం వరకు 100 రోజులపాటు పాదయాత్ర చేశారు. దాదాపు 2792 కిలోమీటర్ల మేర నడిచారు.ఆ పాదయాత్ర గురించి ఇప్పటికి ఖమ్మం రాజకీయాలలో చర్చ నడుస్తూనే ఉంటుంది. తమ్మినేని కృష్ణయ్య హత్యకు గురికావడం.. ఈ వ్యవహారంలో తమ్మినేని వీరభద్రం సోదరుడు కోటేశ్వరరావు.. ఇంకా కొంతమంది వ్యక్తులు అభియోగాలు ఎదుర్కొంటూ ఉండడం వంటి కారణాలు కేంద్ర కమిటీ దృష్టికి వెళ్లి ఉండవచ్చని.. అందువల్లే ఈ తరహాలో అభిశంషన ఇచ్చి ఉండవచ్చని వాదనలు కూడా వినిపిస్తున్నాయి.ఎన్నో రకాల పరిణామాలు ఎదుర్కొని.. రాజకీయ జీవితాన్ని రకరకాలుగా మార్చుకొని.. 72 సంవత్సరాల వయసులో అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్న తమ్మినేని వీరభద్రం.. ఇప్పుడు కేంద్ర కమిటీ నుంచి అభిశంసన ఎదుర్కోవడం సంచలనం కలిగిస్తోంది. అభిశంసన అనేది కమ్యూనిస్టు పార్టీలో తీవ్రమైన హెచ్చరిక అయినప్పటికీ.. తమ్మినేని వీరభద్రం లేకుండా తెలంగాణలో పార్టీ నడుస్తుందా? పార్టీ ముందుకు వెళ్తుందా? ఈ ప్రశ్నలకు ఇప్పుడు సమాధానాలు లభించాల్సి ఉంది

# ఎంఎన్జే క్యాన్సర్ ఆసుపత్రిలో వైద్యుల ఆందోళన

## ఐదవ రోజు కొనసాగుతున్న ఎం.ఎన్.జే క్యాన్సర్ ఆస్పత్రి డాక్టర్ల నిరసన

హైదరాబాద్ అర్హత లేని నూతన డైరెక్టర్ ను నియమించడం పై ఎంఎంజె హెచ్ఒడిస్ ,సిబ్బంది ఆందోళన ఐదవ రోజు కొనసాగింది. మెహదీ నవాజ్ జంగ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ ఒ రీజినల్ క్యాన్సర్ సెంటర్ (ఎంఎనో), హైదరాబాద్లో డైరెక్టర్ నియామకంపై వైద్యులు, సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న సదానందం గౌడా డైరెక్టర్ కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ .ఛాంబర్ ముందు ఆందోళనకు దిగారు. నిమ్స్ ఆసుపత్రికి చెందిన జూనియర్ సదానంద గౌడ, ఎంఎంజె క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ నియామకంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసారు.

ఎంఎంజె ఆసుపత్రిలో దశాబ్దాలుగా సేవలందిస్తున్న సీనియర్ ప్రొఫెసర్లు ఉండగా, వారి సీనియారిటి అనుభవాన్ని పక్కనబెట్టి బయటి సంస్థకు చెందిన వ్యక్తిని నియమించడం పై అందోళనకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.సంస్థ పరిపాలన, వైద్య సేవలు,విద్యా పరిశోధన కార్యక్రమాలపై సంపూర్ణ అవగాహన కలిగిన సీనియర్లను విస్మరించడం సిబ్బంది మనోభావాలను దెబ్బతీసే చర్యగా వైద్యులు భావిస్తున్నారు. సీనియారిటీ, సంస్థ సంప్రదాయాలను గౌరవించకుండా తీసుకున్న ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే పునఃపరిశీలించాలని డిమాండ్ చేసారు. ఎంఎంజె పరిపాలనా, రోగులకు నిరంతర నాణ్యమైన వైద్య సేవల కోసం అంతర్గత అర్హులైన సీనియర్ అధ్యాపకులకు ప్రాధాన్యం ఇవ్వాలంని సిబ్బంది అంటున్నారు.

# పిపి విధానంలో పది వైద్య కళాశాలలు

అమరావతి రానున్న 2 ఆర్థిక సంవత్సరాల్లో పి పి విధానంలో 10 వైద్య కళాశాలలను నడిపేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. 17 కాలేజీల్లో 11 నాబార్డు కింద, 3 కేంద్రం, 3 సాస్కి కింద మంజూరయ్యాయి. మొత్తం వ్యయం రూ8480కోట్లు. గత ప్రభుత్వ హయాంలో కేవలం 1, 500 కోట్లు మాత్రమే ఖర్చుపెట్టారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడించారు.

బుధవారం నాడు అయన శాసనసభలో ప్రభుత్వ వైద్య కళాశాలలు.. పీపీ విధానంపై సభ్యుల ప్రశ్నలకు సమాధానమిచ్చారు.

మంత్రి మాట్లాడుతూ ఆ ఖర్చులో పులివెందుల కాలేజీకి మాత్రమే దాదాపు రూ 500 కోట్లు ఖర్చుపెట్టి మిగిలిన కాలేజీల విషయంలో జగన్ వివక్ష ప్రదర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.900 కోట్ల విలువైన పనులు చేసింది. వైసీపీ వారు కాలేజీలు నిర్మించేసామని అసత్య ప్రచారం చేస్తున్నారు . పార్వతిపురంలో వైద్య కళాశాల నిర్మాణానికి కనీసం భూ సేకరణ చేపట్టలేదు . ఐదేళ్ల వైసీపీ అరాచక పాలన కారణంగా 11 సీట్లకు పడిపోయారు. అయినా బెదిరింపులు ఆపడంలేదని అన్నారు.

# చెట్టేరుకుంట చెరువలో వ్యక్తి మృతదేహం లభ్యం



మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ పిఎస్ సమీపంలోని కిషోర్(40) అనే వ్యక్తి మృతదేహం లభ్యం అయింది. మృతుడు ఘట్కేసర్ చెందిన కిషోర్ కొండాపూర్ సమీపంలోని 'అమ్మానాన్న అనాధ ఆశ్రమం'లో సూపర్వైజర్ పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఘట్కేసర్ కేంద్రంలోని ఇంటిని అమ్ముకొని కుటుంబ సభ్యులు వెళ్లిపోగా, నాలుగేళ్లుగా పనిచేస్తున్న ఆశ్రమంలోనే కిషోర్ ఉంటున్నాడు. నాలుగు రోజుల క్రితం ఆరోగ్యం బాగాలేదని ఆసుపత్రికి వెళ్తానని చెప్పి వెళ్లిన కిషోర్ ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న చెట్టేరుకుంట చెరువులో బుధవారం శవమై తేలాడు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రోడ్డు ప్రమాద బాధితులను కాపాడితే రహ్ వీర్ పథకం ద్వారా రూ.25 వేల పారితోషికం:

## జిల్లా ఎస్పి అశోక్ కుమార్




జగిత్యాల జిల్లా.. రోడ్డు ప్రమాదాల సమయంలో గాయపడిన వారికి తక్షణ సహాయం అందించి వారి ప్రాణాలను కాపాడే బాధ్యతగల పౌరులను (గుడ్ సమారిటన్స్) ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "రహ్ వీర్ పథకం" ద్వారా రూ.25,000/- నగదు పారితోషికం మరియు ప్రశంసా పత్రం అందజేయబడుతుందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం వేల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, ప్రమాదం జరిగిన తొలి గంటను "గోల్డెన్ అవర్"గా పరిగణిస్తారని ఈ సమయంలో బాధితులకు సమయానికి వైద్య సహాయం అందితే అనేక ప్రాణాలు రక్షించవచ్చని పేర్కొన్నారు. కానీ కొంతమంది పౌరులు పోలీస్ కేసులు ఉండొచ్చనే భయంతో గాయపడిన వారికి సహాయం చేయడానికి వెనుకంజ వేస్తున్నారని ఈ భయాలను తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం "రహ్ వీర్ పథకం"ను అమలు చేస్తోందని తెలిపారు. ఈ పథకం ప్రకారం రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని వెంటనే సమీప ఆసుపత్రికి తరలించి ప్రాణాలను కాపాడిన వారికి ప్రభుత్వం రూ.25 వేల నగదు ప్రోత్సాహంతో పాటు ప్రశంసా పత్రం అందజేస్తుంది. సహాయం చేసిన వ్యక్తిపై ఎలాంటి చట్టపరమైన ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు.రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే 108 అంబులెన్స్ సేవలకు సమాచారం ఇవ్వాలని, సమీపంలోని ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఆసుపత్రికి గాయపడిన వారిని తరలించాలని సూచించారు. ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించి ప్రాణాలను కాపాడే కార్యంలో భాగస్వామి కావాలని కోరారు.

# ప్రభుత్వానికి విజన్ లేదు

## బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్వీ ఎస్ ఎస్ ప్రభాకర్

హైదరాబాద్ గత రెండేళ్లలో 60 సార్లుఐఏఎస్ అధికారుల ల బదిలీలు జరిగాయి. పాలన మీద కాంగ్రెస్ కు పట్టు లేదు. కలెక్టర్లు ప్రజల్లో తిరగడం లేదని సీఎం మాటలతో అర్థం అవుతుంది. సీఎం మాట ఎవ్వరూ వినడం లేదని తెలుస్తుందని బీజేపీ నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. రాజ్య సభ ఎన్నికల ద్వారా బీ ఆర్ ఎస్ కు మంచి అవకాశం వచ్చింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలు రాజ్య సభ ఎన్నికలో ఎవ్వరికీ మద్దతు తెలుపుతారో బయటపడుతుంది. రాష్ట్రంలో బీ ఆర్ ఎస్ కాంగ్రెస్ ఆటను ప్రజలు గమనిస్తున్నారు. అధికారులకు , మంత్రులకు ఎమ్మెల్యేలకు జనంలో తిరిగే మొఖం లేదు, జీహెచ్ఎంసి విస్తరణ చేసి తర్వాత హైద్రాబాద్ ను మూడు ముక్కలు చేసింది, ప్రభుత్వానికి విజన్ లేదని అర్థం అవుతుందని అన్నారు.

## రాజధాని భూసేకరణ

# 3డి ప్రకటన తర్వాతే స్పష్టత ,మంత్రి జనార్ధన రెడ్డి

అమరావతి ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) నిర్మాణం, యాజమాన్యం, నిర్వహణ కార్యాకలాపాల కోసం ఎన్టీఆర్ జిల్లాలో భూసేకరణ కోసం 05.01.26 న కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది.. గెజిట్ ప్రకారం ఎన్టీఆర్ జిల్లాలోని కంచికచర్ల, వీరులపాడు, గడ్డమానుగు, కొండూరు ఒ మైలవరం మండలాల్లో సుమారు 1416 హెక్టార్ల భూమిని ఈ ప్రాజెక్టు కోసం ప్రతిపాదించారని మంత్రి బీసీ జనార్ధనరెడ్డి అన్నారు.

శాసనమండలిలో "అమరావతి ఔటర్ రింగు రోడ్డు భూసేకరణపై ఎమ్మెల్సీ డా.మొండితోక అరుణ కుమార్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు.

మంత్రి మాట్లాడుతూ భూసేకరణ యొక్క ఖచ్చితమైన విస్తీర్ణం తదుపరి 3ఆ ప్రకటన ప్రకారం ఉంటుంది.2013, భూసేకరణ చట్టం ప్రకారం, ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ నిర్ణయించిన విధంగా రైతులకు పరిహారం చెల్లించడమవుతుంది. జాతీయ రహదారులకు సంబంధించి భూసేకరణలో తొలుత 3ఆ జరుగుతుంది. ఇంకా 3 ఆ పూర్తి కాలేదు.. 3 ఆ వచ్చిన తర్వాత సభ్యుల సూచనలు పరిగణలోకి తీసుకుంటాంమని అన్నారు.

# వివాహిత ఆత్మహత్య

ఏలూరు భర్త వేధింపులు తాళలేక భార్య పాయిజన్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. ఏలూరు 3 టౌన్ పరిధిలోని సౌరీపురం కు చెందిన డోలా సుదీప్తి (29) పిల్ల రామకృష్ణకు 2024 సంవత్సరంలో వివాహం జరిగింది. గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య చిన్నపాటి విభేదాలు తలెత్తయి. దీంతో మనస్థాపన చెందిన సుదీప్తి సోమవారం పాయిజన్ తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. ఆమెను చికిత్స నిమిత్తం విజయవాడ ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. దీంతో త్రీ టౌన్ పోలీసులు రామకృష్ణ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

# పెదకాకాని రైల్వే స్టేషన్లో దారుణం:

# వ్యక్తి గొంతు కోసి హత్య

గుంటూరు పెదకాకాని రైల్వే స్టేషన్లో బుధవారం ఉదయం చోటుచేసుకున్న ఒక దారుణ హత్య స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. గుర్తుతెలియని దుండగులు ఒక వ్యక్తిని అతి దారుణంగా గొంతు కోసి హత్య చేశారు.?వివరాల్లోకి వెళ్తే...బుధవారం ఉదయం రైల్వే స్టేషన్ ఆవరణలో రక్తపు మడుగులో పడి ఉన్న వ్యక్తి మృతదేహాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, క్లూస్ టీమ్ సహాయంతో ఆధారాలను సేకరించారు.?పోలీసుల దర్యాప్తు:మృతుడు అసలు ఎవరు? అతను రైల్వే ప్రయాణీకుడా లేక మరెవరైనా అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. అయితే, దుండగులు వ్యక్తిని ఇక్కడే హత్య చేశారా? లేదా మరెక్కడైనా హత్య చేసి మృతదేహాన్ని స్టేషన్ ఆవరణలో పడేశారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.?ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తును ముమ్మరం చేశారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది.

# జడ్చర్ల ఘటనలో డాక్టర్లలపై వేటు

# తప్పు పట్టిన డాక్టర్ల సంఘం

హైదరాబాద్ జడ్చర్ల ఘటనలో డాక్టర్లను సస్పెండ్ చేయడాన్ని డాక్టర్ల సంఘం తప్పు పట్టింది. మృతదేహాన్ని కుక్కలు పీక్కుతున్న ఘటనకు బాధ్యులను ప్రభుత్వం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. హాస్పిటల్ సూపరింటెండెంట్, ఆర్ఎమ్వో హరినాథ్, మార్చురీ సపోర్టింగ్ స్టాఫ్ ను హెల్త్ డిపార్ట్మెంట్ సస్పెండ్ చేసింది. మార్చురీ లో సదుపాయాలు లేకపోవడం వల్లే ఈ ఘటన జరిగింది. ఫ్రీజర్, మార్చురీ టేబుల్, ఫ్రీజర్ లాకర్ కావాలని గత ఏడాది లెటర్ సూపరింటెండ్ రాసారు. పరికరాలు అందించడంలో డిపార్ట్మెంట్ వైఫల్యానికి డాక్టర్లను బాధ్యులను చేస్తున్నారని డాక్టర్ల సంఘం తప్పు పట్టింది. వ్యవస్థ లోపాలని డాక్టర్లను సస్పెండ్ చేయడం కరెక్ట్ కాదని వ్యాఖ్యానించింది.

# హోలీ సంబురాలలో పాల్గొన్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

బోయిన్ పల్లి లోని మల్లారెడ్డి గార్డెన్స్ లో మహావీర్ ఇంటర్నేషనల్ ఉడాన్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన హోలీ సంబురాలలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.సంబురాలలో పాల్గొన్న అందరికీ ఎమ్మెల్యే శ్రీగణేష్ శుభాకాంక్షలు తెలిపి చెడు పై మంచి గెలుపునకు సూచికగా 'కామ దహనం'తో ప్రారంభమయ్యే హోలీ పండుగ మనందరి జీవితాల్లో కొత్త రంగులు అద్దుతుందని అన్నారు.హోలీ పండుగ సందర్భంగా బంధుమిత్రులతో, సాటివారితో ఆనందం పంచుకుని అందరూ సుఖసంతోషాలతో ఉండడం ఆనందంగా ఉందని, మహావీర్ ఇంటర్నేషనల్ ఉడాన్ సంస్థ ఇలాంటి మంచి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు.అలాగే తుకారాం గేట్ లోని ఎమ్మెల్యే నివాసం వద్ద జరిగిన హోలీ వేడుకలలో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి పాల్గొని అందరికీ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## హోలీ సంబురాలలో పాల్గొన్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

సికింద్రాబాద్ బోయిన్ పల్లి లోని మల్లారెడ్డి గార్డెన్స్ లో మహావీర్ ఇంటర్నేషనల్ ఉడాన్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన హోలీ సంబురాలలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంబురాలలో పాల్గొన్న అందరికీ ఎమ్మెల్యే శ్రీగణేష్ శుభాకాంక్షలు తెలిపి చెడు పై మంచి గెలుపునకు సూచికగా 'కామ దహనం'తో ప్రారంభమయ్యే హోలీ పండుగ మనందరి జీవితాల్లో కొత్త రంగులు అద్దుతుందని అన్నారు.

హోలీ పండుగ సందర్భంగా బంధుమిత్రులతో, సాటివారితో ఆనందం పంచుకుని అందరూ సుఖసంతోషాలతో ఉండడం ఆనందంగా ఉందని, మహావీర్ ఇంటర్నేషనల్ ఉడాన్ సంస్థ ఇలాంటి మంచి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు.

అలాగే తుకారాం గేట్ లోని ఎమ్మెల్యే నివాసం వద్ద జరిగిన హోలీ వేడుకలలో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి పాల్గొని అందరికీ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# వేం నరేందర్‌కు రాజ్యసభ -రేవంత్ మాట నెగ్గుతుందా?

హైదరాబాద్ తెలంగాణలో జరగనున్న రెండు రాజ్యసభ స్థానాల ఎన్నికలు అధికార కాంగ్రెస్ పార్టీలో తీవ్ర ఉత్కంఠను రేపుతున్నాయి. శాసనసభలో ఉన్న బలాబలాల దృష్ట్యా, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పోటీకి దిగినా దిగకపోయినా ఈ రెండు స్థానాలు కాంగ్రెస్ వశం కావడం ఖాయం. అయితే, ఈ సులభమైన విజయం కంటే, పార్టీలో ఈ సీట్ల కోసం సాగుతున్న అంతర్గత పోటీ ఇప్పుడు పెద్ద చర్చగా మారింది. కేవలం రెండు స్థానాల కోసం ఏకంగా 16 మంది సీనియర్ నేతలు రేసులో ఉండటం కాంగ్రెస్ హైకమాండ్‌కు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సవాలుగా మారింది..రాజకీయ వర్గాల సమాచారం ప్రకారం, ఈ రెండు స్థానాల్లో ఒకటి ఖచ్చితంగా హైకమాండ్ కోటా కింద ఢిల్లీ నేతలకు కేటాయించే అవకాశం ఉంది. జాతీయ స్థాయిలో పార్టీ అవసరాల దృష్ట్యా ఏఐసీసీ ముఖ్య నేతలను ఇక్కడి నుంచి పెద్దల సభకు పంపవచ్చని చర్చ జరుగుతోంది. ఇక మిగిలిన ఒక్క స్థానంపైనే రాష్ట్ర నేతలందరి కన్ను పడింది.ఈ రెండో సీటును తన ముఖ్యమంత్రి కోటా కింద తనకు అత్యంత సన్నిహితుడైన వేం నరేందర్ రెడ్డికి ఇప్పించుకోవాలని రేవంత్ రెడ్డి గట్టి పట్టుదలతో ఉన్నట్లు తెలుస్తోంది.వేంకు న్యాయం చేయాలని రేవంత్ పట్టుదల..వేం నరేందర్ రెడ్డిని రాజ్యసభకు పంపడం రేవంత్ రెడ్డికి ఒక రాజకీయ అవసరంగా కనిపిస్తోంది. రేవంత్ రెడ్డి తెలుగుదేశం పార్టీలో ఉన్నప్పటి నుంచి వేం ఆయనకు అత్యంత నమ్మకస్తుడైన సహచరుడిగా, వ్యూహకర్తగా ఉంటూ వస్తున్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రికి సలహాదారుగా ఉన్న వేంకు పార్లమెంటు సభ్యత్వం కల్పించడం ద్వారా, తన మాట కాంగ్రెస్ అధిష్ఠానం వద్ద ఎంత బలంగా ఉందో చాటిచెప్పాలని రేవంత్ భావిస్తున్నారు. వేం నరేందర్ రెడ్డికి సీటు సాధించుకోగలిగితే, రేవంత్ రెడ్డి పలుకుబడి గట్టిగానే ఉందని, పార్టీలో ఆయన అప్రహతిహత నాయకత్వం కొనసాగుతోందని సంకేతాలు వెళ్తాయి.హైకమాండ్ ఆలోచన ఏమిటో?ఈ ప్రయత్నం అంత సులభంగా సాగేలా లేదు. పార్టీ కోసం దశాబ్దాలుగా పని చేస్తున్న సీనియర్ నేతలు తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. సామాజిక సమీకరణాలు, ప్రాంతీయ సమతుల్యత వంటి అంశాలను హైకమాండ్ పరిగణనలోకి తీసుకుంటే వేం ఎంపికపై సందిగ్ధత నెలకొనే అవకాశం ఉంది. రేవంత్ రెడ్డి తన విజ్ఞప్తిని ఢిల్లీ స్థాయిలో ఎలా ఒప్పిస్తారో, అందరినీ కాదని తన అనుచరుడికి పట్టం కట్టించుకోగలరో లేదో వేచి చూడాలి. ఈ నియామకం రేవంత్ రెడ్డి రాజకీయ చాణక్యానికి , హైకమాండ్ వద్ద ఆయనకున్న క్రెడిబిలిటీకి ఒక లిట్మస్ టెస్టుగా మారనుంది.

# ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో డిసిసి బ్యాంక్ చైర్మన్ మంచూరు



బద్వేల్ నియోజకవర్గం అనంతరాజపురం (లక్ష్మీపాలెం)లో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం కార్యక్రమాలకు ఉత్సవ కమిటీ సభ్యుల, తెలుగుదేశం పార్టీ నాయకులు, గ్రామ ప్రజల ఆహ్వానం మేరకు కడప డిసిసి బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి హాజరయ్యారు.ఆలయ కమిటీ సభ్యులు గ్రామ ప్రజలు మంగళ వాయిద్యాలతో వేద పండితుల మంత్రోచ్చారణలతో ఘనంగా స్వాగతం పలికారు. సూర్యనారాయణ రెడ్డి గారు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు .ఆలయ చైర్మన్ సంజీవ్ కుమార్ ,కమిటీ సభ్యుల ఒ గ్రామస్తుల అభ్యర్థన మేరకు నూతనంగా తయారుచేసిన స్వామివారి రథానికి సంబంధించి నూతన షెడ్డు నిర్మించాలని కోరారు.వెంటనే స్పందించినసూర్యనారాయణ రెడ్డి గారు తన సొంత నిధులతో షెడ్డు నిర్మిస్తానని కమిటీ సభ్యులకిడస్థానిక ప్రజలు కు తెలియచేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు లక్ష్మీ పాలెం గ్రామస్తులు గానుగపెంట పెద్ద వేమయ్యబుచ్చిరెడ్డి వెంకటరత్నం రెడ్డి, చెంచాని చిన్న గురవయ్య, కాకాని నరసింహ ,పీరయ్య,నల్లి నరసింహులు,సంపతి వెంకటసుబ్బయ్య,అనంతరాజపురం యూత్, ఆలయ కమిటీ తోపాటు చెరుకూరి రవికుమార్ ,పరిటాల వెంకటసుబ్బయ్య, అరవ శ్రీనివాసులు రెడ్డి. బీరం జయరాంరెడ్డి ,కొంకుల రాంబాబు, బి కోడూరు రమణారెడ్డి.12 వ వార్డు కౌన్సిలర్ కృష్ణ యాదవ్.కాల్వపల్లి వీరారెడ్డి, కల్లూరి దుగ్గిరెడ్డి.కుంకుల వెంకటరమణ,అశోక్ కుమార్,తోట రాము, మాచుపల్లి కృష్ణారెడ్డి ,సమరసింహారెడ్డి, కుడుముల చిన్నపరెడ్డి,బోవిళ్ళ నరసింహారెడ్డి, సుబ్బరాయుడు యాదవ్, సాంబశివారెడ్డి విద్యానగర్,బైసాని శివరామిరెడ్డి,రామకృష్ణారెడ్డి కమలకూరుఉప్పత్తి సుబ్బారెడ్డి,మల్రెడ్డి నవీన్ రెడ్డి,కొమ్మూరు గురుప్రసాద్ రెడ్డి, దేవాదాయ శాఖ అధికారులుతదితరులు పాల్గొన్నారు

# ఏపీయూడబ్ల్యూజే,ఐజేయు ప్లీనరీ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి




తుగ్గలి: ఈనెల 14,15,16వ తేదీలలో వరుసగా మూడు రోజులు పాటు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో పాత్రికేయులకు సంబంధించి ఏపీయూడబ్ల్యూజే,ఐజేయు ప్లీనరీ రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయని,ఈ మహాసభలలో ఏపీయూడబ్ల్యూజే జర్నలిస్ట్ యూనియన్ కు సంబంధించిన పాత్రికేయ మిత్రులందరు పాల్గొని జయప్రదం చేయాలని ఏపీయూడబ్ల్యూజే మండల గౌరవ అధ్యక్షుడు మురళీమోహన్ రెడ్డి,అధ్యక్షుడు విజయ్, కార్యదర్శి ఇమాములు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా బుధవారం రోజున వారు మాట్లాడుతూ జర్నలిస్టు మిత్రులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐజేయు ప్లీనరీ రాష్ట్ర మహాసభలలో అన్ని విషయాలపై సుదీర్ఘంగా చర్చించడం జరుగుతుందని,ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరవుతారని,అలాగే దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన పాత్రికేయ సంఘాలకు సంబంధించిన కీలక నేతలు కూడా హాజరవుతారన్నారు.తద్వారా పాత్రికేయ మిత్రులు ఏపీయూడబ్ల్యూజే,ఐజేయు రాష్ట్ర మహాసభలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే మండల ప్రధాన కార్యదర్శి నాగేంద్ర,గౌరవ సలహాదారుడు రాజు,ఉపాధ్యక్షుడు శేఖర్ బాబు,సహాయ కార్యదర్శి హరిచంద్రరెడ్డి, కోశాధికారి భార్గవ్,కమిటీ సభ్యులు హనుమంతు,లక్ష్మన్న,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ విద్యార్థులకు ఫీజు చెక్కుల పంపిణీ చేసిన కేటీఆర్.

## మెడికల్ విద్యార్థులకు అండగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



హైదరాబాద్ పేద విద్యార్థుల ఉన్నత చదువులకు భరోసా కల్పిస్తూ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. బి.ఎల్.ఆర్ (ఃఒఖీ) చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన 16 మంది ఎంబీబీఎస్ (ఓఃూ) విద్యార్థులకు వారి విద్యా సంవత్సరం ఫీజుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతుల మీదుగా జరిగింది.

ఈ సందర్భంగా కేటీఆర్ విద్యార్థులకు చెక్కులను అందజేస్తూ, వారి భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు. కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా, సమాజంలోని పేద విద్యార్థులు వైద్యులుగా ఎదిగేందుకు తన వంతు సహకారాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి ఏటా అనేక మంది విద్యార్థులకు విద్యా ఖర్చుల కోసం ఆర్థిక సాయం చేస్తూ, వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్న లక్ష్మారెడ్డి గారి సేవా దృక్పథం అందరికీ ఆదర్శనీయమని కేటీఆర్ కొనియాడారు.

బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతోనే 'బి.ఎల్.ఆర్ చారిటబుల్ ట్రస్ట్' ద్వారా నిరంతరం ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా వైద్య విద్య అభ్యసించే విద్యార్థులకు ఫీజుల భారం కలగకుండా చూస్తామని, వారు భవిష్యత్తులో గొప్ప వైద్యులుగా మారి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న 16 మంది వైద్య విద్యార్థులు మరియు వారి కుటుంబ సభ్యులు, తమ చదువుకు అండగా నిలిచిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారికి మరియు తమకు శుభాకంక్షలు తెలిపిన కేటీఆర్ గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# పంచాయతీ కార్యదర్శిని అడ్డుకున్న సర్పంచు, గ్రామస్తులు

గుంటూరు కాకుమాను మండలం పాండ్రపాడులో పంచాయతీ కార్యదర్శిని సర్పంచ్ , తదితరులు అడ్డుకున్నారు. గతంలో చేసిన బిల్లులు చేయమంటే చేయటం లేదంటూ ఆవేదన వ్యక్తం చేసారు. బయటకు వెళ్లకుండా అడ్డుకుంటున్నారని కార్యదర్శి అమరేశ్వరరావు పోలీసులకు ఫోన్లో సమాచారం ఇచ్చారు. బిల్లులకు సంబంధించిన బుక్స్ పై కార్యదర్శి సంతకం చేయడం లేదని సర్పంచ్ ఆరోపణ. అక్కడకు చేరుకున్న పోలీసులు కార్యదర్శిని పోలీసు వాహనంలో తీసుకెళ్లేందుకు ప్రయత్నించారుఏ. సర్పంచ్ , వార్డు సభ్యులు పోలీసు వాహనాన్ని అడ్డుకుని బైఠాయించారు.

# మక్క కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలి హరీష్ రావు



సిద్దిపేట ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొంటూ ఆరుగాలం కష్టపడి పండించిన రైతులకు కాంగ్రెస్ పాలనలో కష్టాలు తప్పడం లేదు. షాపుల్లో ఇవ్వాల్సిన యూరియా యాపుల్లో ఇస్తామని ఆర్భాటంగా ప్రకటించి విఫలమైన రేవంత్ సర్కార్, కోతల దశకు వచ్చినా పంట పెట్టుబడి సాయం ఇవ్వలేని దుస్థితికి చేరిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారున.

కనీసం పండించిన పంటైన అమ్ముకుందామంటే కొనుగోలు కేంద్రాల ఏర్పాటులోనూ అదే నిర్లక్ష్యం, వైఫల్యం. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో మద్దతు ధర అందక మక్క రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారు. సిద్దిపేట జిల్లా, నంగునూరు మండలం, ఆరేపల్లి (అక్కెనపల్లి) గ్రామంలో సుమారు 350 ఎకరాల్లో మక్క సాగు చేస్తున్న రైతులు ప్రతి ఏటా నష్టపోతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమని అన్నారు.కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులకు క్వింటాల్కు రూ.300?600 తక్కువ ధరకు అమ్మాల్సి వస్తోంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇది ఒక్క ఆరేపల్లి సమస్య మాత్రమే కాదు..రాష్ట్ర వ్యాప్తంగా మక్క రైతులు ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనేక జిల్లాల్లో కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభమవడం, అసలు ఏర్పాటు చేయక పోవడం, చెల్లింపులు ఆలస్యం కావడం, రవాణా సదుపాయాల లేమి వంటి సమస్యలు రైతులను ఆర్థికంగా కుదేలు చేస్తున్నాయి. ప్రభుత్వం వెంటనే ఆరేపల్లితో పాటు అవసరమైన అన్ని ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, మద్దతు ధర (ఓఃఖ) చెల్లించి మక్కలు కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

# ఘనంగా శ్రీ మహంకాళి అమ్మవారి బ్రహ్మోత్సవాలు



బద్వేలు నియోజకవర్గం బి.కోడూరు మండలం మున్నెల్లి గ్రామ సమీపాన సగిలేరు నది ఒడ్డున వెలసిన శ్రీ మహంకాళీ (అంకాళమ్మ) అమ్మవారి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల మూడవ రోజు కలశస్థాపన అలంకారంలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఘనంగా నిర్వహించబడగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి , ఎమ్మెల్యే డాక్టర్ సుధమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి వేద పండితుల ఆశీర్వాదాలు స్వీకరించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందుకుని వేద పండితులు మరియు ఆలయ కమిటీ సభ్యుల చేత పూలమాలలతో ఘనంగా సత్కారం పొందారు. అనంతరం బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ఎమ్మెల్యే డాక్టర్ సుధమ్మ టెంకాయ కొట్టి శుభారంభం చేయగా, ఇలాంటి ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు గ్రామ ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తాయని, సంప్రదాయాలను తదుపరి తరాలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని వారు తెలిపారు. ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవడం తనకు పవిత్ర ఆనవాయితీగా మారిందని ఎమ్మెల్సీ గారు పేర్కొని, అమ్మవారి కటాక్షం గ్రామ ప్రజలందరిపై ఉండి శాంతి, సౌభాగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కల్లూరి రమణారెడ్డి, ఆలయ ధర్మకర్త ఓబుల్ రెడ్డి ప్రభాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ మాధవరెడ్డి, పులివీడు సర్పంచ్ తిమ్మారెడ్డి రఘునాథరెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు యోగానంద రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, మాల కొండయ్య, పెసల గణేష్, చెన్నకేశవరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రవాస ఆంధ్రులకు ప్రభుత్వం పూర్తి రక్షణ



రాయచోటి, మార్చి 04: ప్రవాస ఆంధ్రుల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం తరఫునుంచి పూర్తి సహాయం అందిస్తున్నా మనీ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి తెలిపారు బుధవారం రాంప్రసాద్ రెడ్డి ఇరాన్ అమెరికా ఇజ్రాయిల్ మధ్య జరుగుతున్న యుద్ధ వాతావరణంపై అక్కడి పరిస్థితుల గురించి తెలుగు ప్రజల కోసం కూటమి ప్రభుత్వం చేపడుతున్న చర్యల గురించి విలేకరుల సమావేశంలో విపులంగా వివరించారు .గల్ఫ్ దేశాల్లో ఎక్కువగా అన్నమయ్య జిల్లా నుండి ఉన్నారు, ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి హామీ ఇచ్చారు.గల్ఫ్ దేశాల్లో యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరంలేదని స్పష్టం చేశారు.ఏపీ ఎన్ ఆర్ డి ఎస్ లో ద్వారా అత్యవసర పరిస్థితుల్లో తాత్కాలిక వసతి, భద్రత, తక్షణ న్యాయ సహాయం, అందిస్తామనీ తెలిపారు.ఢిల్లీలో ఆంధ్ర భవన్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు.ఏపీ లో కూడా 24 గంటల కంట్రోల్ రూమ్ అందుబాటులో ఉందని మంత్రి వెల్లడి. ప్రతి ఒక్కరికి పూర్తి స్థాయి సహకారం అందిస్తామని మంత్రి భరోసా. సమస్యలు ఎదురైతే వెంటనే హెల్ప్‌లైన్‌ను : 0863-2340678వాట్సాప్: +91 85000 27678ఇమెయిల్: ప్రవశ్రీజూశ్రీతినివఏజీజూనితీబిబ.ఇనీఏ సంప్రదించాలని మంత్రి సూచించారు.పేదల సొంతింటి కల నిజం చేస్తున్న కూటమి ప్రభుత్వం×ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, మా కూటమి ప్రభుత్వం పేదలకు సొంత ఇంటి కల సాకారం చేసే దిశగా అడుగులు వేస్తోందిఈ ఏడాది లక్షలాది కుటుంబాలకు గృహ ప్రవేశ భాగ్యాన్ని కల్పించడమే మా లక్ష్యం.క్రీడలు,యువజన సేవలకు రూ. 144.03 కోట్లు మంజూరు కోరుతూ సభలో ప్రతిపాదన.2026?27 ఆర్థిక సంవత్సరానికి డిమాండ్ నం.15 కింద నిధుల అనుమతి కోరిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిరాష్ట్ర శాసనసభలో గౌరవ స్పీకర్ గారిని ఉద్దేశించి క్రీడలు, యువజన సేవల శాఖకు సంబంధించి 2026?27 ఆర్థిక సంవత్సరానికి రూ. 144,03,83,000/- నిధులు మంజూరు చేయాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అధికారికంగా ప్రతిపాదించారు. డిమాండ్ నం.15 కింద ఈ నిధులను క్రీడా మౌలిక వసతుల అభివృద్ధి, యువజన కార్యక్రమాల విస్తరణ, ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రోత్సాహం వంటి అంశాలకు వినియోగించనున్నట్లు వెల్లడించారు.రాష్ట్రంలో క్రీడా రంగం అభివృద్ధి, యువత సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు మంత్రి స్పష్టం చేశారు.క్యాంపు కార్యాలయంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రజాదర్బార్.తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రవాణా యువజన క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించి, సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## కేజీబీవీ విద్యార్థులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్ గరిమ అగ్రవాల్

### బోయిన్ పల్లి కేజీబీవీ ఆకస్మిక తనిఖీ



రాజన్న సిరిసిల్ల ప్రతినిధి మార్చి 04 : బోయిన్ పల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) ను కలెక్టర్ గరిమ అగ్రవాల్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కిచెన్, వంట గది, బియ్యం, పప్పులు, కోడిగుడ్లు ఇతర ఆహార పదార్థాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన సమయం కావడంతో మెనూ పరిశీలించి.. కలెక్టర్ ప్లేట్ తీసుకొని భోజనం తీసుకుని విద్యార్థులతో కలిసి కింద కూర్చొని తిన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? అని ఆరా తీశారు. బుధవారం రోజు తింటున్న ఆహారంలో విటమిన్లు, ప్రోటీన్లు, కార్బోహైడ్రేడ్స్ ఏమి ఉన్నాయో ప్రశ్నించారు? రోజూ ఎంత పరిమాణంలో తీసుకోవాలి.. విద్యార్థులు వార్షిక పరీక్షలకు ఎలా సిద్ధం అవుతున్నారని ప్రశ్నించారు? ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. అనంతరం విద్యాలయం పై అంతస్తు నిర్మిస్తున్న గదులు, టాయిలెట్లు ఇతర పనులపై ఉపాధ్యాయుల నుంచి కలెక్టర్ వివరాలు తెలుసుకున్నారు.పదో తరగతి, ఇతర తరగతుల విద్యార్థులు ప్రతి సబ్జెక్ట్ కు సంబంధించి అన్ని పాఠాలు చదవాలి.. రాయాలి అని సూచించారు. సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, లక్ష్యం నిర్దేశించుకొని ముందుకు వెళ్లాలని పిలుపు ఇచ్చారు. ఉద్యోగం లేదా వృత్తిలో స్థిరపడిన తర్వాత మిగతా విషయాలు ఆలోచించాలని దిశానిర్దేశం చేశారు.

# రామయ్య కళ్యాణోత్సవం తలంబ్రాలు సిద్ధం

భద్రాద్రికొత్తగూడెం శ్రీరామనవమి తిరుకళ్యాణ బ్రహ్మోత్సవాలు మార్చి 27,28 తేదీలలో జరిగే సీతారాముల కళ్యాణం, పట్టాభిషేకం ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయి.అయితే సీతారాముల కళ్యాణంలో ఎంతో ప్రత్యేకతను సంతరించుకున్న తలంబ్రాలు కలిపే ఘట్టం ముగిసింది.సీతారాముల ఉత్సవ మూర్తులకు ప్రత్యేకపూజలు అనంతరం పసుపుకొమ్ములు దంచే కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు అర్చక స్వాములు, మాహిళలు. ముందుగా పసుపుకొమ్ములు దంచే కార్యక్రమం నిర్వహించే వైదిక బృందం సతిమణులు పసుపుకొమ్ములు దంచి పసుపును తయారు చేశారు. అయితే అనంతరం అత్తర్,గులాల్,బుక్క,పసుపు,కుంకుమ,పన్నీర్ వంటి సుగంధ ద్రవ్యాలతో తలంబ్రాలను సిద్ధం చేసారు మహిళలు.కళ్యాణాలలో వాడే తలంబ్రాలు పసుపు రంగులో ఉండటం సహజం కానీ ఒక్క భద్రాద్రి క్షేత్రంలో ఈ సీతారాముల కళ్యాణానికి మాత్రమే తలంబ్రాలు గులాబీ రంగులో ఉండటం ఇక్కడి ప్రత్యేకత. తానిషా కాలం నుండి ఈ సాంప్రదాయం కొనసాగుతుంది. మేళతాళాలు,మంగళ వాయిద్యాలు,పండితుల వేదమంత్రోచ్ఛరణల మధ్య ఈ కార్యక్రమం కొనసాగింది.డోలోత్సవం,వసంతోత్సవలతో రామయ్యను పెళ్ళికొడుకును చేసినట్లుగా ఇక్కడి భక్తులు భావిస్తారు.స్వామివారి తలంబ్రాలు కలపడానికి యావన్మంది భక్తజనం ఉదయం నుండి చిత్రకూట మండపం ఎదుట పడిగాపులు పడి మరీ వేచివున్నారు.పూజాకార్యక్రమాలు ముగిసిన అనంతరం భక్తులను అందరిని స్వామివారి తలంబ్రాలు కలపడానికి అనుమతించడంతో ఒక్కసారిగా భక్తులతో మిథిలా స్టేడియం ప్రాంగణం అంతా భక్త జనంతో నిండిపోయింది.

## హ్వాలీ సంబరాల్లో ఎస్పీ స్టెప్పులు

### భద్రాద్రి కొత్తగూడెం

హ్వాలీ పండుగ సందర్భంగా కొత్తగూడెంలోని హేమచంద్రపురం పోలీస్ హెడ్క్వార్టర్స్లో జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో రంగుల సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ హాజరై పోలీసు సిబ్బందితో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సిబ్బందితో కలిసి ప్రసిద్ధిగాంచిన “బాయిలోనే బల్లి పలికే” పాటకు స్టెప్పులు వేసి అందరినీ ఆకట్టుకున్నారు. సాధారణంగా విధి నిర్వహణలో కఠినంగా వ్యవహరించే ఎస్పీ, పండుగ వేళ స్నేహపూర్వకంగా మెలుగుతూ పోలీసుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపారు.

డ్యాన్స్ చేస్తున్న సిబ్బందిని చప్పట్లతో ప్రోత్సహిస్తూ, వారితో కలిసి సందడి చేశారు. పలు కీలక కేసుల్లో కఠిన చర్యలు తీసుకుని ప్రజల్లో విశ్వాసం సంపాదించిన ఎస్పీ రోహిత్ రాజ్, ఈ హ్వాలీ సంబరాల్లో భాగస్వామ్యమవడం ద్వారా పోలీసు సిబ్బందిలో ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచారు

## శాసనమండలిలో క్రిస్టియన్ అంశంపై దుమారం - క్షమాపణ చెప్పిన అచ్చెన్న - అసలేం జరిగిందంటే?

విజయవాడ, మార్చి 4 ఆంధ్రప్రదేశ్ శాసన మండలిలో శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడకంపై జరిగిన చర్చ తీవ్ర ఉత్కంఠకు, అనూహ్య పరిణామాలకు దారితీసింది. శాసన మండలిలో కల్తీ నెయ్యి అంశంపై చర్చ జరుగుతున్న సమయంలో మంత్రి అచ్చెన్నాయుడు వైసీపీ సభ్యుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పవిత్రమైన శ్రీవారి లడ్డూ ప్రసాదం విషయంలో జరుగుతున్న చర్చను వైసీపీ సభ్యులు అడ్డుకోవడంపై ఆయన ఆవేదన చెందారు. తాను ఇక్కడ మంత్రిగా కంటే, ఒక సామాన్య వేంకటేశ్వర స్వామి భక్తునిగా మాట్లాడుతున్నానని, కోట్ల మంది భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్న ఈ అంశాన్ని రాజకీయం చేయడం తగదని ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలో అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఇతర మతాలను గౌరవించాలని హితవు పలికారు. నేను హిందువును, జగన్ మోహన్ రెడ్డి , చైర్మన్ మోషేన్ రాజు క్రిస్టియన్లు.. ఎవరి మతం వారి ఇష్టం, ఎవరైనా ఏ మతాన్నైనా అనుసరించవచ్చు అని వ్యాఖ్యానించారు. అయితే, ఈ వ్యాఖ్యలు సభలో ఒక్కసారిగా కలకలం రేపాయి. తనను క్రిస్టియన్గా అభివర్ణించడంపై మండలి చైర్మన్ మోషేన్ రాజు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మంత్రి వ్యాఖ్యలకు స్పందించిన చైర్మన్ మోషేన్ రాజు తాను క్రిస్టియన్ను కాదని, హిందువునని సభలో స్పష్టమైన ప్రకటన చేశారు. తన పేరులో మోషేన్ ఉన్నంత మాత్రాన మతం మార్చుకున్నట్టు కాదని ఆయన వివరించారు. చైర్మన్ నుంచి వచ్చిన ఈ స్పష్టీకరణతో మంత్రి అచ్చెన్నాయుడు వెంటనే స్పందించి, తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించారు. తెలియక చేసిన పొరపాటుగా భావించాలని కోరారు. మంత్రి తన వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నప్పటికీ, వైసీపీ సభ్యులు సభలో గందరగోళం సృష్టించడం ఆపలేదు. అచ్చెన్నాయుడు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ తరుణంలో చైర్మన్ మోషేన్ రాజు వైసీపీ సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి వివరణతో తాను సంతృప్తి చెందానని, వ్యక్తిగతంగా తనకే లేని అభ్యంతరం మీకు ఎందుకని ఆయన వైసీపీ సభ్యులనే ప్రశ్నించారు. అయినా వైసీపీ సభ్యులు ఆందోళనలు కొనసాగించారు. లడ్డూ కల్తీపై జరగాల్సిన చర్చ కాస్తా మతపరమైన అంశాల చుట్టూ తిరగడం సభలో చర్చనీయాంశమైంది. అచ్చెన్నాయుడు తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవడం, చైర్మన్ స్వయంగా జోక్యం చేసుకుని సభ్యులను వారించడంతో గొడవ సద్దుమణిగింది.

## 26 లక్షల మంది ఉచిత ప్రయాణం

విజయవాడ, మార్చి 4 ఏపీఎస్ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పిస్తోంది. గత ఏడాది ఆగస్ట్ నుంచి స్త్రీశక్తి పథకం ద్వారా దీనిని అమలు చేస్తోంది. ఈ పథకంతో ఆర్టీసీ బస్సుల్లో మహిళల రద్దీ ఒక్కసారిగా పెరిగిపోయింది. ఈ క్రమంలో ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది.ఏపీ ప్రభుత్వం స్త్రీశక్తి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని కల్పిస్తోన్న విషయం తెలిసిందే. గత ఏడాది ఆగస్టు 15 నుంచి ఈ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం అమలుతో మహిళలు రాష్ట్రంలో ఎక్కడినుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించే సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. దీంతో ఆర్టీసీ బస్సుల్లో మహిళల రద్దీ విపరీతంగా పెరిగిపోయింది. ఆర్టీసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ 92 శాతం దాటుతోంది. ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య పెరగ్గా.. ఉద్యోగం, విద్య వ్యాపార అవసరాల కోసం వారికి ఫ్రీ బస్సు జర్నీ ఉపయోగపడుతుంది. ఇక పురుష ప్రయాణికులు మాత్రం ఏపీఎస్ఆర్టీసీ బస్సుల్లో భారీగా తగ్గారు. ఈ క్రమంలో స్త్రీశక్తి పథకం అమలుపై ఏపీ ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది.ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆర్టీసీ బస్సుల్లో రద్దీ ఎక్కువైంది. దీంతో త్వరలో కొత్త బస్సులను తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఏపీఎస్ఆర్టీసీ అధికారులు స్పష్టం చేశారు. అదనంగా తీసుకురానున్న ఈ బస్సులతో రద్దీ తగ్గుతుందని ప్రకటించారు. దీని వల్ల మహిళలకు మెరుగైన ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి రానుంది. బస్సుల్లో రద్దీ వల్ల మహిళల మధ్య వాగ్వాదాలు చోటుచేసుకోవడం, కండక్టర్లతో గొడవ వంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. కొత్త బస్సుల రాకతో మహిళలకు రద్దీ లేని ప్రయాణ సౌకర్యం రానుంది. ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆర్టీసీకి కూడా ఆదాయం పెరుగుతోంది. ప్రభుత్వం నుంచి రీయింబర్స్మెంట్ రూపంలో ఇప్పటివరకు రూ.1,714 కోట్లు అందాయి.గత ఏడాది ఆగస్టులో స్త్రీశక్తి పథకాన్ని ప్రారంభంగా.. అప్పటినుంచి డిసెంబర్ వరకు రోజు సగటున 25 లక్షల మంది మహిళలు ప్రయాణించారు. అయితే ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి 26 లక్షలకు సంఖ్య పెరిగింది. ఇక మగ ప్రయాణికుల సంఖ్య ఏకంగా 37 శాతానికి పడిపోయింది.

## మండలి ఛైర్మన్ పై అవిశ్వాసం....

విజయవాడ, మార్చి 4 ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఇప్పుడు శాసన మండలి వేదికగా ఒక ఆసక్తికరమైన పోరు మొదలైంది. నిన్న మొన్నటి వరకు ఒకే పార్టీలో ఉండి, ఇప్పుడు బయటకు వచ్చిన ఎమ్మెల్సీలు నేరుగా మండలి ఛైర్మన్పైనే యుద్ధం ప్రకటించే దిశగా అడుగులు వేస్తున్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన ఐదుగురు ఎమ్మెల్సీలు ఇప్పుడు మండలి ఛైర్మన్ మోషేనురాజుపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు సిద్ధమవుతుండటం రాష్ట్ర రాజకీయాల్లో హాట్టాపిక్గా మారింది. తమ రాజీనామాలను ఆమోదించకుండా కాలయాపన చేస్తున్నారనే ఆగ్రహంతో ఉన్న ఈ సభ్యులు, ఛైర్మన్ తీరును నిరసిస్తూ ఈ నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. వైసీపీ నుంచి ఎమ్మెల్సీలుగా ఎన్నికైన ఐదుగురు సభ్యులు పోతుల సునీత, కర్రి పద్మశ్రీ, బల్లి కల్యాణ్ చక్రవర్తి, మర్రి రాజశేఖర్, జయమంగళ వెంకటరమణ తమ పదవులకు ఇప్పటికే రాజీనామా చేశారు. అయితే ఈ రాజీనామాలు సమర్పించి చాలా కాలం అవుతున్నా, మండలి ఛైర్మన్ వాటిని ఇంకా ఆమోదించలేదు. ఛైర్మన్ అనుసరిస్తున్న ఈ వైఖరిపై సదరు ఎమ్మెల్సీలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. రాజీనామాలు ఆమోదించకుండా కావాలనే పెండింగ్ పెండింగ్లో పెట్టారనేది వారి ప్రధాన ఆరోపణ. అందుకే ఆయనపై అవిశ్వాసం పెట్టి, తమ నిరసనను గట్టిగా తెలియజేయాలని వారు భావిస్తున్నారు. కేవలం ఐదుగురు సభ్యులు మాత్రమే కాకుండా, మొత్తం ఎనిమిది మంది ఎమ్మెల్సీలు ఛైర్మన్పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు మొగ్గు చూపుతున్నట్టు సమాచారం. మండలిలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు అవసరమైన సరిపడా సంఖ్యాబలం తమకు ఉందని ఈ సభ్యులు బలంగా నమ్ముతున్నారు. అందుకే ఏ మాత్రం వెనక్కి తగ్గకుండా ఈ దిశగా ముందుడుగు వేస్తున్నారు. ఏపీ రాజకీయాల్లో గతంలో ఎప్పుడూ లేని వింగా మండలి ఛైర్మన్పై అవిశ్వాసం వచ్చే పరిస్థితి ఏర్పడటం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. మరోవైపు ఐదుగురు ఎమ్మెల్సీలు పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారని వైఎస్ఆర్కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే మండలి ఛైర్మన్కు ఫిర్యాదు చేసింది. పార్టీ ఆదేశాలను ధిక్కరించినందున వారిపై అనర్హ వేటు వేయాలని వైసీపీ కోరుతోంది. ఈ ఫిర్యాదుపై స్పందించిన ఛైర్మన్ మోషేన్ రాజు ఇప్పటికే విచారణ ప్రారంభించారు. నాలుగు రోజుల క్రితం ఆయన ఎమ్మెల్సీలు బల్లి కల్యాణ్ చక్రవర్తి, మర్రి రాజశేఖర్లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వారు ఎందుకు రాజీనామా చేశారు. వారిపై ఎవరైనా ఒత్తిడి చేశారా అనే విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఛైర్మన్ జరిపిన విచారణలో బల్లి కల్యాణ్ చక్రవర్తి, మర్రి రాజశేఖర్ తమ వాదనను బలంగా వినిపించారు. తాము ఎవరి ఒత్తిడినో లేదా వేరే ప్రలోభాలు లొంగి రాజీనామా చేయలేదని, తమకు నచ్చిన విధంగా స్వతహాగానే పదవుల నుంచి తప్పుకుంటున్నామని వారు తెలిపారు. అయినప్పటికీ వారి రాజీనామాలు ఆమోదం పొందకపోవడంతో ఇప్పుడు అవిశ్వాసం అనే అస్త్రాన్ని వారు సిద్ధం చేసుకున్నారు.

## తిరుమల నుంచి వస్తుండగా ప్రమాదం

తిరుమల, మార్చి 4 భక్తుల కొంగు బంగారం తిరుమల శ్రీవారిని దర్శించుకోవాలన్న ఆ కుటుంబ ఆశలు అర్ధాంతరంగా ముగిసిపోయాయి. పుణ్యక్షేత్రానికి వెళ్తున్న ప్రయాణం మృత్యులోకానికి తీసుకెళ్లింది. చిత్తూరు జిల్లాలో బుధవారం ఉదయం జరిగిన ఒక భయంకరమైన రోడ్డు ప్రమాదం ఐదుగురు ప్రాణాలను బలి తీసుకుంది. పలమనేరు సమీపంలోని జాతీయ రహదారిపై జరిగిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం ఉదయం పలమనేరు సమీపంలోని జాతీయ రహదారిపై ఒక కారు అతివేగంగా ప్రయాణిస్తుంది. అయితే అదే సమయంలో ముందు వెళ్తున్న లారీని ఈ కారు వెనుక నుంచి బలంగా ఢీ కొట్టింది. ప్రమాదం ఎంత తీవ్రంగా జరిగిందంటే, కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యింది. ఈ ఘోర ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతులలో ఇద్దరు పురుషులు, ముగ్గురు మహిళలు ఉన్నట్టు పోలీసులు ధ్రువీకరించారు.ప్రమాద సమాచారం అందిన వెంటనే పలమనేరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతుల వద్ద ఉన్న వివరాల ఆధారంగా వారు కర్ణాటక వాసులుగా గుర్తించారు. వీరంతా బెంగళూరు నగరంలోని రాజాజీ నగర్ నివాసితులుగా పోలీసులు నిర్ధారించారు. వీరంతా కలిసి తిరుమల శ్రీవారి దర్శనానికి బెంగళూరు నుంచి బయల్దేరగా గమ్యస్థానానికి చేరుకోక ముందే ఈ విషాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మరణించిన వారి వివరాలను పోలీసులు అధికారికంగా ప్రకటించారు. మృతుల్లో వృద్ధులతోపాటు యువతులు కూడా ఉన్నారు. మోహన్దాస్, నాగరాజారావు, కుసుమ, జయంతి, పూజ మృతి చెందారు. ఒకేసారి కుటుంబంలోని, బంధువర్గంలోని ఐదుగురు వ్యక్తులు మరణించడంతో రాజాజీ నగర్లో విషాద ఛాయలు అలముకున్నాయి. పలమనేరు పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు. ప్రాథమిక దర్యాప్తును వేగవంతం చేశారు. ప్రాథమిక విచారణ ప్రకారం, కారు డ్రైవర్ అతి వేగంగా వాహనం నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్టు తెలుస్తోంది. వేగం ఎక్కువగా ఉండటం వల్ల డ్రైవర్ నియంత్రణ కోల్పోయి, ముందు వెళ్తున్న లారీని గమనించలేక ఢీ కొట్టినట్టు పోలీసులు భావిస్తున్నారు.

## పిడిఎఫ్ రైసు స్వాధీనం

పెనమలూరు కృష్ణాజిల్లా పెనమలూరు నియోజకవర్గం గంగూరు లోని గోడౌన్ లో భారీ మొత్తంలో పిడిఎఫ్ రైస్ సివిల్ సప్లై అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సుమారు 2000 నుంచి 2500 బస్తాల బియ్యం దొరికింది. అందులో కొంత భాగం తెల్ల సంచులతోనూ మరి కొంత వీడియోస్ గని బ్యాగుల్లో ఉండటం గుర్తించారు.

## భీమన్న గుడి ఆటవీ ప్రాంతంలో ప్లాస్టిక్ డ్రైవ్

కొమురం భీమ్ ఆసిఫాబాద్ ప్రపంచ వన్యప్రాణి దినోత్సవాన్ని పురస్కరించుకుని అటవీశాఖ ఆధ్వర్యంలో సిర్పూర్ మండలం పెద్దబండ అటవీ ప్రాంతంలో ఉన్నటువంటి భీమన్నగుడి వద్ద అటవీ ప్రాంతంలోని అన్ని నీటి కుంటల వద్ద ప్లాస్టిక్ డ్రైవ్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎఫ్.డి.వో అప్పయ్య పాల్గొని, భక్తులు గుడి పరిసరాల్లో, అటవీ ప్రాంతంలో ప్లాస్టిక్ మరియు ఇతర వ్యర్థపదార్థాలు పారవేసి పరిసరాలు అపరిశుభ్రం చేయకుండా, తిరిగి వెళ్ళేటప్పుడు తమవెంట తీసుకెళ్ళి, డంప్ యార్డ్ లలో గానీ లేదా చెత్త ట్రాక్టర్ లలో గానీ వేయవలసిందిగా కోరారు. ప్లాస్టిక్ మరియు ఇతర వ్యర్థపదార్థాలును అక్కడే వదిలివేయడం వల్ల, వాటిని ఆహారంగా తీసుకుని వన్యప్రాణులకు అపాయం కలుగుతుందని ఆయన అన్నారు. అలాగే ఆలయ పరిసర ప్రాంతాల్లో వంట చేసుకునే వారు నిప్పుని అలాగే వదిలివేయడం వల్ల అడవుల్లో అగ్నిప్రమాదాలు జరిగే ఆస్కారం ఉన్నందున వాటిని పూర్తిగా ఆర్పివేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఎఫ్ఆర్ఓ ప్రవీణ్ కుమార్, డీఆర్వో శశిధర్ బాబు, సెక్షన్ ఆఫీసర్ అక్తర్, ఎఫ్బీవోలు మల్లిఖార్జున్, అరవింద్, హబీబా, రవీనా, సంతోష్, అరుణ్ మరియు వాచర్లు పాల్గొన్నారు.

## పలు హోటళ్లకు బెదిరింపులు

తిరుపతిలో మరోసారి పలు హోటల్ లకు బాంబ్ బెదిరింపులు వచ్చాయి. తిరుపతి లోని కపిల తీర్థం వద్ద రాజ్ పార్క్ హోటల్ కి బాంబ్ బెదిరింపు కాల్ వచ్చింది. పాయ్ వైస్రాయ్ హోటల్, ఉప్పరపల్లి దగ్గర ఉన్న ఎస్ ఆర్ బీ హోటల్ కి బాంబ్ బెదిరింపు ఫోన్లు వచ్చాయి. మంగళవారం నాడు చిత్తూరు కోర్టుకి బాంబ్ బెదిరింపులు మెయిల్ వచ్చిన విషయం తెలిసిందే. నిత్యం హోటల్ లకి అనుమానిత మెయిల్ రావడం గమనార్హం.బాంబ్ బెదిరింపులు మెయిల్ లు రావడం.. పోలీసులు తనికీలు చేయడం, ఏమీ లేదని వెళ్లి పోవడం.. తరచుగా జరుగుతున్న ఘటనలు. ప్రముఖులు విడిది చేసే హోటల్ ల వద్దనే.. ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి

# కల్తీ నెయ్యి, టీటీడీ ఛైర్మన్పై వైఎస్ జగన్ సంచలన ఆరోపణలు

విజయవాడ, మార్చి 4 కలియుగ ప్రత్యక్ష దైవంగా భావించే వేంకటేశ్వరస్వామి కొలువై ఉన్న తిరుమల క్షేత్రం చుట్టూ ఇప్పుడు రాజకీయ దుమారం రేగుతోంది. టిటిడీ చైర్మన్ నియామకం మొదలుకొని, లడ్డూ ప్రసాదంలో వాడే నెయ్యి వరకు అనేక అంశాలపై వైఎస్ఆర్సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తిరుమల పవిత్రతను తన స్వార్థ రాజకీయాల కోసం వాడుకుంటున్నారని, ఇది కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీయడమేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం అనేది కేవలం ఒక సంస్థ మాత్రమే కాదు, అది కోట్ల మంది నమ్మకమని అటువంటి చోట ఛైర్మన్ పదవిలో ఉండే, వ్యక్తికి అచంచలమైన భక్తి, నిబద్ధత, నిష్కలంకమైన వ్యక్తిత్వం ఉండాలని జగన్ పేర్కొన్నారు. అయితే ప్రస్తుత ఛైర్మన్ బీఆర్ నాయుడు నియామకం విషయంలో చంద్రబాబు తప్పుడు నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. జగన్ సోషల్ మీడియా వేదికగా చేసిన పోస్ట్లో ఒక కీలక విషయాన్ని లేవనెత్తారు. ఎన్నికలకు ముందే ఓ బాధిత మహిళ చంద్రబాబుకు లేఖ రాశారని, ప్రస్తుతం టీటీడీ ఛైర్మన్ తనను మోసం చేశారని ఆ లేఖలో పేర్కొన్నారని జగన్ తెలిపారు. ఆడవారి పట్ల ఆయన ప్రవర్తన సరిగా లేదని ఫిర్యాదు చేసినా, చంద్రబాబు దానిని ఏ మాత్రం పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. ఒక బాధ్యత గల స్థానంలో ఉన్న వ్యక్తిగా చంద్రబాబు ఆ ఫిర్యాదుపై విచారణ చేయాల్సింది పోయి, ఇన్ని ఆరోపణలు ఉన్న వ్యక్తికే ఆ పవిత్రమైన పదవిని కట్టబెట్టడం దేవుడి పట్ల భయం లేకపోవడమేనని జగన్ దుయ్యబట్టారు. గత కొంతకాలంగా తిరుమల లడ్డూలో వాడే నెయ్యి నాణ్యతపై స్పందించిన జగన్, తప్పు చేస్తున్నది చంద్రబాబు ప్రభుత్వమేనని ఎదురు దాడికి దిగారు. చంద్రబాబు హయాంలోనే టీటీడీ ల్యాబ్ కొన్ని నెయ్యి ట్యాంకర్లను నాణ్యత లేవని వెనక్కి పంపిందని, కానీ అవే ట్యాంకర్లు వేరే పేర్లతో మళ్లీ టీటీడీకి వచ్చాయని, వాటిని అధికారులు అంగీకరించి లడ్డూ తయారీలో వాడారని జగన్ ఆరోపించారు. ఈ విషయాన్ని కేవలం తానే చెప్పడం లేదని, సీబీఐ- సిట్ వేసిన ఛార్జిషీట్లో కూడా చాలా స్పష్టంగా ఉందని ఆయన గుర్తు చేశారు. మొదటి ఛార్జిషీట్లోని 64, 91 పేజీల్లో, ఫైనల్ ఛార్జిషీట్లోని 44వ పేజీలో ఈ వివరాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. తన హయాంలో జరిగిన తప్పులను ఇతరుల పైకి నెట్టేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని, ఇది ఆయన భక్తి లేని తనానికి నిదర్శనమని జగన్ విమర్శించారు. నెయ్యి కొనుగోలు విషయంలో కూడా భారీ అవినీతి జరుగుతోందని జగన్ ఆరోపించారు. గణాంకాలను వివరిస్తూ... 2014-19, 2019-24 మధ్య నెయ్యి సగటు ధర సుమారు 278 నుంచి 330 రూపాయల మధ్యలో ఉందని ఆయన తెలిపారు. కానీ ఇప్పుడు చంద్రబాబు నాయుడు తన సొంత సంస్థ అయిన హెరిటేజ్కు సంబంధించిన మానుఫ్యాక్చరింగ్ కంపెనీ ఇందాపూర్ డెయిరీకి కిలో నెయ్యి 658 రూపాయల చొప్పున అమ్ముకునేలా 2025 వరకు కాంట్రాక్ట్ కట్టబెట్టారని జగన్ ఆరోపించారు. టీటీడీకి నెయ్యి సరఫరా చేయడాన్ని చంద్రబాబు తన సొంత ఆదాయ మార్గంగా మార్చుకున్నారని, భక్తుల నమ్మకాన్ని వ్యాపారంగా మారుస్తున్నారని ఆయన మండిపడ్డారు. పవిత్రమైన ఆలయాల నిర్వహణలో నిజాయితీ, నిష్ఠ ఉండాలని, కానీ చంద్రబాబుకు అవేవీ లేవని తన పోస్టులో విమర్శించారు జగన్.

# హోలీ వేళ ఆనంద హేల



**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 4 ఫిబ్రవరి 2026** భారత రాష్ట్ర సమితి పార్టీ మణికొండ, నెక్నంపూర్ డివిజన్ నాయకులు పవిత్రమైన హోలీ పండుగ జరుపు కోవడం జరిగినది. హిందూ సంప్రదాయములో ప్రతి పండుగ వెనుక ఒక విశిష్టత దాగి ఉంటుందనీ, పురాణ గాథలతో ముడిపడి దేశ వ్యాప్తంగా హిందువులు జరుపుకునే పండుగగా ప్రతి యేటా ఫాల్గుణ మాసంలోని శుక్ల పక్షం పౌర్ణమి తిథి రోజు జరుపు కోవడం ఆనవాయితీగా చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా హోలీ వేడుకలను నిర్వహిస్తారు. హోలీ సందర్భముగా ఆధ్యాత్మికతో



కూడుకున్న విశేశాలుగా కామ దహనముతో పాటు రంగుల పండుగగా ఎంతో ఘనంగా జరుపుకున్న వారిలో సుమనళిని, రేఖ, అందే లక్ష్మణ్ రావు, ఉపేందర్ రెడ్డి, షేక్ ఆరిఫ్, బిందు, దేవి ప్రియ, కుంభగల్లా ధనరాజ్, గుట్టమీది నరేందర్, జై రామ్, శ్రీధర్, భాను చందర్, ముత్తంగి లక్ష్మయ్య తది తరులు.

## చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి బర్త్ డే సందర్భంగా నిరుపేద విద్యార్థులకు చెక్కులు పంపిణీ





**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి మార్చి 4 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండల పరిధిలో చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి బర్త్ డే సందర్భంగా జె.కె.ఎం.ఆర్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి గారి జన్మదిన సందర్భంగా జే కే ఎం ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద విద్యార్థులకు. 2500. రూపాయల స్కాలర్షిప్ చెక్కులు పంపిణీ చేయడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో. బిజెపి మండల అధ్యక్షులు. పి రామేశ్వర్ రెడ్డి. కెవిఆర్ ట్రస్ట్ కోఆర్డినేటర్. శేఖర్ మరియు జిల్లా కార్యదర్శి లక్ష్మణ్. మండల్ వైస్ ప్రెసిడెంట్ మహిపాల్ రెడ్డి. వీరన్న మధు ప్రవీణ్ మరియు విద్యార్థులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు ఇంత మంచి సేవా కార్యక్రమం చేస్తున్న టు వంటిఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని ప్రజాసేవను ఇంకా ఉన్నతమైన పదవులు స్వీకరించాలని నిరుపేద విద్యార్థులతల్లిదండ్రులు సంతోషం వ్యక్తపరిచారు

## రావులపల్లి లో హోలీ పండుగ సంబరాలో పాల్గొన్న సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి మార్చి 4(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం రావులపల్లి గ్రామంలోమర్పల్లి బి ఆర్ ఎస్ మండల ప్రెసిడెంట్ రావులపల్లి సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి ,హోలీ పండుగ సందర్భంగా గ్రామంలో చిన్నలు పెద్దలు విద్యార్థులు యువకులతో కలిసి సంతోషంగా హోలీ పండుగ సంబరాలు జరుపుకున్నట్టు తెలిపారు, ఆటలన్న పాటలు అన్న ప్రజలు అన్న నాకు చాలా ఇష్టమని నేను అందరితో కలిసి మెలిసి ఉండడం చాలా ఇష్టపడతానని రావులపల్లి సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు, కుల మత వర్గ విభేదాలు లేకుండా అందరం కలిసి హోలీ పండుగ సంబరాలు సంతోషంగా ఉల్లాసంగా ఆర్భాటంగా హోలీ పండుగ జరుపుకున్నామని తెలిపారు

# అంగన్వాడి స్కూల్లో అన్న ప్రసన్న కార్యక్రమం



**ప్రజాబలం దినపత్రిక వేములవాడ మార్చి – 04**వేములవాడ పట్టణంలోని మార్కండేయనగర్ లోని 25 వ వార్డులో బుధవారం రోజున అంగన్వాడి స్కూల్లో ఐ సి డి ఎస్, సి డి పి ఓ సౌందర్య ఆధ్వర్యంలో అన్న ప్రసన్న కార్యక్రమం నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వార్డు కౌన్సిలర్ కొక్కుల బాలకృష్ణ పాల్గొని అన్నప్రసాన్న కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డులో ఇంత చక్కటి కార్యక్రమాన్ని చేయడం చాలా సంతోషంగా ఉందని పిల్లలకు, గర్భిణులకు ప్రభుత్వం అందించే పోషక ఆహారాలను తప్పనిసరిగా తీసుకోవాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ అంజమ్మ, పిల్లలు గర్భవతులు, బాలింతలు, పోషణ్ అభియాన్ రాజ్ కుమార్, అంగన్వాడి టీచర్ కే జ్యోతి, ఆయా, తదితరులు పాల్గొన్నారు.

## ఈ ఆర్ సీ చైర్మెన్ కు స్వాగతం పలికిన కలెక్టర్, ఎస్పీ

**రాజన్న సిరిసిల్ల జిల్లా, మార్చి -04 (ప్రజాబలం ప్రతినిధి)**జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో తెలంగాణ ఈ ఆర్ సీ బుధవారం నిర్వహించిన బహిరంగ విచారణకు హాజరైన తెలంగాణ ఈ ఆర్ సీ చైర్మెన్ డాక్టర్ జస్టిస్ డీ నాగార్జున, కే రఘు, ఈ ఆర్ సీ టెక్నికల్ విభాగం సభ్యుడు, సీ హెచ్ శ్రీనివాస్ రావు, ఈ ఆర్ సీ ఫైనాన్స్ విభాగం సభ్యులకు కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్చం అందజేసారు.

కార్యక్రమంలో సెస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# వేములవాడలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయండి

### జిల్లా ఎస్పీకి వినతిపత్రం అందించిన బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మ్యాకల పర్శరాములు

**ప్రజాబలం దినపత్రిక వేములవాడ మార్చి -04**క్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ పట్టణంలో రోజురోజుకీ పెరుగుతున్న వాహనాల రాకపోకలు ప్రజల సురక్షిత ప్రయాణం కోసం ప్రత్యేక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ను ఏర్పాటు చేయాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మ్యాకల పర్శరాములు జిల్లా ఎస్పీ మహేష్ బి గితే కి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా పిలవబడే శ్రీ రాజరాజేశ్వర స్వామి కొలువుదీరిన వేములవాడ పట్టణంలో రోజు రోజుకి వాహనాల రాకపోకలు పెరుగుతున్నాయని, సుదూర ప్రాంతాల నుంచి భక్తుల వాహనాలు వస్తున్న తరుణంలో దేవాలయం వద్ద వాహనాల రద్దీ అధికమవుతుందని ముఖ్యంగా రద్దీ ఉన్న ప్రాంతాలలో ట్రాఫిక్ నియంత్రణ తప్పనిసరి అవసరం ఉంటుందని ప్రజల భద్రత ప్రమాదాల నివారణ ట్రాఫిక్ క్రమబద్దీకరణ సాధ్యమవుతుందని అందుకోసం ప్రత్యేక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తే ప్రజా రవాణా సులువుగా జరుగుతుందని వారన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహిళ విభాగం జిల్లా అధ్యక్షులు నాగారం కొమురవ్వ, తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ నామినేటెడ్ పోస్టుల భర్తీకి షెడ్యూల్ ఖారారు



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి మార్చి 04 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా** తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో నామినేటెడ్ పోస్టుల భర్తీకి, రంగం సిద్ధమైంది,ఈ

నెలాఖరులోగా ముఖ్యమైన పోస్టులన్నీ బర్తి చేయాలని, షెడ్యూల్ ఖారర్ చేశారు, ఈ మేరకు పది రోజుల శిక్షణ సందర్భంగా,, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులకు, తేదీలను ఖరరు చేసి పేర్లు ఇవ్వాలని ఆదేశించారు, ఈనెల 15లోగా డిసిసి కార్యవర్గం, మండల, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుల, నియామకం 16-25, లోగా మండల,బ్లాక్ కాంగ్రెస్ కార్యవర్గం ఖరారు ఏప్రిల్ 1-30 లోగా బూతు లెవెల్, గ్రామపంచాయతీ, స్థాయిలో అధ్యక్షులు, కార్యవర్గాల,నియమాకం వేయనున్నారు.....

# హోలీ వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజాబలం మార్చ్ 4** బొమ్మలరామారం మండలం గోవింద్ తండాలో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పాల్గొని హోలీ సందర్భంగా తండా వాసులతో కలసి రంగులు చల్లుకొని ఆనందాన్ని పంచుకున్నారు బంజారా సోదర సోదరమనులతో కలసి సాంప్రదాయ నృత్యాలలో పాల్గొని అందరిని ఉత్సాపరిచారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోలీ పండుగ సోదరి భావం ఐక్యతకు ప్రతీక అని అన్నారు గోవింద తండా అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకు ఎప్పుడు సిద్ధంగా ఉంటామని తెలిపారు తండావాసులు ఎమ్మెల్యే కు ఘన స్వాగతం పలికి కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో బొమ్మలరామారం మండల నాయకులు తండా నాయకులు కార్యకర్తలు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# నీటిపారుదల శాఖలో బెస్ట్ బెస్ట్ ఎంప్లాయ్ అవార్డు అందుకున్న బజ్జూరి రమణారెడ్డి

## కలెక్టర్ చేతుల మీదగా అవార్డు స్వీకరించిన రమణారెడ్డి

**ఖమ్మం ప్రతినిధి మార్చ్04 (ప్రజాబలం)** ఖమ్మం జిల్లా లోని ఇరిగేషన్ శాఖలో మధిర డివిజన్ బోనకల్ మండల సబ్ డివిజన్ కార్యాలయంలో వర్క్ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న బజ్జూరి రమణారెడ్డి కి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పంపిన బెస్ట్ ఎంప్లాయ్ అవార్డును టి జీవో రాష్ట్ర అధ్యక్షులు టీఈ జెఎసి రాష్ట్ర సెక్రటరీ జనరల్ మరియు డిప్యూటీ సీఈఓ ఏలూరు శ్రీనివాసరావు చేతులమీదుగా ఈ అందుకోవడం జరిగినది ఈ సందర్భంగా రమణారెడ్డి ని ఘనంగా సన్మానించి ఉద్యోగి తన కలను సాకారం చేసుకోవడంలో ఎంతో కష్టపడి ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా గవర్న మెంట్ కి ఉత్తములుగా సేవ చేసినందుకు లభించే అరుదైన సత్కారంగా జిల్లా కలెక్టర్ పంపిన ఈ అవార్డును తన చేతుల మీదుగా రమణారెడ్డి కి ప్రధానం చేయడం చాలా గర్వంగా ఉందని ఈ సందర్భంగా అభివర్ణించడం జరిగినది. అటు అసోసియేషన్ లో అనేక పదవులు చేయబడుతూ ఇరిగేషన్ శాఖలో జిల్లా అధ్యక్షులుగా కొనసాగడం మరియు తన విధి





తెలంగాణ ప్రభుత్వము

ప్రశంసా పత్రము

గణతంత్ర దినోత్సవము సందర్భముగా శ్రీ/శ్రీమతి / కుమారి ...... బి. రమణా రెడ్డి ......

హోదా ...... వర్క్ ఇన్‌స్పెక్టర్ ...... కార్యాలయము...... డిఇఇ, ఐయస్‌డి నెం. 3, బోనకల్ ......

వారు 2025 వ సంవత్సరములో వారందించిన అత్యుత్తమ సేవలకు గుర్తింపుగా జారీ చేయబడినది.

ఖమ్మం

ది. 26-01-2026

అనుదీప్ దురిశెట్టి I.A.S.,

కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్

ఖమ్మం జిల్లా

నిర్వహణ పర్వంలో కలెక్టర్ నుంచి ఈ సత్కారం పొందడం చాలా సంతోషం కలిగించిందన్నారు ఈ సందర్భంగా రమణా రెడ్డి కి జిల్లా అధికారులు ఉద్యోగులు అనేక ఉద్యోగ సంఘాల నాయకులు మరియు ఉద్యోగస్తులు జిల్లా మండల రాజకీయ నాయకులు తమ అభినందనలు తెలియజేశారు

# రేపు ఎల్లుండి ఆందోల్ నియోజకవర్గం లో మంచినీటి సరఫరా బంద్



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి మార్చి 4 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** అందోల్ నియోజకవర్గం లోని, ప్రజలకు తెలియజేయునది ఏమనగా, పెద్దారెడ్డిపేట 90 (ఎంఎల్ డి, డబ్ల్యూటీపి ) మెయింటెనెన్స్ లో భాగంగా మరియు1000,డయ, పైప్ లైన్, లీకేజీ పునరుద్ధరణ, పనులు జరుగుతున్నందున, సింగూరు ప్రాజెక్టు నుండి మంచినీరు, నిలిపివేసినారు కావున, తేదీ, 05,03,2026, నుండి 06,032026, ఈ రెండు రోజులు, మిషన్ భగీరథ నీటి సరఫరా జరగదు, కావున ఇట్టి విషయంలో ప్రజలు సహకరించగలరని, మిషన్ భగీరథ, అధికారులు తెలియ జేశారు.......

# మర్పల్లి హోలీ పండుగ సంబరాల్లోపాల్గొన్న గ్రామ సర్పంచ్ మదుగు రామేశ్వర్

**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి మార్చి 4 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మర్పల్లి టౌన్ లోహోలీ పండుగ సంబరాల్లోపాల్గొన్న సర్పంచ్ మధుగు రా మేశ్వర్, హోలీ పండుగ సంబరాలు యువకులతో కలిసి సంతోషంగా ఆనందంగా ఉల్లాసంగా హోలీ సంబరాల్లో పాల్గొన్న టు తెలిపారు చిన్ననాటి మధురమైన జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయి పిల్లలమంత కలసి పరిగెత్తుకుంటూ ఒకరి పైన ఒకరు రంగులు చల్లుకునేది ఒకరినీ ఒకరు గుర్తుపట్టినట్టుగా ముఖాలపై రంగులు రుద్దుకొని ఎంతో ఇష్టంగా రంగుల పండుగ జరుపుకునేది మళ్లీ ఈరోజు





అందరితో కలిసి రంగుల పండుగ సంబరాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని సర్పంచ్ మదుగు రామేశ్వర్ తెలిపారు సంబరాల్లో పెద్దలు యువకులు ఆత్మీయులు ప్రతి ఒక్కరు కూడా పాల్గొని ఎంతో సంతోషంగా హోలీ పండుగ జరుపుకున్నట్టు తెలిపారు

# కేజీబీవీ విద్యార్థులతో భోజనం చేసిన కలెక్టర్ గరిమ అగ్రవాల్ బోయినపల్లి కేజీబీవీ ఆకస్మిక తనిఖీ



**రాజన్న సిరిసిల్ల జిల్లా/బోయినపల్లి, మార్చి -04 (ప్రజాబలం ప్రతినిధి)**బోయినపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) ను కలెక్టర్ గరిమ అగ్రవాల్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కిచెన్, వంట గది, బియ్యం, పప్పులు, గుడ్లు ఇతర ఆహార పదార్థాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన సమయం కావడంతో మెనూ పరిశీలించి.. కలెక్టర్ ప్లేట్ తీసుకొని భోజనం తీసుకుని విద్యార్థులతో కలిసి కింద కూర్చొని తిన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? అని ఆరా తీశారు. ఈ రోజు తింటున్న ఆహారంలో విటమిన్లు, ప్రోటీన్లు, కార్బోహైడ్రేడ్స్ ఏమి ఉన్నాయో ప్రశ్నించారు? రోజూ ఎంత పరిమాణంలో తీసుకోవాలి.. విద్యార్థులు వార్షిక పరీక్షలకు ఎలా సిద్ధం అవుతున్నారని ప్రశ్నించారు? ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. అనంతరం విద్యాలయం పై అంతస్తులో నిర్మిస్తున్న గదులు, టాయిలెట్లు ఇతర పనులపై ఉపాధ్యాయుల నుంచి కలెక్టర్ వివరాలు తెలుసుకున్నారు. పదో తరగతి, ఇతర తరగతుల విద్యార్థులు ప్రతి సబ్జెక్ట్ కు సంబంధించి అన్ని పాఠాలు చదవాలి.. రాయాలి అని సూచించారు. సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, లక్ష్యం నిర్దేశించుకొని ముందుకు వెళ్లాలని పిలుపు ఇచ్చారు. ఉద్యోగం లేదా వృత్తిలో స్థిరపడిన తర్వాత మిగతా విషయాలు ఆలోచించాలని దిశానిర్దేశం చేశారు.



# వికారాబాద్,కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి మార్చి 4(ప్రజాబలం)** వికారాబాద్ జిల్లా: వికారాబాద్ మండలానికి చెందిన 72 కళ్యాణలక్ష్మి చెక్కులు, మరియు09 షాదిముబారక్ చెక్కులను మరియు 30 సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులందరికీ ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేసిన తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి, వికారాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పెద్దలు లబ్ధిదారులు పాల్గొన్నట్లు తెలిపారు

## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హోలీ సంబరాలు

## వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మునిసిపల్ చైర్మన్ పుల్కం రాజు



**ప్రజాబలం దినపత్రిక వేములవాడ మార్చి 04**వేములవాడ పట్టణంలోనీ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా హోలీ పండుగను జరుపుకున్నారు. ఈ పండుగ వేడుకల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఆనందంగా రంగులు చల్లుతూ సాంప్రదాయ పద్ధతులతో స్నేహభావం పెంపొందేలా ఐక్యతతో హోలీ పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ హోలీ పండుగ మన సంస్కృతితో ఐక్యత ప్రేమా సోదర భావానికి ప్రతి కానీ సమాజంలో వర్గ మత భేదాలు లేకుండా అందరూ



కలిసిమెలిసి జీవించాలని వీటన్నింటికీ కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలుగా ప్రజలకు తోడ్పడుతుందని వారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సంద్రగిరి శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బుసారెడ్డిపల్లి గ్రామంలో ఘనంగా హోలీ సంబరాలు



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి మార్చి 04 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** మునిపల్లి మండలం బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మంతూరి శేష్ కుమార్,ఆధ్వర్యంలో బుసరెడ్డి పల్లి,గ్రామంలో, ఘనంగా హోలీ సంబరాలు జరుపుకోవాడం జరిగింది,హోలీ పండుగ సందర్భంగా బుసారెడ్డిపల్లి,గ్రామ ప్రజలకు మరియు మునిపల్లి మండల ప్రజలందరికీ మంతూరి శశికుమార్,హృదయపూర్వక హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ రంగుల పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త వెలుగులు నింపాలని ఆయన ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ముఖ్యంగా బుసారెడ్డిపల్లి,గ్రామ ప్రజలు, యువకులు, పెద్దలు అందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకుంటున్నాను. మన గ్రామంతో పాటు మండల ప్రజలందరూ బాగుండాలి, అందరి జీవితాల్లో సంతోషం వెల్లివిరియాలి" అని తెలిపారు.

## బాచుపల్లిలో అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో బారీగా ఆస్తి నష్టం

## 35 దుకాణాలు బుగ్గి.. రోడ్డున పడ్డ వ్యాపారులు



మేడ్చల్ మల్కాజిగిరి మార్చ్ 4 మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాచుపల్లిలో అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో బారీగా ఆస్తి నష్టం జరిగింది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు అంటుకున్నాయి. మంగళవారం రాత్రి సుమారు 10.40 గంటల నుంచి 11 గంటల మధ్య ప్రమాదం జరిగింది. మార్కెట్‌లోని మూడో ఓ షాపునకు సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభం నుంచి నిప్పు రవ్వలు పడ్డాయి. అవి పక్కనే ఉన్న ఫర్నీచర్ షాప్‌నకు అంటుకొని అలా ఆ ప్రాంతమంతా ఒక్కసారిగా అగ్నికీలలు వ్యాపించాయి నిజాంపేట సర్కిల్ ప్రగతి నగర్ కమాన్ సమీపంలోని మియాపూర్ రోడ్డులో ఉన్న ఫర్నీచర్ మార్కెట్‌లో మంటలు చెలరేగడంతో బీభత్సం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో సుమారు 35వరకు దుకాణాలు కాలి బూడిదయ్యాయి. కోట్లాది రూపాయల ఆస్తి నష్టం వాటిల్లింది. అయితే అదృష్టవశాత్తు ఎవరికీ ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా నిర్ధారించారు. మంటలు గమనించిన వెంటనే స్థానికులు అప్రమత్తమై ఆర్పే ప్రయత్నం చేశారు. ఫర్నీచర్ దుకాణాల్లో కలపతోపాటు రెజిన్, పెయింట్లు వంటి త్వరగా మండుకునే వస్తువులు ఉండటంతో మంటలు నిమిషాల వ్యవధిలోనే మార్కెట్ అంతటా విస్తరించాయి. మంటల తీవ్రతకు దుకాణాల్లో ఉన్న గ్యాస్ సిలిండర్లు పేలడంతో పెద్ద ఎత్తున శబ్దాలు వచ్చాయి. ఇది స్థానికులను మరింత భయభ్రాంతులకు గురి చేసింది. మంటలు ఎగసిపడుతుంటే ఏం చేయలేని పరిస్థితి నెలకొంది. ాశ్రీంశీ =ఖుఃం – ఒటిటిలోకి వస్తున్న కార్తీ లేటెస్ట్ చిత్రం.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే.. ఈ ప్రమాదంలో ఆస్తి నష్టం తీవ్రంగా ఉంది. మార్కెట్‌లో మొత్తం 43 నుంచి 60 వరకు షాపులు ఉండగా, దాదాపు 35 షాపులు మంటలకు ఆహుతయ్యాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం,మొత్తం ఆస్తి నష్టం సుమారు 10 కోట్ల రూపాయల వరకు ఉండొచ్చని తెలుస్తోంది. గత ఎనిమిదేళ్లుగా ఇక్కడే వ్యాపారం చేసుకుంటున్న రమాదేవి అనే మహిళ మాట్లాడుతూ తమ షాపులో ఉన్న సుమారు 20 లక్షల రూపాయల విలువైన వస్తువులన్నీ కాలిపోయాయని, తన బిడ్డలతో కలిసికట్టుబట్టలతో బయటకు రావాల్సి వచ్చిందని కన్నీటి పర్యంతమయ్యారు. చాలా మంది వ్యాపారస్తులు తమ షాపుల నుంచి కనీసం చిన్న వస్తువును కూడా తీసుకోలేక పోయారని, తమ జీవితాలు విగత జీవులుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే బాచుపల్లి పోలీసులు, అగ్ని మాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. కూకట్‌పల్లి, జీడిమెట్ల, పటాన్ చెరు, మాదాపూర్ కేంద్రాల నుంచి సుమారు ఐదారు ఫైర్ ఇంజిన్లు మంటలను ఆర్పే పనిలో నిమగ్నమయ్యాయి. వీరికి తోడుగా జిహెచ్ఎంసి వాట్ ట్యాంకర్లు, హైడ్రా, డిఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయి. స్థానికంగా ఉన్న కాలేజీ విద్యార్థులు,యువకులు కూడా మంటలు అదుపులోకి తీసుకొచ్చేందుకు అధికారులకు సహకరించారు. సర్వం కోల్పోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలవాలని బాధితులు వేడుకుంటున్నారు.

## మహోన్నత చరిత్ర కలిగిన ప్రాంతం"గాంధారి ఖిల్లా"

## ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మార్చి 04 :** మంచిర్యాల జిల్లా మందమర్రి మండలంలోని గాంధారి ఖిల్లాకు మహోన్నత చరిత్ర ఉందని ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ అన్నారు. బుధవారం ఉట్నూర్ ఐ టి డి ఎ ప్రాజెక్టు అధికారి కార్యాలయ చాంబర్ లో ఆదివాసీ నాయకపోడు ప్రతినిధులు కొమ్మ భీమన్న, నాల్నేని రమణ,పుస్తక రచయిత మేసినేని రాజన్న లతో కలిసి గాంధారి ఖిల్లా చరిత్ర భాగం-1 పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ పూర్వకాలం ఈ ప్రాంతంలో పాండవులు పర్యటించినట్లు చరిత్ర ఉందని,గిరిజనులు పాండవులను ఆరాధ్య దైవాలుగా కొలుస్తారని తెలిపారు. తెలంగాణలో వనదేవతలను కొలిచే ఆచారం ప్రసిద్ధి పొందిందని,ఈ క్రమంలో గాంధారిఖిల్లా మైసమ్మను దేవతగా కొలుస్తారని తెలిపారు. మహోన్నత చరిత్ర కలిగిన గాంధారి ఖిల్లా ప్రాంత వైభవాన్ని, చరిత్రను భావితరాలకు తెలియజేయాలనే ఉద్దేశ్యంతో పుస్తక రచన చేయడం అభినందనీయమని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఉట్నూర్ సాకేర సర్పంచ్,పుస్తక సహాయ రచయిత దయనేని రమేష్,ఆదివాసి నాయకపోడు సాంస్కృతిక కళ అభివృద్ధి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలని ఆశించడం ఒక రాజకీయ పార్టీ గా మా హక్కు

### ప్రజాస్వామ్యంలో నాయకత్వం ఎవరికి దక్కాలో నిర్ణయించేది బండి సంజయ్ కాదు. ప్రజలే న్యాయ నిర్ణేతలు..

### ప్రజాస్వామ్యంలో పదవులు శాశ్వతం కావు. అవి ప్రజల విశ్వాసంపై ఆధారపడి ఉంటాయి

### కేంద్ర మంత్రి బండి సంజయ్ కి మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్

హైదరాబాద్ మార్చ్ 4 రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలని ఆశించడం ఒక రాజకీయ పార్టీ గా మా హక్కు అని,ప్రజాస్వామ్యంలో నాయకత్వం ఎవరికి దక్కాలో నిర్ణయించేది బండి సంజయ్ కాదు. ప్రజలే న్యాయ నిర్ణేతలని, ప్రజాస్వామ్యంలో పదవులు శాశ్వతం కావు. అవి ప్రజల విశ్వాసంపై ఆధారపడి ఉంటాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ కి మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్ ఇచ్చారు.గాంధి భవన్ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ ఈ దేశానికి పట్టిన గ్రహణం ఎవరో ప్రజలకు తెలుసు. గత 12 ఏళ్లుగా ప్రజలు ఎన్నో కష్టాలు అనుభవిస్తున్నారు. దేశాన్ని



కార్పొరేట్లకు కట్టబెట్టి తమాషా చూస్తున్నారు. దేశ సార్వభౌమత్వాన్ని అమెరికాకు తాకట్టు పెట్టిన మీరా మాట్లాడేది..?మీరు అధికారంలోకి వచ్చిన తర్వాత పరిపాలన వ్యవస్థలు అస్తవ్యస్థంగా మారింది..ప్రభుత్వ రంగ సంస్థలు తెగనమ్ముతున్నారు..ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని,..పేదలను ఆదుకునే ప్రయత్నం చేయలేదు..విద్వేషాన్ని రెచ్చగొట్టి మైనార్టీ లను అణగారిన వర్గాలను బూచిగా చూపి మీరు అధికారాన్ని చెలాయిస్తున్నారు.. నిత్యం మతవిద్వేశాలు రెచ్చగొడుతూ రాజకీయం చేస్తున్నారని విమర్శించారు...కేంద్ర దర్యాప్తు సంస్థలను ఈడి సీబీఐ కేసులతో విపక్ష ప్రభుత్వాలను కూలుస్తు ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తున్న రాజకీయం మీది..దేశ ఐక్యత కోసం కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు పాదయాత్ర చేసి దేశ ప్రజలకు ఐక్యతను చాటి మీ ప్రభుత్వానికి నిద్ర లేకుండా చేస్తున్న రాహుల్ గాంధీ గారిని విమర్శించడం ఆకాశం మీద ఉమ్మిస్తే మీ ముఖం మీదే పడుతుంది ఆ వాస్తవాన్ని బండి సంజయ్ తెలుసుకోవాలి..రెండు సార్లు ఎంపీగా గెలిచి కేంద్ర మంత్రి అయి తెలంగాణ

## చదువులు గాలికి వదిలేసి గాంధీ విగ్రహానికి డబ్బులు తగిలిస్తున్న రేవంత్ ఖాన్ ప్రభుత్వం



హైదరాబాద్ మార్చ్ 4 ; విద్యా ఉద్యోగాలను తుంగలో తొక్కేసి ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పిన రేవంత్ ఖాన్ ప్రభుత్వం విద్యను పట్టించుకోకుండా విద్యార్థులకు ఇవ్వాల్సిన స్కాలర్షిప్లు ఇవ్వకుండా కళాశాలలో ఇవ్వవలసిన రీయంబర్స్మెంట్ ఫీజులు కూడా ఇవ్వకుండా విద్యార్థుల జీవితాలతో ఆదుకుంటుందని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మరియు ఖైరతాబాద్ నగర కార్యదర్శి ఎం.ప్రణయ్ కుమార్ విమర్శించారు.అన్ని ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా కూడా ప్రైమరీ స్థాయి నుంచి యూనివర్సిటీ స్థాయి వరకు ఖాళీగా ఉన్న ఉద్యోగాలలో ఏ ఉద్యోగాన్ని భర్తీ చేయకుండా రేవంత్ ప్రభుత్వం సమస్యలను గాలికి వదిలేసిందని దుయ్యబట్టారు.ప్రస్తుతం ఏ వీధిలో చూసినా ఏ గ్రామంలో చూసినా గాంధీ విగ్రహాలకు కొదవలేదు. కానీ ప్రత్యేకంగా రేవంత్ స్థాపించే గాంధీ విగ్రహానికి అంత ప్రాధాన్యత ఎందుకు ఇస్తున్నారో అర్థం కావడం లేదు. రేవంత్ రెడ్డికి రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం పైన లేని ఆత్రుత గాంధీ బొమ్మ పైన మాత్రమే ఎందుకు ఉందో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేసారు.53,463 మందికి విద్యార్థులకు చెల్లించాల్సిన స్కాలర్షిప్లు 9000 కోట్లు ఉన్నప్పటికీ వాటిని పట్టించుకోకుండా గాంధీ విగ్రహం కొరకు 5000 కోట్లు ఖర్చు పెట్టాలనుకోవడం ఆయన ప్రజా పాలన అని చెప్పుకునే ప్రభుత్వానికి ఎంతవరకు సార్థకం అవుతుందో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. సమాజంలో విద్య ఆరోగ్యం మెరుగుపడినప్పుడు మాత్రమే సమ సమాజ అభివృద్ధి చెందినట్లుగా భావిస్తుంటాం. కానీ రేవంత్ రెడ్డి దృష్టిలో గాంధీ విగ్రహం నెలకొల్పుకుంటే రాష్ట్ర అభివృద్ధి జరిగినట్లుగా భావిస్తుందని అనుకోవడం ఆయన అవగాహన లోపాన్ని తెలియజేస్తుందన్నారు. ప్రజా సమస్యలు పట్టని రేవంత్ రెడ్డికి తనను నిలువునా కోసినా కూడా డబ్బులు లేవని పత్రికా ప్రకటనలు ఇచ్చిన వ్యక్తికి ఈరోజు గాంధీ విగ్రహం నెలకొల్పడానికి డబ్బులు ఎక్కడి నుంచి వస్తున్నాయో బహిరంగంగా ప్రకటించాలని డిమాండ్ చేసారు.

## బహ్రెయిన్ లో చిక్కుకుపోయిన 150 మంది

హైదరాబాద్, మార్చి 4 గల్ఫ్ దేశాల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా బహ్రెయిన్‌లో సుమారు 150 మంది తెలుగువారు చిక్కుకుపోయారు. ఇరాన్-అమెరికా మధ్య యుద్ధ వాతావరణం నెలకొనడంతో విమాన సర్వీసులు రద్దు కావడమే ఇందుకు కారణం. బాధితుల్లో హైదరాబాద్‌కు చెందిన ఏడుగురు సభ్యుల బృందం కూడా ఉంది. తమను స్వదేశానికి తరలించేందుకు తెలంగాణ ప్రభుత్వం చొరవ తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.హైదరాబాద్ రాంనగర్‌కు చెందిన ఏడుగురు సభ్యుల బృందం గడిచిన ఫిబ్రవరి 24న బహ్రెయిన్ రాజధాని మనామాకు వెళ్లింది. వీరిలో కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం రాష్ట్ర నాయకుడు గోనె సాల్మన్ రాజు కూడా ఉన్నారు. వీరంతా ఫిబ్రవరి 28న తిరిగి భారత్‌కు రావాల్సి ఉండగా, ఎయిర్‌పోర్టులో ఉన్న సమయంలోనే విమానాలను రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.దీంతో తమతో పాటు ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన సుమారు 150 మంది వరకు ఎయిర్‌పోర్టులోనే చిక్కుకున్నట్లు సాల్మన్ రాజు తెలిపారు. వారంతా ప్రస్తుతం ఎయిర్‌పోర్టుకు సమీపంలోని తెలుగు ప్రవాసీయుల ఇళ్లల్లో ఆశ్రయం పొందుతున్నట్లు పేర్కొన్నారు. తమను సురక్షితంగా భారత్‌కు తరలించేందుకు ప్రభుత్వం ప్రత్యేక విమానాలు ఏర్పాటు చేయాలని కోరారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com